అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం 14-01-2025
సంపుటి : 10 | సంచిక : 326 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

26 నుంచి కొత్త రేషన్‌కార్డులు

గ్రామసభ, వార్డు సభలో చర్చించి అర్హుల జాబితాకు ఆమోదం

- జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ ప్రక్రియకు బాధ్యులు
- ఒక వ్యక్తి ఒకే కార్డులో ఉండేలా చర్యలు
- మార్గదర్శకాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 26 నుంచి అర్హత ఉన్న కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులను జారీ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్ సోమవారం కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఆహార భద్రత (రేషన్) కార్డుల మంజూరు కోసం దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న వినతులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగు ముందుకేసిందని తెలిపారు. అర్హత ప్రమాణాలు, విధానాలను పరిశీలించడం కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించిందని గుర్తు చేశారు. ఈనెల నాలుగో తేదీన ఆ ఉపసంఘం సిఫారసులను మంత్రిమండలి ఆమోదించిందని వివరించారు. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్‌కార్డుల్లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపించామని తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీవో/పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/జిల్లా ...11లో

జమ్మూలో జడ్-మోడ్ టన్నెల్ ప్రారంభం

రాష్ట్ర హోదా పునరుద్ధరణ ఎప్పుడో చెప్పని మోడీ



సోనామార్గ్ : కాశ్మీర్‌లోని గాండెర్బల్ జిల్లాలో నిర్మించిన జడ్- మోడ్ టన్నెల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్‌లో నూతన రహదార్లు, రైల్వే లైన్ల గురించి వివరాలు తెలిపారు. అయితే జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా మళ్లీ ఎప్పుడు పునరుద్ధరిస్తామో అనే విషయం చెప్పలేదు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ...11లో

మరిన్ని పెట్టుబడులు తెద్దాం

దావోస్ పర్యటన లక్ష్యం అదే.. తెలంగాణను స్వర్గధామం చేయాలి

- హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచ వేదికపై చాటాలి : గతేడాది ఒప్పందాలు, కార్యకలాపాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- పాల్గొన్న ఐటీ శాఖమంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులు



పరిశ్రమల శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెట్టుబడులకు కేరాఫ్ తెలంగాణ అని మరోసారి దావోస్ వరల్డ్ ఎకనామిక్స్ ఫోరమ్‌లో రుజువు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పరిశ్రమల శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'గతేడాది ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి. అవి ఏయే దశలో ఉన్నాయి' అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. "గతేడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చాయి. 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి" అని అధికారులు సీఎంకు వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయనీ, ఏడు ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయని తెలిపారు. కంపెనీల వారీగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబు తో సీఎం చర్చించారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణపై చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణముందని అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్‌సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్‌లో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తుందని దీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులన్నీ తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా ...10లో



ఆదాయపు పన్ను పరిమితిని రూ.8 లక్షలకు పెంచండి

కేంద్ర బడ్జెట్‌లో విద్యకు పది శాతం నిధులు కేటాయించండి

- మధ్యాహ్న భోజన పథకాన్ని 12వ తరగతి వరకు అమలు చేయండి
- సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతుల కోసం రూ.5 వేల కోట్లు ఇవ్వండి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.ఎనిమిది లక్షల వరకు పెంచాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్నేండ్లుగా ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచడం లేదని పెంచడం లేదని తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సోమవారం ఆయన లేఖ రాశారు. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మేలు కలిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కరువు భత్యం (డీఏ) పన్ను పరిధిలోకి రాకుండా చూడాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరల సూచీకి అనుగుణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు ఉండేందుకు ప్రభుత్వాలు డీఏ చెల్లిస్తాయని గుర్తు చేశారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పది శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల కోసం రూ.ఐదు వేల కోట్లు ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి నిధులను పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనం కార్మికుల పారితోషికాన్ని పెంచాలని తెలిపారు. ఈ పథకాన్ని తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు అమలు చేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ...11లో

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు

- జూబ్లీహిల్స్‌లోని ఓ టీవీ చానెల్ ఆఫీస్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కరీంనగర్ రివ్యూమీటింగ్ గొడవ ఘటనలో క్రిమినల్ కేసులు నమోదు 2లో..
- రాత్రి 11గంటలకు కరీంనగర్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు

నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్లు

కూసుమంచిలో నమూనా ఇందిరమ్మ మోడల్ ఇల్లు ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కులం లేదు.... మతం లేదు... ఏ పార్టీ అని అడగం.... సంక్షేమం ఇస్తే వచ్చేసారి మా పార్టీకి ఓటు వేయాలనే నిబంధన పెట్టం...కేవలం పేద అయితే చాలు.. ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకానికి అర్హుడేనని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచిలోని మండల రెవెన్యూ ఆఫీస్ ప్రాంగణంలో నిర్మించిన నమూన ఇందిరమ్మ ఇండ్లను మంత్రి సోమవారం ప్రారంభించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో ఈ ఆనందం ప్రతిరోజు ఇలానే ఉండే విధంగా దీవించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏందో ప్రతి తెలంగాణ బిడ్డకు తెలుసని అన్నారు.



తెలంగాణ రాష్ట్రాన్ని ఆనాడు పెద్దలు ఎలా కొల్లగొట్టారో తెలుసని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లమీద ఈ ప్రభుత్వం ఎంత చిత్త శుద్ధితో ఉందో చెప్పడానికి మొదటి విడతగా మొదటి సంవత్సరంలోనే నాలుగున్నర లక్షల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాబోయే ...11లో

పండుగలు సాంస్కృతిక పునర్జీవనానికి వారధులు

కైట్ ఫెస్టివల్‌తో పెరగనున్న నగర ఖ్యాతి

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆకట్టుకున్న హైదరాబాద్ పతంగుల పండుగ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పండుగలు, స్థానిక వేడుకలు సాంస్కృతిక పునర్జీవనానికి వారధులని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రాంభించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న సాంకేతికతతో జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయలు కనుమరుగ వుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో పెడధోరణులు వ్యసనాలు పెరిగిపో తున్నాయని వ్యాఖ్యానించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో పండుగలు, వేడుకల అవసరం ఎంతో ఉందని గుర్తు చేశారు. హైదరాబాద్ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టేలా మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్న ఈ పతంగుల వేడుక నగర ఖ్యాతిని మరింత పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ డా.వెన్నెల గద్దర్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సంకేపల్లి సుధీర్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, ...11లో

జపాన్‌లో భూకంపం..



- రిక్టర్ స్కేల్‌పై 6.9 తీవ్రతతో ప్రకంపనలు
- సునామీ హెచ్చరికలు జారీ 11లో..



డమ్మీ హామీల్లాగా..డమ్మీ రుణమాఫీ చెక్కులిస్తున్నారా?

- రుణమాఫీ డబ్బులు రైతుల అకౌంట్‌లో ఎందుకు పడట్లేదు
- రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు 11లో..

నలుగురు పిల్లల్ని కంటే.. రూ.లక్ష నజరానా



- ఎక్కువ మంది సంతానాన్ని కనండి : బ్రాహ్మణులకు మధ్యప్రదేశ్ బోర్డు పిలుపు
- ఇదేమి జాడ్యం : మహిళా సంఘాల మండిపాటు 11లో..

హిందూత్వ వాదుల నయా ఎత్తుగడ

ముస్లిం పేర్లతో విద్వేష ప్రచారం సోషల్ మీడియా వేదికగా పోస్టులు



ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం మహా కుంభమేళా ప్రారంభమైంది. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే ఈ మత కార్యక్రమానికి విస్తృత భద్రత కల్పించారు. కుంభమేళాలో బాంబు పేలుడు జరుపుతామని, కనీసం వెయ్యి మంది భక్తులను హతమారుస్తామని హెచ్చరిస్తూ సోషల్ మీడియాలో నాసిర్ పఠాన్ పేరిట ఓ పోస్ట్ పెట్టారు. దీనిపై స్పందించిన పోలీసులు విచారణ జరపగా దిగ్భ్రాంతికరమైన విషయం వెలుగు చూసింది. పోస్టు పెట్టింది 11వ తరగతి చదువుతున్న 17 సంవత్సరాల విద్యార్థి. అతని పేరు ఆయుష్ కుమార్ జైస్వాల్. నాసిర్ పఠాన్ పేరుతో నకిలీ ఖాతా ప్రారంభించి తప్పుడు పోస్టులు పెడుతున్నాడని తేలింది.



న్యూఢిల్లీ : ముస్లింల పేరుతో సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు లేదా ఈ-మెయిల్స్ తెరిచి, వాటి ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం ఇదేమీ మొదటిసారి కాదు.జైస్వాల్ కేసులో పోలీసులు అతని ఐపీ అడ్రస్‌ను గుర్తించి బీహార్‌లోని పూర్నియా జిల్లాకు చెందిన వాడని తెలుసుకున్నారు. జైస్వాల్‌ను అరెస్ట్ చేసి వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా ఇలా చేయడం హిందూత్వ సంస్థల పాత ఎత్తుగడేనని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అపూర్వానంద్ చెప్పారు. గతంలో కూడా అనేక సందర్భాలలో దేవాలయాల ఎదుట జంతు కళేబరాలను, మాంసాన్ని పడవేశారని, అది హిందూత్వ వాదుల పనేనని తేలిందని, ముస్లింలను అప్రదిష్టపాలు చేయడానికి వారి పేర్లను వాడారని ఆయన వివరించారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్ట్ కార్చిచ్చులా వ్యాపించిందని, ఒకవేళ అసలు నిందితులు పట్టుబడినా వారికి ఎలాంటి శిక్ష పడుతుందో తెలియదని అపూర్వానంద్ వ్యాఖ్యానించారు.

సూత్రధారి, పాత్రధారి అతనే

2023 డిసెంబర్ 27న లక్నోకు చెందిన దేవేంద్ర తివారీ సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేస్తూ జుబర్ ఖాన్ అనే వ్యక్తి నుండి ...11లో



అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఆదివారం రాత్రి రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి గెస్ట్ హౌస్‌కు చేరుకున్న మంత్రికి కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం మంత్రి రెబ్బెన, ఆసిఫాబాద్, కెరమెరి మండలాల్లో రూ.6 కోట్ల పైచిలుకు పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. పట్టణాలను, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌశిక్‌రెడ్డిపై మూడు కేసులు నమోదు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు జగిత్యాల ఎమ్మెల్యే ఫిర్యాదు
- గాడిదకు ఎమ్మెల్యే 'పాడి' ఫొటో అతికించి ఊరేగింపు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన పలు సంక్షేమపథకాల కార్యాచరణ ప్రణాళిక, సమీక్షా సమావేశం సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో గొడవకు దిగిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌పై కాంగ్రెస్ నేతలు కన్నెర్ర జేశారు. కరీంనగర్ గ్రంథలాయ సంస్థ చైర్మెన్, జగిత్యాల ఎమ్మెల్యే పీఏ, ఆర్డీఓ ఫిర్యాదుతో నగరంలోని వన్‌టౌన్‌లో మూడు కేసులు వేర్వేరుగా నమోదు అయ్యాయి. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అదేరోజు నేరుగా హైదరాబాద్ వెళ్లి మర్నాడు స్పీకర్ గడ్డంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో పలు సందర్భాల్లో కౌశిక్‌రెడ్డి దూకుడుతో కేసులపాలైనా తీరు మారడం లేదని, ప్రజాప్రతినిధిగా జనం సమస్యలపైనా, అభివృద్ధిపైనా మాట్లాడిన అధికారిక సమావేశాల్లోనూ రాజకీయ రగడ సృష్టిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు ఆగ్రహించారు. వేర్వేరుగా నిర్వహించిన మీడియా సమావేశాల్లో కౌశిక్‌రెడ్డిని తన ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలో కాంగ్రెస్ నేతలు గాడిదకు పాడి కౌశిక్‌రెడ్డి ఫొటో అతికించి ఊరేగించారు. కాగా కరీంనగర్ మీటింగ్‌లో కావాలనే కౌశిక్‌రెడ్డిని పోలీసులచేత బయటకు గెంటించారంటూ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం విచారణకు త్వరలో కేసీఆర్‌కు పిలుపు ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



కాళేశ్వరం ప్రాజెక్టు న్యాయ విచారణకు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. న్యాయ కమిషన్ ఆయన్ను విచారణకు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. కమిషన్ చైర్మెన్‌కు సహకరించే కోఆర్డినేషన్ కమిటీ అధికారుల సమాచారం ప్రకారం ఫిబ్రవరి రెండో వారంలో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని భావిస్తున్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ సర్కారు హయాంలో దాదాపు రూ. 85 వేల కోట్లతో కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టును నిర్మించిన విషయం తెలిసిందే. ఇంకా ఈ ప్రాజెక్టుకు రూ. 45 వేల కోట్లు అవసరమని కాగ్ రిపోర్టులో పేర్కొన్నారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు విఫలమయ్యాయి. పిల్లర్లు కుంగిపోవడం, సీపేజీలు(బుంగలు)రావడం తదితర పరిణామాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు నిర్మాణం, డిజైన్లు, ప్రణాళిక అంతా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జరిగిన సంగతి విదితమే. దీనిపై సీఎం రేవంత్ సర్కారు న్యాయ విచారణ కమిషన్‌ను నియమించింది. ఏసీబీ విచారణలో కాళేశ్వరం నిర్మాణం లోపభూయిష్టంగా జరిగిందనీ, అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని నివేదిక ఇచ్చింది. అలాగే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) సైతం ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచరాదని నివేదికలో తెలియజేసిన విషయం విదితమే. దీంతో న్యాయ కమిషన్ ఈనెలాఖరులో మాజీ మంత్రులు ఈటల రాజేందర్, తన్నీరు హరీశ్‌రావును సైతం విచారణకు పిలవనున్నట్టు సమాచారం. అనంతరం ఫిబ్రవరిలో బీఆర్ఎస్ అధినేతకు తాఖీదులు పంపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భర్తను చంపిన ఇద్దరి భార్యలు

- శారీరకంగా కూతుర్ని వేధిస్తుండడంతో రోకలిబండతో కొట్టిహత్య !

నవతెలంగాణ-చివ్వెంల

ఓ తండ్రి తన కన్న కూతురితో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆగ్రహించిన అతని ఇద్దరు భార్యలు కలిసి రోకలిబండతో కొట్టి హత్య చేశారు. ఈఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుర్రంతండాలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంతండాకు చెందిన రత్నావత్ సైదులు(40) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా తన కూతురును శారీరకంగా వేధించడాన్ని భరించలేక అతని ఇద్దరి భార్యలు అతను నిద్రిస్తున్న సమయంలో రోకలి బండతో కొట్టారు. దీంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా సూర్యాపేట డీఎస్పీ రవి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. మృతుని చిన్నమ్మ కళావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిమ్‌లపై జిమ్మేదార్ ఎవరు?

శరీర సౌష్టవం కోసం కోరి కష్టాలు

- మోతాదుకు మించి వర్క్ ఔట్స్
- కండల పెంపునకు విచ్చలవిడి ప్రోటీన్ పౌడర్స్
- వాడితే అనారోగ్య సమస్యలు : వైద్యుల హెచ్చరిక
- పర్సనల్ ట్రైనర్లతో కొందరి కాపురాల్లో చిచ్చు
- పట్టించుకోని పోలీసులకు 'ఉచిత' వెసులుబాటు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఆరోగ్యం కోసం ఆహారం ఎంత ముఖ్యమో...వ్యాయామం అంతే కీలకం. అటువంటి వ్యాయామానికి రకరకాల వేదికలున్నా...శరీరాకృతిని నచ్చిన విధంగా మలుచుకునేందుకు తోడ్పడేవి జిమ్‌లు (వ్యాయామశాలలు) మాత్రమే. అందుకే జిమ్‌లకు నానాటికి ప్రాధాన్యత పెరుగుతోంది. ఇటీవలికాలంలో ఎక్కువగా యువత జిమ్‌లపై ఆసక్తి చూపుతోంది. గత కొన్నిరోజులుగా మహిళలు, విద్యార్థినులు సైతం జిమ్‌లలో వర్క్‌ఔట్స్ చేస్తున్నారు. చెమటలు చిందిస్తూ శరీరంలో కొవ్వు తగ్గించుకుంటున్నారు. కొందరు సంపన్నులు పర్సనల్ ట్రైనర్లను సైతం



నియమించుకుంటున్నారు. ఇటు యువత మోజును...అటు మహిళల ఆసక్తిని జిమ్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. కండలు వేగంగా పెరిగేందుకు ప్రోటిన్ పౌడర్లు, ఇతరత్రా మెడిసిన్‌లను ఎలాంటి టెస్టులు లేకుండా అంటగడుతున్నారని తెలుస్తోంది. అంతేకాదు జిమ్‌ల మాటున కొన్ని అసాంఘిక చర్యలు సాగుతున్నాయనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇవీ పోలీసుల దృష్టికి కూడా వస్తున్నా...వారు జిమ్ పరికరాలు, సర్వీసెస్‌ను ఉచితంగా వినియోగించుకుంటూ పట్టనట్టే వ్యవహరిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

నియంత్రణలేని మెడికల్ అండ్ డ్రగ్స్...

జిమ్‌లలో వినియోగించే మెడికల్ అండ్ డ్రగ్స్ విషయంలో ఎటువంటి నియంత్రణ లేకపోవడం కూడా చేటు చేస్తోంది. కండలు బాగా పెరుగుతాయని, సిక్స్ ప్యాక్, ఎయిట్ ప్యాక్ శరీర సౌష్టవం ఇట్టే రాబట్టచ్చని జిమ్ నిర్వాహకులు ప్రోటిన్ పౌడర్‌లను అంటగడుతున్నారు. డాక్టర్ల సలహా లేకుండా వాడకూడని ఔషధాలను ఇస్తున్నారు.

రూ.15వేలకు పైగా విలువ చేసే ఈ ప్రోటిన్ పౌడర్లను వినియోగిస్తే ప్రాణాంతక సమస్యలకు దారితీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిమ్‌లో కసరత్తులు చేసేవారిని టార్గెట్‌గా చేసుకొని కొందరు స్టెరాయిడ్‌గా పనిచేసే కొన్ని రకాల మందులనూ సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. వీటివల్ల కండలు వేగంగా పెరిగినా వాడకం నిలిపివేస్తే ఆ మనిషి నీరుగారిపోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండెపోటు, హైబీపీ, నిద్రలేమి వంటి అనారోగ్య సమస్యలకు ఇవీ దారితీస్తాయని సూచిస్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో కొద్దిరోజుల క్రితం కొన్ని ముఠాలతో కలిసి జిమ్ యజమాని, ట్రైనర్, రిసెప్షనిస్టులు మెఫెంటర్మైన్ ఇంజెక్షన్‌లను సరఫరా చేసిన కేసులు పోలీసుస్టేషన్లలో నమోదయ్యాయి. నిషేధిత డ్రగ్స్ వాడి కండలు పెంచుకోవడం వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ డ్రగ్ కంట్రోల్ అధికారులు జిమ్‌ల వైపు చూడటం లేదు. నెలకు రూ.లక్షల్లో వేతనాలు పొందే పోలీసు అధికారులు జిమ్‌ల కనీస రుసుం రూ.2,500 చెల్లించకుండా వాటినిఉచితంగా వినియోగించుకుంటూ అక్కడ జరిగే అసాంఘిక చర్యలు, లోటుపాట్లను పట్టించుకోకుండా వదిలివేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరి నియంత్రణ లేకపోవడంతోనే జిమ్‌లలో అనేక లోటుపాట్లు చోటుచేసుకుంటున్నాయని పలువురు అంటున్నారు.

ప్రభుత్వ నియంత్రణ లేకపోవడమే కారణం

జిమ్‌లపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతుందని పలువురు అంటున్నారు. జిమ్‌లపై డ్రగ్ కంట్రోల్, తూనికలు కొలతలు, స్పోర్ట్స్ అథారిటీ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖల్లో వేటికి వీటిపై నియంత్రణ లేకపోవడంతోనే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు అంటున్నారు. కాబట్టి వీటిని ఏదైనా ప్రభుత్వశాఖ నియంత్రణలోకి తేవాలని కోరుతున్నారు.

పర్సనల్ ట్రైనర్ల పైశాచికం...

జిమ్‌లను వినియోగించుకునే మహిళలు, యువతుల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరుగుతోంది. ఒక్క ఖమ్మం నగరంలోనే 15కు పైగా జిమ్‌లు ఉండగా హైదరాబాద్ వంటి నగరాల్లో వేలసంఖ్యలో ఉన్నాయి. వీటిలో సగానికి పైగా జిమ్‌లలో 10నుంచి 20 మంది మహిళలు ట్రైనింగ్ తీసుకుంటున్నారు. వీరిలో కొంతమంది సంపన్నులు పర్సనల్ ట్రైనర్లను నియమించుకుంటున్నారు. జిమ్ నిర్వాహకులు వారు ఎంపిక చేసుకున్న పర్సనల్ ట్రైనర్లను ఇంటికి సైతం పంపుతున్నారు. ఇలా ఇండ్లకు వెళ్లి ట్రైనింగ్ ఇచ్చినందుకు ఆర్థిక స్థోమతను బట్టి రూ.5వేలు మొదలు రూ.20వేలకు పైన ఇచ్చేవారున్నారు.

ఈ పర్సనల్ ట్రైనర్లు కొందరితో ఇటీవల కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ట్రైనర్లలో ఎక్కువ మంది 40 ఏండ్లలోపు వారే కావడం, కండలు తిరిగి ఉండటంతో కొందరు ఆకర్షితులవుతు న్నారు. తద్వారా పచ్చని సంసారాల్లో చిచ్చు రేగుతున్నాయి. ఇటీవల కొందరు సంపన్న వర్గాల భార్యభర్తల మధ్య వివాదాలు తలెత్తి విడాకుల వరకు వెళ్లాయి. అలాగే యువతుల జీవితాల్లోనూ ఈ పర్సనల్ ట్రైనర్ల మూలంగా సమస్యలు తలెత్తుతున్నాయి .

బీఆర్ఎస్ ఎమ్మెల్యే 'కౌశిక్‌రెడ్డి' అరెస్టు

- జూబ్లీహిల్స్‌లోని ఓ టీవీ చానెల్ ఆఫీస్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కరీంనగర్ రివ్యూమీటింగ్ గొడవ ఘటనలో క్రిమినల్ కేసులు నమోదు
- రాత్రి 11గంటలకు కరీంనగర్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు



(ఫైల్)

నవతెలంగాణ -కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ జిల్లాహుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 13న కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ సమక్షంలో నిర్వహించిన రివ్యూమీటింగ్‌లో జరిగిన గొడవ ఘటనలో ఎమ్మెల్యే కౌశిక్‌పై కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా ఫిర్యాదులిచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తనపై దాడికి దిగాడని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కంప్లయింట్ చేశారు. ఈ నేపథ్యంలో కౌశిక్‌రెడ్డిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఓ టీవీ చానెల్ ప్రొగ్రామ్‌ల పాల్గొన్న ఆయన్ను అరెస్టు చేసి కరీంనగర్ మెజిస్ట్రేట్ ఎదుట అర్ధరాత్రి హాజరుపరిచారు. ఈనెల 13న కరీంనగర్ కలెక్టరేట్‌లో పల సంక్షేమపథకాల రివ్యూ మీటింగ్‌లో గందరగోళం, సమావేశాన్ని పక్కదారి పట్టించారని ఆర్డీఓ మహేశ్వర్ ఫిర్యాదు చేశారు. తన పట్ల దురుసుగా ప్రవర్తించి అవమానపరిచారని జిల్లాగ్రంథాలయ చైర్మెన్ సత్తు మల్లేశ కంప్లయింట్ ఇచ్చారు. అదే మీటింగ్‌లో తనను తోసేయడం, బూతులు తిడుతూ బెదిరించారంటూ జగిత్యాల ఎమ్మెల్యే ఫిర్యాదు ఇచ్చారు. ఈ మూడు ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు వేర్వేరు క్రిమినల్ కేసులునమోదు చేశారు. ఎమ్మెల్యే సంజయ్ మర్నాడు సోమవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఈ కేసుల నేపథ్యంలో 35 మంది పోలీసులు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఓ టీవీ చానెల్ ప్రొగ్రామ్‌లో పాల్గొని బయటకొస్తుండగా రాత్రి 9గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేశారు. అక్కడి నుంచి కౌశిక్‌రెడ్డిని అర్ధరాత్రి కరీంనగర్‌కు తీసుకొచ్చి ఇక్కడి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

ఘటనకు కారణమిదే..!

ఈనెల 13న కరీంనగర్ కలెక్టరేట్‌లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాల అమలుపై నిర్వహించిన కార్యాచరణ ప్రణాళిక - సమీక్షా సమావేశంలో జగిత్యాల ఎమెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, హుజూరాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందే. సంజయ్ మాట్లాడే సమయంలో ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు... నువ్వు ఏ పార్టీవయా?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. అదే సమయంలో సంజయ్ సైతం 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీయే. నువ్వు కూర్చోవయా' అంటూ ఘాటుగానే బదులిచ్చారు. దీంతో ఇద్దరి మధ్య మాటల తూటాలు కాస్త దుర్భాషలాడే వరకూ వెళ్లి ఒకరినొకరు తోసుకున్నారు. పక్కనే ఉన్న రామగుండం,పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణరావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వారించే ప్రయత్నం చేసినా పరిస్థితి అదుపులోకి ఆరలేదు. పోలీసులు కలగజేసుకుని కౌశిక్‌రెడ్డిని బలవంతంగా సమావేశం నుంచి బయటకు పంపారు.

సీనియర్ జర్నలిస్ట్ అనిల్‌కుమార్ మృతి

- సంతాపం తెలిపిన సీఎం, సమాచార శాఖ మంత్రి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



(ఫైల్)

సీనియర్ జర్నలిస్ట్ అనిల్ కుమార్ (54) మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.సఫిల్‌గూడలో నివసించే ఆయన కర్నాటకలోని ఉడిపిలో భార్య, కుమార్తెతో కలిసి వెళ్లారు. దర్శనం అనంతరం బయటకు వచ్చిన ఆయనకు గుండెపోటు రావడంతో స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. ఆదివారం రాత్రి ఒంటిగంట సమయంలో మరణించినట్టు డాక్టర్లు నిర్ధారించారు. భౌతికకాయాన్ని హైదరాబాద్‌కు తరలించి, మంగళవారం అల్వాల్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. అనిల్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజం చేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, న్యూస్ టైం, హిందీమిలాప్, స్వతంత్ర వార్త సహా పలు వెబ్‌సైట్లలో పనిచేశారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ టుడే ఆంగ్ల దినపత్రికలో ప్రిన్సిపల్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నారు. అనిక్‌కుమార్ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జర్నలిస్టుగా పత్రికా రంగానికి ఆయన అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. అనిల్‌కుమార్ మరణం పట్ల తెలంగాణ టుడే పత్రిక సంపాదకులు శ్రీనివాసరెడ్డి సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

అనిల్ మృతికి ఫెడరేషన్ సంతాపం

సీనియర్ జర్నలిస్టు అనిల్‌కుమార్ మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, హెచ్‌యుజె అధ్యక్షులు బి.అరుణ్ కూమార్ ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్వర్ సంతాపం తెలిపారు. అనిల్‌కుమార్ ఆయా పత్రికల్లో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి

నవ తెలంగాణ - బోనకల్



ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎంగల నవీన్ (25) లక్ష్మీపురం రెవిన్యూ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ ట్రాక్టర్ కు లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎంగల నవీన్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. స్కూల్ నిర్మాణ పనులలో భాగంగా నవీన్ ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఒక్కసారిగా ఆగిపోయింది. అనేకసార్లు ట్రాక్టర్ ను స్టార్ట్ చేసేందుకు ప్రయత్నం చేశాడు. ఎన్నిసార్లు స్టార్ట్ చేసిన కాకపోవటంతో కిందకు దిగి స్టార్ట్ చేశాడు. దీంతో ఒక్కసారిగా ట్రాక్టర్ స్టార్ట్ అయింది. ఆ సమయంలో ట్రాక్టర్ గేర్ లో ఉండటంతో ట్రాక్టర్ ఒక్కసారిగా నవీన్ మీదుగా వెళ్ళింది. దీంతో నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఖమ్మం లో వైద్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి పది గంటల సమయంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మరో విద్యార్థి ఆత్మహత్య

రెండురోజుల్లో వరుసగా ఇద్దరు..

ఖరగ్‌పూర్: పశ్చిమబెంగాల్ లోని ఐఐటీ ఖరగ్‌పూర్ లో విద్యార్థి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. తన హాస్టల్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మరణించాడు. విద్యార్థిని కలిసేందుకు వచ్చిన అతని తల్లిదండ్రులు ఎంతసేపు తలుపుతట్టినా తీయకపోవడంతో సంస్థ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది తలుపులు విరగొట్టి చూడగా విద్యార్థి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు.వివరాల్లోకి వెళ్తే.. షోన్ మాలిక్ అనే విద్యార్థి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం మాలిక్‌ను కలిసేందుకు అతని తల్లిదండ్రులు రాగా.. అప్పటికే మాలిక్ ఆత్మహత్య చేసుకున్నాడు. కలుద్దామని రాగా కొడుకు విగతజీవిగా కనిపించడంతో ఆ తల్లిదండ్రులు హతాశులయ్యారు. కొడుకు మృతదేహంపై పడి గుండెలవిసేలా రోధించారు.మాలిక్‌తో శనివారం రాత్రే ఫోన్‌లో మాట్లాడామని, అంతా బాగానే ఉందని చెప్పాడని, ఇవాళ తాము వచ్చేలోపే



ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఘటనపై సమాచారం అందినే వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఇటీవల ల్యాబ్ టెక్నీషియన్ కమ్ అసిస్టెంట్ కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఆత్మహత్యలపై అంతర్గత దర్యాప్తు చేపట్టినట్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

రూ.45వేల కోట్లతో నాలుగు పథకాలు

- ప్రతి గ్రామంలో లబ్ధిదారుల వివరాలతో ఫ్లెక్సీలు
- 20 రోజులు ఉపాధిహామీ పనిచేస్తే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా : 26 నుంచి అమలు చేసే పథకాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రూ.45వేల కోట్లతో నాలుగు పథకాలను ఈ నెలలో ప్రవేశపెడుతున్నట్టు ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ తదితర నాలుగు పథకాలను గణతంత్ర దినోత్సవం రోజు నుంచి అమలు చేయబోతున్నట్టు చెప్పారు. వీటన్నింటినీ పారదర్శకంగా అమలు చేస్తామని, లబ్ధిదారుల వివరాలతో ప్రతీ గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ఇన్ చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రులు ఎస్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో ఈ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లకు రూ.22,500 కోట్లు, రైతు భరోసాకు రూ. 18 వేల కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం చర్యలు చేపట్టామన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకూ ఏడాదికి రూ. 12 వేల పంట పెట్టుబడి సహాయం అందిస్తామన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండి, 20 రోజులు పని చేసిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందని తెలిపారు. అర్హులకే పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. నూతన రేషన్ కార్డుల జారీలో అధికారులు మానవీయ దృక్పథంతో పని చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరికీ 6 కిలోల సన్న బియ్యం ఇస్తామని అన్నారు.

వ్యవసాయేతర భూములకు రైతు భరోసా ఉండదు : మంత్రి తుమ్మల

ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయేతర భూములకు పంట పెట్టుబడి సహాయం అందటానికి వీల్లేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ యోగ్యం కాని భూములకు రైతు భరోసా అందకుండా చూడాలని కోరారు.

పథకాలపై ఫిర్యాదులకూ అవకాశం : ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

ఈ పథకాలపై ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. 24 నాటికి రైతు భరోసా లబ్దిదారుల తుది జాబితా సిద్ధం చేయాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా వచ్చిన వివరాల ప్రకారం రేషన్ కార్డు లేని కుటుంబాల సర్వే చేసి అర్హులను గుర్తించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రేషన్ కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులు అవసరం లేదని, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రకారం రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాల వివరాలు మండలాలు, గ్రామాల వారీగా చేరాయని తెలిపారు. ఈ సమీక్షలో ఇల్లందు, పినపాక, భద్రాచలం, అశ్వరావుపేట, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, రాందాస్ నాయక్, మట్టా రాగమయి తదితరులు మాట్లాడారు. ఖమ్మం సీపీ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులదే బాధ్యత : మంత్రి పొంగులేటి

ప్రభుత్వ ఆలోచనలను అమలులో పెట్టే బాధ్యత ప్రభుత్వ అధికారుల దేనని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు, పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు డేటా చాలా కీలకమని, అధికారులు వివరాలు సరిగ్గా నమోదు చేస్తేనే ఈ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామ్ రెడ్డి అన్నారు.

గతంలో దళిత బంధు వంటి పథకాలను పొందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో కాకుండా రెండో విడతలో ఇవ్వాలని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ సూచించారు. మొదటి దశలో అత్యంత నిరుపేదలను ఎంపిక చేసి లాటరీ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. సింగరేణి ప్రాంతాల్లో, గిరిజన ఏరియాలలో కూడా ఇందిరమ్మ ఇండ్లు పాత పద్ధతిలోనే మంజూరు చేయాలని అన్నారు.

40 ఏళ్ళ క్రితం నిర్మించిన కాలనీలు ప్రస్తుతం కూలిపోయే స్థితిలో ఉన్నాయని, వారికి ప్రాధాన్యత కల్పిస్తూ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.

శ్రమైక జీవన సౌందర్యం ఎక్కడ?

అమలుకు నోచని కార్మిక చట్టాలు

అరకొర వేతనాలతో గంటల తరబడి వెట్టిచాకిరీ

పనిగంటలు పెంచాలంటూ బడాబాబుల ఉచిత సలహాలు



న్యూఢిల్లీ : మంచి ఉద్యోగావకాశాలు, కెరీర్‌లో విజయాలు, హోదాలు...అన్నింటికంటే ముఖ్యంగా అధిక వేతనాల కోసం యువత నగరాల బాట పట్టడం సహజమే. అయితే దీనినోక అవకాశంగా తీసుకుంటున్న యాజమాన్యాలు వారి శ్రమను దోచుకుంటున్నాయి. భారతీయ చట్టాల ప్రకారం వారానికి 48 గంటలు మాత్రమే పనిచేయాల్సి ఉంటుంది. అయితే పలు కంపెనీలు ఈ నిబంధనను ఏ మాత్రం పట్టించుకోవు. యువ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయి. ఓవర్ టైమ్ దాదాపుగా నిత్యకృత్యమై పోయింది. కొందరైతే చాలీచాలని వేతనాలు ఇస్తూ కూడా ఎక్కువ గంటలు పని చేయించుకుంటారు. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉన్నది మన దేశంలోనే. వారిలో నిపుణులతో పాటు నైపుణ్యం లేని వారికి కూడా కొదువ లేదు. స్వామి వివేకానంద జయంత్యుత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12న ఆదివారం దేశవ్యాప్తంగా యువజనోత్సవాలను ఘనంగా జరుపుకున్నాం. ఏ దేశానికైనా యువతే ప్రధాన శక్తి. దేశాన్ని ముందుకు నడిపించేది వారే. అలాంటి యువత ప్రాధాన్యతను గుర్తించాలంటే వారికి చట్టాలు బాసటగా నిలవాల్సిన అవసరం ఉంది.

అమలుకు నోచని నిబంధనలు

మన దేశంలో కార్మిక చట్టాలు ఉద్యోగులకు పనిగంటలను నిర్దేశించాయి. వారు నిపుణులైనా కాకపోయినా అవే పనిగంటలు వర్తిస్తాయి. 1948వ సంవత్సరపు ఫాక్టరీల చట్టం ప్రకారం రోజుకు 8 గంటలు, వారానికి 48 గంటలకు మించి పని చేయకూడదు. అయితే దేశంలో ఇవేవీ అమలు కావడం లేదు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ప్రకారం 50.5 శాతం మంది వారానికి సగటున 49 గంటలు పని చేస్తున్నారు. భారతీయ ఉద్యోగుల్లో 88 శాతం మందిని పనిగంటలు ముగిసిన తర్వాత కూడా యాజమాన్యాలు సంప్రదిస్తూనే ఉంటాయని 'ఇండీడ్' అనే అంతర్జాతీయ జాబ్ మ్యాచింగ్-హైరింగ్ వేదిక నిర్వహించిన సర్వే తెలిపింది. సిక్ లీవులు పెట్టినా, ప్రభుత్వ సెలవు దినాలు అయినా సరే...85 శాతం మంది ఉద్యోగులతో యాజమాన్యాలు సంభాషిస్తూనే ఉంటాయని ఆ సర్వే చెప్పింది. 'ఇండీడ్' తరఫున గత జూలై-సెప్టెంబర్ మధ్య సెన్సస్‌వైడ్ అనే సంస్థ జరిపిన సర్వే చెబుతున్న దానిని బట్టి 79 శాతం మంది ఉద్యోగులు విధులు ముగిసిన తర్వాత పనికి సంబంధించి యాజమాన్యాల నుండి వచ్చే సందేశాలకు స్పందించడం లేదు. దీంతో వారు పదోన్నతులు కోల్పోతున్నారు. పేరు కూడా దెబ్బతింటోంది. ప్రాజెక్టుల నిర్వహణలో ఆలస్యం జరుగుతోంది.

ఎక్కువ సమయం పనిచేసినా...

పని ప్రదేశంలో ఎక్కువ మంది ఉద్యోగులు అధిక సమయాన్ని గడపాల్సి వస్తోంది. అయినప్పటికీ వారికి అదనంగా కొద్ది మొత్తం అందించి చేతులు దులుపుకుంటున్నారు. కొందరికైతే అదీ ఉండదు. పనిలో ఎక్కువ సమయం గడపడం వల్ల అనేక దేశాల్లో అధిక మరణాలు సంభవిస్తున్నాయి. ఆ దేశాల్లో భారత్ కూడా ఉన్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం చెబుతోంది.

రోజుకు 10-11 గంటలు పని చేయించుకుంటున్న కంపెనీలు, సంస్థలు ఉద్యోగులకు మాత్రం సరైన పరిహారం అందజేయడం లేదని, ఈ సమస్య నెలకొన్న దేశాల్లో భారత్ కూడా ఉన్నదని ఐఎల్‌ఓ తెలిపింది.

పనిగంటలపై ఉచిత సలహాలు

అనేక దేశాలు వారానికి నాలుగు రోజుల పని విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తుంటే మన దేశంలో కొందరు పరిశ్రమల అధిపతులు మాత్రం అందుకు విరుద్ధంగా మాట్లాడడం, పనిగంటలు పెంచాలని ఉచిత సలహా ఇవ్వడం, దానిపై దేశవ్యాప్త చర్చకు తెర లేవడం జరుగుతోంది. గత వారం ఎల్ అండ్ టీ ఛైర్మెన్ ఎస్ఎన్ సుబ్రమణ్యం చేసిన వ్యాఖ్యతో ఆ చర్చ మరింత ముందుకు సాగుతోంది. భారతీయులు వారానికి 90 గంటలు పని చేయాలన్నది ఆయన సలహా.

అలాంటి పని సంస్కృతి విజయానికి సోపానం అవుతుందని సుబ్రమణ్యం సెలవిచ్చారు. పరిశ్రమలు, కంపెనీల అధిపతులు ఇలా మాట్లాడడం ఇది మొదటిసారి కాదు. వారానికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి గతంలోనే ఉద్బోధించారు. ప్రపంచంలో అత్యుత్తమ యజమానులు ఎవరన్న దానిపై 2023లో ఫోర్బ్స్ సంస్థ ఓ అధ్యయనం నిర్వహించింది. పేరొందిన 15 టెక్ కంపెనీల్లో ఏ ఒక్కటి కూడా తన ఉద్యోగులకు వారానికి 70 పనిగంటల నిబంధన విధించలేదు. అయినప్పటికీ నారాయణ మూర్తి ఆ సలహా ఇచ్చారు. ఉద్యోగులు మానసిక ఆరోగ్యంతో సుఖవంతమైన జీవితం గడపాలంటే అధిక పనిగంటల నిబంధన ఉండరాదని శాస్త్రవేత్తలు, నిపుణులు సూచిస్తున్నారు.

చట్టాలు ఏం చెబుతున్నాయి?

దేశంలోని కార్మిక చట్టాలు వారికి తగిన రక్షణ కల్పించేందుకు, యాజమాన్యాలు వారి పట్ల సరిగా వ్యవహరించేందుకు ఉద్దేశించబడ్డాయి. కానీ పలు యాజమాన్యాలు వీటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని చట్టాలు చెబుతున్నా వాటికి, వాటి అమలుకు మధ్య దూరం పెరుగుతోంది. ఫలితంగా లక్షలాది కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. తక్కువ వేతనాలతో బతుకు బండిని లాగిస్తున్నారు. పని-జీవితం మధ్య సమతూకం దెబ్బతింటోంది. కాలం చెల్లిన నిబంధనలు, బలహీనంగా ఉన్న వాటి అమలు, పెరుగుతున్న బడా పారిశ్రామికవేత్తల ప్రాబల్యం...వెరసి కార్మికుల హక్కుల అమలు క్లిష్టంగా మారింది. పార్లమెంట్ ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్లు ఏం చెబుతున్నాయంటే రోజుకు గరిష్టంగా 12 గంటల పనిఉండాలి. రోజువారీ పనిగంటలు పెంచి వారానికి నాలుగు రోజులు మాత్రమే పనిచేయాలి. వారానికి 48 పనిగంటలు మాత్రమే ఉండాలి. అయితే ఈ కోడ్లు ఇంకా పూర్తిగా అమలులోకి రాలేదు. సరళీకరణ విధానాల కారణంగా అనేక బహుళజాతి సంస్థలు, విదేశీ కంపెనీలు భారతీయ మార్కెట్‌లో అడుగు పెట్టాయి. అయితే అవి అత్యంత సంపన్న దేశాలు అమలు చేస్తున్న విధానాలను పాటించడం లేదు.

నామినేషన్ వేసిన ఢిల్లీ సీఎం అతిశీ

కల్కాజీ నియోజకవర్గం నుంచి బరిలోకి..

న్యూఢిల్లీ : రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ సోమవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. కల్కాజీ నియోజకవర్గం నుంచి ఆమె పోటీకి దిగుతున్న సంగతి తెలిసిందే. నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు కల్కాజీ నియోజకవర్గంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో అతిశీతో పాటు ఆప్ నేత మనీశ్ సిసోడియా కూడా పాల్గొన్నారు.ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివ ృద్ధి కోసం అవిశ్రాంతంగా క ృషి చేశానని అన్నారు. కల్కాజీ ప్రజలు తన కుటుంబమని, వారు తనను సోదరిగా, కుమార్తెగా భావిస్తారని అన్నారు. తాను కేవలం ఈ నియోజకవర్గ ప్రతినిధిని మాత్రమే కాదని, వారి జీవితంలో ఓ భాగంగా భావిస్తారని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆప్ కట్టుబడి ఉందని అన్నారు. బీజేపీ పేదలకు వ్యతిరేకి అని, మురికివాడలకు వ్యతిరేకి అని దుయ్యబట్టారు.అతిశీకి పోటీగా బీజేపీ నుంచి రమేష్ బిధూరి, కాంగ్రెస్ నుంచి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబాలు బరిలోకి దిగుతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.



గ్యాస్‌పైప్‌లైన్‌పై దాడికి ఉక్రెయిన్ యత్నం

మాస్కో : దక్షిణ రష్యాలోని టర్క్‌స్ట్రీమ్ గ్యాస్ పైప్‌లైన్ మౌలిక సదుపాయంపై ఉక్రెయిన్ దాడికి యత్నించినట్లు రష్యా ప్రకటించింది. పైప్‌లైన్‌లో కొంతభాగాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన తొమ్మిది ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. ఈ పైప్‌లైన్ నుండి టర్కీ, యూరప్‌కు రష్యా గ్యాస్‌ను సరఫరా చేస్తుంది. దక్షిణ రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని కంప్రెషర్ స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకుందని రస్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే పైప్‌లైన్ యథావిధిగా పనిచేస్తోందని, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపింది. ఒక డ్రోన్ శకలాలు పడిపోవడంతో భవనం, కంప్రెషర్ వద్ద ఉన్న గ్యాస్ మీటరింగ్ స్టేషన్ సామగ్రికి స్వల్ప నష్టం వాటిల్లిందని, అయితే అత్యవసర బృందాలు వెంటనే మరమ్మత్తులు చేశాయని రష్యా ఓ ప్రకటనలో పేర్కొంది. గ్యాస్ పైప్‌లైన్ అనపా నగరం వెలుపల ఉన్న రస్కయా కంప్రెషర్ స్టేషన్ నుండి గ్యాస్ పైప్‌లైన్ ప్రారంభమై, టర్కీలోని కికోయ్ వరకు, అక్కడి నుండి యూరప్‌కు వెళుతుంది.

బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్‌కి భారత్ నోటీసులు



న్యూఢిల్లీ : సరిహద్దు ఉద్రిక్తతలపై బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ నురుల్ ఇస్లామ్‌కు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం నోటీసులిచ్చింది. భారత్ -బంగ్లాదేశ్‌ల మధ్య ఐదు ప్రాంతాల్లో కంచెలు వేయనున్నట్లు హోం వ్యవహారాల సలహాదారు జహంగీర్ ఆలం చౌదరి ఆదివారం మీడియాకు వెల్లడించిన వెంటనే బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు జనవరి 12న నోటీసులు జారీ చేసింది.

బంగ్లాదేశ్ సరిహద్దుల్లో నిర్మాణాలు ప్రారంభించే ముందు తమను సంప్రదించలేదని, ఇది ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని బంగ్లాదేశ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిపై చర్చలు జరిపేందుకు భారత రాయబారిని పిలిపించినట్లు ప్రకటించింది. ప్రణయ్ వర్మ ఆదివారం విదేశాంగ శాఖ కార్యాలయానికి చేరుకుని వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై భారత్ కూడా తగు చర్యలు తీసుకుంది. బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ నురల్ ఇస్లామ్‌కు విదేశాంగ శాఖ నోటీసులు ఇచ్చింది. గతేడాది ఆగస్ట్ 5న షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన అనంతరం హసీనా పార్టీ అవామీ లీగ్ సభ్యులు, బంగ్లాదేశ్ ప్రజలు సరిహద్దుల్లో నుండి భారత్ భూభాగంలోకి చొరబడుతున్నారు. దీంతో భారత ప్రభుత్వం సరిహద్దు భద్రతపై దృష్టి సారించింది. 2024 ఆగస్ట్ చివరలో మేఘాలయలో భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో అవామీ లీగ్ నేత ఇష్ఫాక్ అలీ ఖాన్ పన్నా మృతదేహాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. రాజకీయ ప్రత్యర్థులు ఆయనను వెంబడించి హత్య చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేశారు.

భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు..



23,100 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బలహీన సంకేతాల నడుమ ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా అదే బాటలో పయనించాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, జొమాటో, ఎల్అండ్‌టీ షేర్లలో విక్రయాలు సూచీలపై మరింత ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ 1,000 పాయింట్లకు పైగా పడిపోగా.. నిఫ్టీ 23,100 దిగువన ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 76,629.90 (క్రితం ముగింపు 77,378.91) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 1000 పాయింట్లు పైగా కోల్పోయి 76,249.72 వద్ద కనిష్టా'న్ని తాకింది. చివరికి 1,048.90 పాయింట్ల నష్టంతో 76,330.01 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345.55 పాయింట్ల నష్టంతో 23,085 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.61 వద్ద స్థిరపడింది.

భారత్‌లో యాపిల్ జోరు.. 2024లో రూ.లక్ష కోట్లు ఐఫోన్ ఎగుమతులు దాటాయి.

సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టపోయాయి. టీసీఎస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 80.83 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,708.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

బక్కచిక్కిపోతున్న రూపాయి

డాలర్‌కు రూ.86.61లకు.. క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై తీవ్ర ప్రభావం

న్యూయార్క్. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి రోజురోజుకూ బక్కచిక్కిపోతోంది. సోమవారం 86.61 వద్ద స్థిరపడింది. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఇబ్బందులు తప్పవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు దారితీయొచ్చు. ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీసే అవకాశాలున్నాయి.

కారణాలు ఇవే..

ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు కూడా మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. జపాన్ నిక్కీ, హాంకాంగ్, ఏఎస్ఎక్స్ మార్కెట్లు 1 శాతం మేర నష్టాల్లో ముగిశాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగుతుండడం మన మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడికి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా బాండ్ రాబడులు పెరగడం కూడా మరో కారణమంటున్నారు.

విచారణ త్వరగా పూర్తి చేయాలి..

బద్లాపూర్ కేసులో బాంబే హైకోర్టు ఆదేశాలు



ముంబయి : బద్లాపూర్ పాఠశాలలో జరిగిన లైంగిక వేధింపుల కేసును విచారణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బాంబే హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. థానేలోని బద్లాపూర్ ప్రాంతంలోని పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై స్కూల్ అటెండర్ లైంగిక దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఎన్‌కౌంటర్‌లో నిందితుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత కేసును దర్యాప్తు చేసేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. పోక్సో చట్టంలోని నిబంధనల ప్రకారం.. పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు వ్యక్తులపై చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఈ కేసులో బద్లాపూర్ స్థానిక పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని వెలుగు చూడడంతో హైకోర్టు తీవ్రంగా పరిగణిం చింది. సుమోటోగా తీసుకొని కేసు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో సోమవారం బాంబే హైకోర్టు విచారణ జరిపింది. జస్టిస్ రేవతి మోహితే డెరే, నీలా గోఖలే విచారణ జరుపగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ హితెన్ చార్జిషీట్ దాఖలు చేశామని.. కేసు విచారణ జరుగుతుందని తెలిపారు. దాంతో ధర్మాసనం స్పందిస్తూ బాధితులు చిన్నపిల్లలని.. కేసును త్వరగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించింది. పోక్సో చట్టం ప్రకారం.. బాలికల విచారణ సమయంలో ఓ మహిళా ప్రాసిక్యూటర్ హాజరు కావాలని బెంచ్ ఆదేశించింది. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సహాయం చేసేందుకు మహిళా ప్రాసి క్యూటర్‌ను నియమించినట్టు తెలిపారు.కేసు విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు కేసు స్టేటస్‌ను ప్రాసిక్యూషన్‌కు తెలపాలని చెప్పింది. గతేడాది పాఠశాలలు, విద్యాసంస్థల్లో పిల్లల భద్రతను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే, కమిటీ సిఫారసులపై నివేదికను సమర్పించాలని ఉందని పీపీ ధర్మాసనానికి విచారణ సందర్భంగా వెల్లడించారు. రాబోయే విచారణ తేదీ నాటికి నివేదికను సమర్పిస్తే.. పరిశీలిస్తామని చెప్పింది. ఈ కేసులో నిందితుడి ఎన్‌కౌంటర్‌పై తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణ జరుగనున్నది. తన కొడుకును పోలీసులు ఫేక్ ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సైతం ఈ నెల 20న హైకోర్టు విచారించనున్నది.

మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనేఉంది

ఎల్ఏసీ వద్ద పరిస్థితిని చక్కదిద్దటానికి కార్ప్స్ కమాండర్లకు అధికారం

శాంతి స్థాపనకు బలగాలు కృషి : ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఇంకా హింసాకాండ కొనసాగుతూనే ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. అక్కడ శాంతి స్థాపనకు సాయుధ బలగాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. సోమవారం ఇక్కడ మనేక్ష సెంటర్‌లో నిర్వహించిన వార్షిక విలేకరుల సమావేశంలో ఉపేంద్ర ద్వివేది మాట్లాడారు. ఈ సమావేశంలో సరిహద్దుల్లో భద్రతా సమస్యలు గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ద్వివేది పైవిధంగా సమాధానం ఇచ్చారు. అలాగే మయన్మార్ సరిహద్దుల్లో మెరుగైన నిఘా వ్యవస్థ ఉందని, ఫెన్సింగ్ కూడా పురోగతిలో ఉందని తెలిపారు.

అలాగే, వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వద్ద కూడా ప్రతిష్టంభన నెలకుందని ఆర్మీ చీఫ్ సోమవారం అంగీకరించారు. ఇక్కడ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి కార్ప్స్ కమాండర్లకు అధికారం ఇచ్చినట్లు చెప్పారు. దీని వలన పెట్రోలింగ్, పశువుల మేతకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలు సైనిక స్థాయిలోనే పరిష్కారమవుతాయని చెప్పారు. ఎల్ఏసీ వద్ద పరిస్థితి సున్నితమైనదే అయినా, ప్రస్తుతం అక్కడ పరిస్థితి స్థిరంగా ఉందని ఆర్మీ చీఫ్ తెలిపారు. కైలాష్ మానససరోవర్ యాత్రను పున:ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తూర్పు లద్దాక్ వద్ద బలగాల ఉపసంహరణపై ఆర్మీ చీఫ్ సంతృప్తి వ్యక్తం చేశారు. చైనాతో తదుపరి ప్రత్యేక ప్రతినిధుల సమావేశం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. పాకిస్థాన్‌తో నియంత్రరేఖ (ఎల్ఓసీ) వద్ద పరిస్థితి గురించి ద్వివేది మాట్లాడుతూ ఈ రేఖ వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలు చెక్కుచెదరకుండా ఉన్నాయని, చొరబాటు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే సైన్యంలో గతేడాది అదనంగా 15 వేల మంది సైనికులను అదనంగా చేర్చుకున్నామని, కాబట్టి జమ్మూకాశ్మీర్‌లో హింసాకాండ స్థాయిని తగ్గించగలిగామని, 73 మంది ఉగ్రవాదులను హతమార్చగలిగామని చెప్పారు.

జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు 60 శాతం ఓటింగ్ జరిగిందని, ఇది ఇక్కడి ప్రజలు హింసను విస్మరిస్తున్నారని అనడానికి నిదర్శమని ఆర్మీ చీఫ్ తెలిపారు. జనవరి 15న ఆర్మీ డే సందర్భంగా ఈ వార్షిక మీడియా సమావేశం నిర్వహించారు.కాగా, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2023-24 వార్షిక నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో ఈశాన్య భారతంలో జరిగి హింసాత్మక సంఘటనల్లో 77 శాతానికి పైగా మణిపూర్‌లోనే జరిగాయి. మణిపూర్‌లో పరిస్థితి గురించి ఇటీవల ఆ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా సమీక్షా సమావేశంలో హింసాకాండను నిలువరించడానికి రాష్ట్ర పోలీసులు జాతీయ భద్రతా చట్టం 1980ను ప్రయోగించాలని సూచించారు. ఈ చట్టం ప్రకారం అనుమానితుల్ని ఎలాంటి విచారణ లేకుండా ఒక ఏడాది పాటు నిర్బంధించవచ్చు.మణిపూర్‌లో 2023 మే 3న ప్రారంభమైన హింసాకాండలో ఇప్పటి వరకూ 250 మందికి పైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

క్యాసినోకు చట్టబద్ధత..

బిల్లుకు థాయిలాండ్ ఆమోదం

ఉద్యోగాల కల్పన కోసమే ఈ నిర్ణయం : ప్రధాని పేటోంగ్టార్న్

అక్రమ జూదక్రీడను అడ్డుకోలేక..ఇలాంటి అడ్డదార్ల : థాయ్‌లాండ్ పీపుల్స్



బ్యాంకాక్ : క్యాసినో, గ్యాంబ్లింగ్‌కు సంబంధించి ప్రతిపాదిత బిల్లుకు థాయ్‌లాండ్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇది అమల్లోకి వస్తే థీమ్, వాటర్ పార్కులు, హెూటళ్లు, షాపింగ్ మాల్స్ వంటి టూరిజం కాంప్లెక్సుల్లో క్యాసినోల ఏర్పాటుకు అనుమతికి వీలుంటుంది. ఇందుకు సంబంధించిన బిల్లు వివాదాస్పదమైనప్పటికీ.. పర్యటకానికి మరింత ఊతమివ్వడంతోపాటు ఉద్యోగాల కల్పన కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు థాయ్ ప్రభుత్వం వెల్లడించింది.

నవతెలంగాణ
మనకున్న దానితో తృప్తిపడటం ఉత్తమం. కానీ మనకున్న జ్ఞానం చాలనుకోవడం అజ్ఞానం - మైకెంలోష్
మంగళవారం 14 జనవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

మౌఢ్య 'బోధ'



'పౌర్ణమి రోజుల్లో గర్భధారణ వద్దు. అలాగే తెలివైన పిల్లల కోసం సూర్యుని ముందు విల్లులా వంగుతూ నమస్కారం చేస్తూ నీళ్లను సమర్పించండి' అని మహిళా డీఐజీ సవితా సోహన్ బాలికలకు ఉపదేశం చేశారు. అది కూడా బాలికల రక్షణ కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఒక అవగాహన కార్యక్రమంలో 12వ తరగతి విద్యార్థినులను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం శోచనీయం. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు తీస్తున్న 21వ శతాబ్దంలో ఈ పుక్కిట పురాణాలు బోధించి నేర్పేది కుసంస్కారమే. ఇప్పుడు బాధ్యతగల ప్రభుత్వ అధికారులు విద్యార్థినులకు ఈ విధంగా చెప్పడం అత్యంత దారుణమైన విషయం. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన పాఠశాలలు నేడు అశాస్త్రీయ పాఠాలకు వేదికలు కావడం విషాదం.

శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన ఒక పోలీసు అధికారిగా, చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి ఆడపిల్లలకు చట్టాన్ని ఎలా వినియోగించుకోవాలో చెప్పకుండా సమాజం ఉలిక్కిపడే 'తిరోగమన పాఠాలు' బోధించడం సమాజానికే చేటే గాదు, సిగ్గుచేటు కూడా. ఈ వివాదం కొనసాగుతుండగానే మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో క్యాబినెట్ హోదా ఉన్న మరో ప్రబుద్ధుడు "ఈ మధ్య యువత ఒక బిడ్డను కని ఆగిపోతున్నారు. ఇది చాలా సమస్యాత్మకంగా మారుతోంది. అందుకే బ్రాహ్మణులు కనీసం నలుగురు సంతానం కనాలి. వారికి రూ.లక్ష నజరానా ఇస్తాం" అని ప్రకటించడం మరీ విడ్డూరంగా ఉంది. దేశం ఆధునికతను సంతరించుకునే కొద్దీ అంతరించ పోవాల్సిన కులం మన రాజకీయ వ్యవస్థ పుణ్యమా అని వెర్రితలలు వేస్తుంది అన్నడానికి ఇంత కంటే రుజువులేం కావాలి. వీటి ప్రభావం పడిన వారు వారి పిల్లలకు నిస్సందేహంగా తిరిగి మౌఢ్యాన్నే బోధించరా? 'విజ్ఞానంతోనే వికసించు జగత్తు/ పసిపిల్లల చదువే దానికి విత్తు' అన్న కవి వాక్కులను తిరగరాస్తూ అజ్ఞానాన్ని విద్యార్థుల మెదడులో చొప్పించే పని శరవేగంగా జరుగుతుందన్నదానికి ఇవి ఉదాహరణలు మాత్రమే.

'పుట్టేది ఆడపిల్ల అని ముందే తెలిస్తే, కడుపులోని ఆ పిండాన్ని అక్కడికక్కడే కరిగించేస్తున్నారు. భ్రూణ హత్యలు ఆపకుండా గర్భధారణ గురించి అశాస్త్రీయ విషయాలు విద్యార్థులకు చెప్పడం ఏం సంస్కారం? అంతరిక్షంలోకి ఆడపిల్లలు వెళ్తున్న కాలంలో ఇప్పటికీ ప్రజల ఆలోచనల్లోనూ వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది. సమాజం ఎప్పుడో వదిలేసిన అమానుష ఆచారాలు మరల భుజాన వేసుకునే కుహనా 'సంస్కరణ' వాదులు బయలుదేరినంత కాలం ఎన్ని చట్టాలు వచ్చినా నిరుపయోగమే. పాలకులు చట్టాలను అమలు చేయడం కంటే ప్రజలను అశాస్త్రీయత వైపు నడిపించడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. దాని ఫలితమే చట్ట విరుద్ధం అని తెలిసినా ఇప్పటికీ బాల్య వివాహాలు ఆగడం లేదు.

> 'పుట్టేది ఆడపిల్ల అని ముందే తెలిస్తే, కడుపులోని ఆ పిండాన్ని అక్కడికక్కడే కరిగించేస్తున్నారు. భ్రూణ హత్యలు ఆపకుండా గర్భధారణ గురించి అశాస్త్రీయ విషయాలు విద్యార్థులకు చెప్పడం ఏం సంస్కారం? అంతరిక్షంలోకి ఆడపిల్లలు వెళ్తున్న కాలంలో ఇప్పటికీ ప్రజల ఆలోచనల్లోనూ వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది. సమాజం ఎప్పుడో వదిలేసిన అమానుష ఆచారాలు మరల భుజాన వేసుకునే కుహనా 'సంస్కరణ' వాదులు బయలుదేరినంత కాలం ఎన్ని చట్టాలు వచ్చినా నిరుపయోగమే.

తాజాగా తెలంగాణ రాష్ట్రంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాలు రాష్ట్ర రాజధాని చుట్టూ ఉన్నాయన్న అధికారిక లెక్కలు ఆందోళన కల్గిస్తున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు అభివృద్ధిలోనే కాదు.. సామాజిక వెనుకబాటులోనూ ముందు ఉన్నాయన్న విషయం నిష్ఠుర సత్యం. పెళ్లంటే ఏమిటో కూడా తెలియకుండానే ముక్కుపచ్చలారని పసిమొగ్గలు కుటుంబ బరువు, బాధ్యతల బందిఖానాలో చిక్కి శల్యమైపోతున్నారు. గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో అవిద్య, అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తుంటే... పట్టణాల్లో సినిమాల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, లైంగికదాడులు నుంచి బయట పడేందుకు చిన్న పిల్లలకే పెళ్లిళ్లు చేస్తున్నామని తల్లిదండ్రులు చెప్పడం ఒక విషాదం. బాల్య వివాహాలు జరగకుండా నివారించాల్సిన ప్రభుత్వాలు ప్రజల్లో చైతన్యం నింపడంలో విఫలమవుతున్నాయి. పిల్లలకు సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగడానికి, అభివృద్ధి చెందటానికి రక్షణ పొందే హక్కును రాజ్యాంగం కల్పించింది. వారి హక్కులను హరిస్తున్న బాల్య వివాహాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ చేయకపోతే ఈ బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టం.

శాస్త్ర సాంకేతికాభివృద్ధితో ప్రపంచమంతా పురోగమనానికి బాటలు వేసుకుంటుంటే... మన పాలకులు మాత్రం ఏ రుజువులూ లేని పుక్కిట పురాణాలూ, అంధ విశ్వాసాల ఆధారంగా దేశాన్ని తిరోగమన బాట పట్టిస్తున్నారు. సమాజ ప్రగతిని ఇలాంటి మౌఢ్యాలు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాల పని వాటన్నింటినీ చేష్టలుడిగి చూస్తుండటమేనా అన్నది జవాబులేని ప్రశ్నగా మిగిలిపోరాదు. "నేడు భారతదేశం అజ్ఞానం, మత ఛాందసం, మతోన్మాదాల అగాధంలోనూ, అన్నిరకాల జడ పదార్థాల పూజలలోనూ మునిగిపోయి ఉంది. ఈ గందరగోళ పరిస్థితి నుంచి దేశాన్ని ఏ శక్తి బయటపడేయ గలదు? మన జీవితంలో ఇబ్బంది పెడుతున్న సమస్యలన్నింటినీ ఒక్క దెబ్బతో ఏ శక్తి పరిష్కరించలేకపోవచ్చు. కాని, సర్ సి.వి.రామన్ చెప్పినట్టు 'విజ్ఞాన శాస్త్రమే' ఒక స్వేచ్ఛా జీవనం వికసించడానికో మార్గం పరుస్తుందనే ఎరుక భావితరాలకి అందించాలి. ఇది ప్రజలేకాదు, పాలకులూ గుర్తించాలి.

భూమాతను చూశావా
ఎలా వెక్కి వెక్కి ఏడుస్తుందో
కోట్ల మంది పిల్లల జీవితాల కోసం
బార్డర్‌లో బిడ్డల ప్రాణాలు అర్ధంతరంగా,
అర్థం లేకుండా పోతున్నాయని

భూమాతను చూశావా
ఎలా వెక్కి వెక్కి ఏడుస్తుందో
అర్ధరాత్రి ఆడపిల్ల స్వేచ్ఛగా తిరిగిన రోజున
స్వాతంత్రం వచ్చినట్టే అన్నారు
కానీ ... పసి పాపలని చూడకుండ
చిదిమేసిన రాబందు మూకల
ఆకలికి బలాయేనే
భూమాతను చూశావా

జై జవాన్ జై కిసాన్



ఎలా ఘోషిస్తుందో
చావు కళ్ళముందరే ఉన్న
కంటిపై కునుకు రాకుండా
కాపు కాస్తూ ఉంటే
ఒక్కో తూటాకు అమ్మ అనే పిలుపుకు
ఈ భారతమ్మ కన్నీళ్ల ఏరులై
పారుతున్నాయి

భూమాతను చూశావా
ఎలా తల్లడిల్లుతుందో
నిన్ను గన్నది ఆడదన్న సంగతి మరిచి
కామంతో కళ్ళు మూసుకుని
కిరాతకంగా ప్రవర్తిస్తూ ఉంటే
ఆ కన్నతల్లి కడుపుకోత ఆర్తనాదాలకి...
గడ్డిపోచ కూడా కత్తిపట్టి
యుద్ధం చేస్తుందేమో

భూమాతను చూశావా
ఎలా తపించిపోతుందో
దేశానికి వెన్నుముక అయిన రైతు
పచ్చని పంట పొలాల మధ్య
పక్షిలా నేల రాలిపోతుంటే

ఎలా ప్రశ్నిస్తుందో చూసావా
తన బిడ్డల త్యాగాలకు విలువెక్కడనీ
ఆడపిల్లకు రక్షణెక్కడని
అన్నం పెట్టే రైతన్నను న్యాయం ఎక్కడని..?
జై జవాన్ జై కిసాన్

(15న ఆర్మీ దినోత్సవం సందర్భంగా)

- యం.మమత

జీడీపీ - జాతీయత



ప్రభాత్ పట్నాయక్

'ఉదారవాదులు' ఎప్పుడూ 'జాతీయతను వ్యతిరేకిస్తూ ఉంటారు. జాతీయత అనేది ఏకరూప భావన అని, తక్కిన దేశాల పట్ల ఎప్పుడూ శత్రుపూరిత ధోరణితో ఉంటుందని, వారితో సర్దుబాటు చేసుకోడానికి సంసిద్ధత వ్యక్తం చేయదని, వాటితో ఎప్పుడూ తగువులు పడే వైఖరినే అనుసరిస్తుందని ఉదారవాదులు భావిస్తారు. ఐతే ఈ దృక్పథం పూర్తిగా తప్పు. యూరప్ ఖండంలో 17వ శతాబ్దంలో కుదుర్చు కున్న వెస్ట్ ఫాలియన్ శాంతి ఒప్పందాల అనంతర కాలంలో తలెత్తిన జాతీయతావాదం వేరు. మూడవ ప్రపంచ దేశాల్లో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా తలెత్తిన జాతీయతా వాదం వేరు. యూరోపియన్ జాతీయతా వాదం నుండి నేరుగా పుట్టినది హిట్లర్ వాదం. దానికి పూర్తి విరుద్ధమైనదిగా ఉండే జాతీయతావాదానికి ఉదాహరణ హోచిమిన్ జాతీయతా వాదం.

17వ శతాబ్దపు యూరోపియన్ జాతీయతా వాదానికి, 20వ శతాబ్దంలో మూడవ ప్రపంచ దేశాలలో తలెత్తిన జాతీయతావాదానికి కనీసం మూడు విషయాల్లో తేడా ఉంది. **మొదటిది:** యూరోపియన్ జాతీయతావాదం ఆ దేశంలో ఒక అంతర్గత 'శత్రువు' మీద ఎక్కుపెడుతుంది. ఉత్తర యూరప్‌లో కేథలిక్కులను, దక్షిణ యూరప్‌లో ప్రొటెస్టెంట్లను, అన్ని దేశాల్లోనూ యూదులను శత్రువులుగా పరిగణించారు. దానికి పూర్తి భిన్నంగా మూడవ ప్రపంచ దేశాలలోని జాతీయతావాదం తమ తమ దేశ ప్రజలందరినీ ఐక్యపరిచే వైఖరితో ఉంటుంది. సామ్రాజ్యవాద శక్తుల బలం చాలా ఎక్కువ. అటువంటి శత్రువును ఎదుర్కోవాలంటే ఈ విధమైన వైఖరి తీసుకోవడం తప్పనిసరి. **రెండవది:** యూరోపియన్ జాతీయతావాదం దేశాన్ని ప్రజలకన్నా గొప్పగా పరిగణిస్తుంది. ఆ దేశం కోసం ప్రజలందరూ త్యాగాలు చేయవలసిందే. అదే మూడవ ప్రపంచపు జాతీయతావాదం ఏళ్ళ తరబడి సామ్రాజ్యవాదుల అణచివేతలో నలిగిపోతున్న ప్రజలందరికీ సేవ చేయడం కోసమే దేశం అన్న వైఖరితో ఉంటుంది. **మూడవది:** యూరోపియన్ జాతీయతావాదం మొదటి నుంచీ సామ్రాజ్యవాద స్వభావంతో ఉంది. వెస్ట్ ఫాలియన్ శాంతి ఒప్పందం జరిగిన కొద్ది మాసాలకే ఆలివర్ క్రాంవెల్ ఐర్లండ్‌ను ఆక్రమించాడు. యూరోపియన్ దేశాలు అన్నీ తర్వాత కాలంలో అనుసరించిన ఇదే వైఖరికి శ్రీకారం చుట్టాడు. జాతీయతాభావాన్ని ప్రేరేపించి ఆ ప్రాతిపదికన తక్కిన దేశాలను ఆక్రమించుకోవడం ఇక్కడ కనిపిస్తుంది. అదే మూడవ ప్రపంచ దేశాల జాతీయతావాదాన్ని చూస్తే అది కూడా ఒకానొక భౌగోళిక పరిధిలోనే వ్యవహరించినప్పటికీ, తక్కిన మూడవ ప్రపంచ దేశాలతో సౌహార్ద్ర సంబంధాలను పెంపొందించుకోడానికి ప్రయత్నించింది. ఆ దేశాలన్నీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని ఎదిరించే పోరా టంలో నిమగ్నమై వుండడమే ఇందుకు కారణం.

> ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్‌ను చాలా మంచి మనసు, హృదయం ఉన్న వ్యక్తిగా, అసలు సిసలైన లౌకికవాదిగా స్మరించుకుంటున్నారు. కాని ఈ దేశంలో నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టడంలో ముఖ్య భూమిక పోషించినది అతడే. డా.మన్మోహన్ సింగ్ వ్యక్తిగత విశిష్ట స్వభావాన్ని అడ్డం పెట్టుకుని నయా ఉదారవాద వ్యవస్థను సమర్ధించడానికి పలువురు ఇప్పుడు తయారయ్యారు. ఫాసిస్టు శక్తులు బలపడడానికి, నయా ఉదారవాద విధానాలకు గల సంబంధాన్ని చాలా మంది అర్థం చేసుకోవడం లేదు కనుక వీరి ప్రయత్నం కొంతవరకూ విజయం సాధించవచ్చు కూడా. ఫాసిస్టు శక్తులు బలపడడానికి కేవలం రాజకీయ కారణాలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ దాని వెనుక ఉన్న ఆర్థిక కారణాలను విస్మరిస్తే ఇదే జరుగుతుంది. ఈ పొరపాటు అవగాహనను సరి చేసుకోకపోతే అది అంతిమంగా ఫాసిస్టు శక్తులు మరింత బలపడడానికే తోడ్పడుతుంది.

ఇక అమూర్తమైన ఆదర్శ భావనగా 'జాతి' (లేదా దేశం) అనే దానిని ముందుకు తెచ్చి దానికి దైవత్వాన్ని ఆపాదించి అది ప్రజలకన్నా గొప్పదని చిత్రించడం యూరోపియన్ జాతీయతా వాదపు లక్షణం. దానిని మూడవ ప్రపంచ దేశాల జాతీయతా భావం పూర్తిగా భిన్నం. ఇక్కడ జాతీయత అనేది అమూర్తమైనదేమీ కాదు. అది ప్రజల కోసం రూపొందిన భావం (దీనినే మార్క్స్ గనుక వర్ణించదలచినట్లైతే అది ప్రజల పక్షాన నిలిచే భావం అని చెప్పి వుండేవాడు). జాతీయత ప్రధాన లక్ష్యం ఇక్కడ ప్రజల జీవితాలను మెరుగుపరచడమే.

వలస పాలన నుండి విముక్తి పొందిన దేశాలు వాటి నిర్వహణలో ఎన్ని లోపాలు తలెత్తినప్పటికీ, సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం కలిగిన జాతీయతా భావం పట్ల తమ నిబద్ధతను కొనసాగించాయి. ఉదాహరణకు, భారత రాజ్యాంగపు మౌలిక లక్షణాలన్నీ ఆ ప్రాతిపదిక మీదనే రూపొందాయి. రాజ్యాంగ పీఠిక దానికి అద్దం పట్టింది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సోషలిజం వంటివి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అంతర్భాగంగా ఉండి ఆ భావనలన్నీ రాజ్యాంగంలో చోటు చేసుకున్నాయి. అదే విధంగా ప్రైవేటు రంగాన్ని లైసెన్సింగ్ విధానం ద్వారా ప్రభుత్వం అదుపులో ఉంచే ఒక మిశ్రమ ఆర్థిక విధానానికి, సమానత్వం సాధించాలనే లక్ష్యానికి కట్టుబడి పని చేయడం అందులో భాగమే. ఇవేవీ సోషలిస్టు వ్యవస్థ స్థాపన వైపు దేశాన్ని నడిపించేవి కావు. కాని సోషలిజం అనే నినాదాన్ని స్వీకరించడం నుంచి వచ్చినవి. అంటే భారతదేశం ఆనాడు అనుసరించిన "ప్రభుత్వ నియంత్రణతో నడిచే ఆర్థిక వ్యవస్థ" అనేది సోషలిజాన్ని నిర్మిస్తాం అనే ప్రకటిత లక్ష్యం నుండి రూపొందినటువంటిది. ఇది సామ్రాజ్య వాద వ్యతిరేక స్వభావంతో కూడిన జాతీయతతో ముడిపడి వుంది.



అయితే నయా ఉదారవాద వ్యవస్థను ప్రవేశపెట్టడంతో మన దేశంలో మార్పు వచ్చింది. ప్రభుత్వం అంటే జాతీయతాభావం చెప్పినదానికి ఇది భిన్నం. "జాతి" ప్రయోజనాల కోసమే నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టినట్టు చెప్పి సమర్థించు కున్నారు. ఆ విధానాలను అమలు చేసినప్పుడే మన దేశ జీడీపీ వేగంగా వృద్ధి చెందుతుందని, దాని ప్రయోజనాలు పైనుంచి కింద ఉండే సామాన్యుల వరకూ క్రమంగా ప్రసరి స్తాయని, (ట్రికిల్ డౌన్) అంతేగాక భారత దేశాన్ని ఒక ప్రధాన అగ్ర రాజ్యంగా చేస్తాయని చెప్పారు. నయా ఉదారవాద విధానాలు ఆర్థిక అసమానతలను పెంచుతాయనే వాస్తవాన్ని నయా ఉదారవాద సమర్థకులు ఏనాడూ నిరాకరించలేదు. తమ విధానాలు ఆర్థిక అసమానతలను తగ్గించినట్టు వారు ఎక్కడా చెప్పుకోలేదు. జాతీయోద్యమం ఆశించిన లక్ష్యాలను సాధించడానికి నయా ఉదారవాద విధానాలు మరింత మెరుగ్గా తోడ్పడతాయని వారు చెప్పలేదు. దానికి బదులు ఈ విధానాలు భారత దేశాన్ని ఒక అగ్రరాజ్యంగా మారుస్తాయని వారు చెప్పారు. అంటే ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక దేశంగా, ప్రజల మధ్య సమానత్వం సాధించే దిశగా వ్యవహరించే బదులు, ఆ సామ్రాజ్యవాద దేశాలతో పోటీపడి ఒక అగ్ర రాజ్యంగా తయారవ్వాలనే అవగాహనను ముందుకు తెచ్చారు.

ఈ అవగాహనలో అంతర్లీనంగా "జాతీయత" అంటే ప్రజల పక్షాన నిలిచేది అనే భావన లేకుండా పోయింది. ప్రజల జీవితాలను అన్ని విధాలా మెరుగుపరచడం కోసం పాటుపడేది అన్న లక్ష్యమే లేకుండా పోయింది. దానికి బదులు ఒక అస్పష్టమైన, అమూర్తమైన, ప్రజలకు అతీతమైన జాతీయత అనే భావన చోటు చేసుకుంది. అటువంటి జాతీయత కోసం ప్రజలందరూ త్యాగాలు చేయాల్సిందే నన్న భావన ముందుకొచ్చింది. అంటే "ప్రజల కోసం దేశం" అనే భావన స్థానంలో "దేశం కోసం ప్రజలు" అనే భావన వచ్చింది. యూరప్ ఖండంలో జాతీయత అంటే ఉన్న భావనను ఇది గుర్తు చేస్తోంది. ఐతే ఇది అచ్చంగా యూరోపియన్ భావన వంటిదే అని అనుకోలేం.

ఈ నయా ఉదారవాద వ్యవస్థ అనేది స్వాతంత్ర్యానంతరం నెలకొల్పిన "ప్రభుత్వ నియంత్రణలో నడిచే ఆర్థిక వ్యవస్థ"కు ఉన్న లక్ష్యాలను మరింత మెరుగుగా, వేగంగా సాధించడం కోసం ఏర్పడినది కాదు. ఇది ప్రభుత్వం అనేది ఎవరివైపు ఉండాలి అన్న కీలకమైన విషయాన్నే మార్చివేసింది. ఒక విధంగా చెప్పాలంటే "సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీ యత" అన్న భావన స్థానంలో "జీడీపీ- జాతీయత" అన్నది వచ్చింది. ఆ విధంగా దేశం, జాతీయత వంటి భావనల అర్థమే మారిపోయింది. ఈ "జీడీపీ జాతీయత" అనేది యూరోపియన్ జాతీయత మాదిరిగా ఇతర దేశాలమీద పెత్తనం చేయాలనే సామ్రాజ్యవాద స్వభావం కలిగినటువంటిది కాదు. ఇది మన దేశాన్ని తక్కిన దేశాలతో పోటీలో ఉన్నట్టు పరిగణించే జాతీయత. అలాగే ఈ "జీడీపీ జాతీయత" అనే భావనలో కొందరు దేశ ప్రజల్ని పరాయివారిగానో, శత్రువులుగానో పరిగణించే కోణం కూడా లేదు. లౌకిక భావనను నిరాకరించే కోణం కూడా లేదు. కాని "జీడీపీ జాతీయత" దేశం గురించి జొప్పించిన అమూర్తమైన భావన వలన ఫాసిస్టు జాతీయతా భావాలను జొప్పిండానికి దారి ఏర్పడింది.

సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించుకోవాలనే లక్ష్యం ఉంటే అప్పుడు దానిలో భాగంగా అందరికీ సమానమైన పౌరసత్వ హక్కులను కల్పించాలనే లక్ష్యం కూడా ఉంటుంది. సంపద పంపిణీలో అందరికీ న్యాయం జరగాలనే లక్ష్యం కూడా ఉంటుంది. అదే "జీడీపీ జాతీయత" అనే భావనలో చూస్తే సమానత్వం సాధన అన్న లక్ష్యమే లేకుండా పోయింది. దానికి బదులు అస్పష్టమైన "అగ్రరాజ్య స్థాయిని చేరుకోవడం" వంటి లక్ష్యం వచ్చింది. ఈ నయా ఉదారవాద వ్యవస్థ మొత్తంగానే ఇప్పుడు ఒక ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతోంది. అందుచేత సంపద వృద్ధి ప్రయోజనాలు అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజలకు క్రమంగా ప్రవహిస్తాయి అన్న ఆశ కూడా అంతరించింది. సంపదలో పెరుగుతున్న అసమానతలు, పేదరికం అంతకంతకూ ఎక్కువమంది ప్రజానీకాన్ని ఆవరించు కుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో అగ్ర రాజ్యస్థాయిని సాధించడం వంటి లక్ష్యాలు ఆ ప్రజానీకాన్ని సంతృప్తి పరచలేవు. ఈ దశలోనే దేశంలోని బడా పెట్టుబడి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకం అయి నయా ఉదారవాద వ్యవస్థను నిలబెట్టడానికి ఫాసిస్టు శక్తులతో కూడబలుక్కుని వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే "హిందూ రాజ్యం" అన్న భావన ముందుకొచ్చింది. ఇది రాజ్యం యొక్క ఫాసిస్టు స్వభావాన్ని కప్పిపుచ్చడం కోసం రూపొందించిన నినాదం మాత్రమే.

ఈ హిందూ రాజ్యం అనే అస్పష్ట భావన ఇంతవరకూ ఉన్న "జీడీపీ జాతీయత"కు ప్రత్యామ్నాయంగా వచ్చినది కాదు. దానికి తోడుగా అదనంగా వచ్చి చేరినటువంటిది. ఇప్పుడు హిందూ రాజ్యం అనే ఫాసిస్టు జాతీయతావాదం నయా ఉదారవాద వ్యవస్థను బలపరిచే సైద్ధాంతిక ముసుగుగా పని చేస్తోంది.

> "జాతీయత" అంటే ప్రజల పక్షాన నిలిచేది అనే భావన లేకుండా పోయింది. ప్రజల జీవితాలను అన్ని విధాలా మెరుగుపరచడం కోసం పాటుపడేది అన్న లక్ష్యమే లేకుండా పోయింది. దానికి బదులు ఒక అస్పష్టమైన, అమూర్తమైన, ప్రజలకు అతీతమైన జాతీయత అనే భావన చోటు చేసుకుంది. అటువంటి జాతీయత కోసం ప్రజలందరూ త్యాగాలు చేయాల్సిందే నన్న భావన ముందుకొచ్చింది. అంటే "ప్రజల కోసం దేశం" అనే భావన స్థానంలో "దేశం కోసం ప్రజలు" అనే భావన వచ్చింది. యూరప్ ఖండంలో జాతీయత అంటే ఉన్న భావనను ఇది గుర్తు చేస్తోంది. ఐతే ఇది అచ్చంగా యూరోపియన్ భావన వంటిదే అని అనుకోలేం.

మన దేశంలో మొదట నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టిన రాజకీయ శక్తులు లౌకిక విధానానికి వ్యతిరేకం కాదు. భారత దేశాన్ని ఒక అగ్ర రాజ్యంగా నిలబెట్టడానికి జీడీపీ వృద్ధి రేటును వేగవంతం చేయడమే మార్గం అనే వాదనతో ఆ శక్తులు కొత్త వ్యవస్థను (నయా ఉదారవాద వ్యవస్థను) బలపరిచాయి. (అవినీతి అనేది భారత దేశాన్ని ఒక అగ్రరాజ్యంగా నిలబెట్టడానికి ఆటంకంగా తయారౌతోంది కనుక దానిని తొలగించాలని ఒక కాంగ్రెస్ నాయకుడు ఒక సందర్భంలో అన్నాడు. అలా ఆటంకంగా ఉండనట్లైతే అతడికి అవినీతి పట్ల వ్యతిరేకత ఉండేది కాదన్నమాట) ఇప్పుడు ఆ విధానాల అమలుకు ముందు దారి మూసుకుపోయింది. ఇక్కడ ప్రజలందరి ప్రయోజనాలనూ నెరవేర్చగల, సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం కల జాతీయత అనేదానికి చోటే లేదు. ఇప్పుడు ఈ పరిస్థితి బడా పెట్టుబడిదారీ వర్గాన్ని ఫాసిస్టు శక్తులతో జత కట్టడానికి మాత్రమే కాక ఆ ఫాసిస్టు శక్తులు తమ ఫాసిస్టు "జాతీయత"తో అధికారాన్ని సైతం చేపట్టే స్థాయికి సైతం దోహదం చేసింది.

ఆ విధంగా నయా ఉదారవాద వ్యవస్థను ప్రవేశ పెట్టడానికి సైద్ధాంతిక ప్రాతిపదికగా పని చేసిన "జీడీపీ జాతీయత" సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయతను దెబ్బ తీసి ఫాసిస్టు "జాతీయత" పైచేయి సాధించడానికి కావలసిన రంగాన్ని సిద్ధం చేసింది.

అందుచేత ఫాసిస్టు శక్తుల ఆధిపత్యాన్ని అధిగమించాలంటే కేవలం నయా ఉదారవాద వ్యవస్థను అధిగమిస్తే చాలదు. సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయతా భావాలను కూడా పునరుద్ధరించాల్సి వుంటుంది. లేకపోతే ఈ ఫాసిస్టు శక్తులు అధికారం కోల్పోయినా, మళ్ళీ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అదే మాదిరిగా మళ్ళీ వచ్చాడు.

ఈ విషయాన్ని ఇప్పుడు నొక్కి చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్‌ను చాలా మంచి మనసు, హృదయం ఉన్న వ్యక్తిగా, అసలు సిసలైన లౌకికవాదిగా స్మరించుకుంటున్నారు. కాని ఈ దేశంలో నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టడంలో ముఖ్య భూమిక పోషించినది అతడే. డా.మన్మోహన్ సింగ్ వ్యక్తిగత విశిష్ట స్వభావాన్ని అడ్డం పెట్టుకుని నయా ఉదారవాద వ్యవస్థను సమర్ధించడానికి పలువురు ఇప్పుడు తయారయ్యారు. ఫాసిస్టు శక్తులు బలపడడానికి, నయా ఉదారవాద విధానాలకు గల సంబంధాన్ని చాలా మంది అర్థం చేసుకోవడం లేదు కనుక వీరి ప్రయత్నం కొంతవరకూ విజయం సాధించవచ్చు కూడా. ఫాసిస్టు శక్తులు బలపడడానికి కేవలం రాజకీయ కారణాలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ దాని వెనుక ఉన్న ఆర్థిక కారణాలను విస్మరిస్తే ఇదే జరుగుతుంది. ఈ పొరపాటు అవగాహనను సరి చేసుకోకపోతే అది అంతిమంగా ఫాసిస్టు శక్తులు మరింత బలపడడానికే తోడ్పడుతుంది.

(స్వేచ్ఛానుసరణ)

రాష్ట్రాల యూనివర్సిటీలు కేంద్రం గుప్పిట్లోకి!


నూతన సంవత్సరమైన 2025 విద్యా రంగంపైన మరో దాడితో ప్రారంభమైంది. మోడీ ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ద్వారా కొత్త నిబంధనల ముసాయిదా విడుదల చేసింది ('యూనివర్సిటీలు, కాలేజీలలో టీచర్లు, అకడమిక్ సిబ్బంది నియామకం ప్రమోషన్ ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణకు కనీస అర్హతలు' పేరిట). దేశంలోని ఉన్నత విద్యా సంస్థలపై అదుపు పెంచుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మరో ప్రయత్నమిది. యూజీసీ చెప్పే ప్రకారం దేశంలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 481 రాష్ట్రాల యూనివర్సిటీలు వున్నాయి. ఈ నిబంధనల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల యూనివర్సిటీలకు కూడా నియామకాలు చేసేందుకు, వాటి నిర్వహణ ఎలా వుండాలో చెప్పేందుకు హక్కులను కబళించేస్తున్నది. రాజ్యాంగంలో ఒక ముఖ్యమైన సమాఖ్య సూత్రంపై ఇది ప్రత్యక్షంగా దాడి చేయడమే.

కేంద్రం చెప్పిన వీసీలు

దేశంలోని అన్ని యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల నియామకం ఎలా జరగాలో ఈ ముసాయిదా నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. వి.సి ల పరిశీలన, ఎంపిక కమిటీల ఏర్పాటు నిబంధనలను మార్చడం కోసం ఇవి ఉద్దేశించబడ్డాయి. ప్రస్తుతం ఈ కమిటీలలో ముగ్గురు సభ్యులు-యూజీసీ ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనగా ఛాన్సలర్ ప్రతిపాదించిన సభ్యులు, యూనివర్సిటీ సిండికేట్-సెనేట్/ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ప్రతినిధి వుంటున్నారు.కొత్త ముసాయిదా చెబుతున్న మార్పులు కేంద్ర ప్రభుత్వానికి మొగ్గు చూపేవిగానూ రాష్ట్ర ప్రభుత్వానికి ఏ పాత్ర లేకుండా చేసేవిగానూ వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ హక్కును లాగేసుకుని ఛాన్సలర్‌కు అంటే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధికి ఇస్తున్నాయి. ఇది నియామకాలను కేంద్రం చేతుల్లో పెట్టడమే గాక బీజేపీ, ఆరెస్సెస్, వీహెచ్‌పీలకు అనుకూలమైన వ్యక్తులను యూనివర్సిటీల వి.సిలుగా రుద్దేందుకు ఉద్దేశించాయి. కేరళలో గవర్నర్ పరిశీలన, ఎంపిక కమిటీ సిఫార్సులను తోసిరాజని ఆరెస్సెస్ అనుకూలమైన వ్యక్తిని వైస్ ఛాన్సలర్‌గా నియమించడం ఇప్పటికే మనం చూశాం. బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) భారతీయ విద్యావ్యవస్థ కేంద్రీకృతం, వ్యాపారాత్మకం చేయడానికి బాట వేసింది. విద్యా వ్యవస్థలో ప్రాథమిక భాగస్వాములైన అధ్యాపకులు, విద్యార్థులు సరైన రీతిలోనే దాన్ని వ్యతిరేకించారు. ఎన్ఈపి విధాన నిర్దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఈ కొత్త నిబంధనల ముసాయిదా ముందుకొచ్చింది.

ఉన్నత విద్యపై ఉచ్చు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అది యూనివర్సిటీలు ఉన్నత విద్యా సంస్థలపై ఉమ్మడి ఎజెండా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నది. రాష్ట్రాల చేతుల్లోని ముఖ్యమైన స్థానాలన్నిటినీ వశపర్చుకోవడంలో భాగంగా సరైన అర్హతలు లేకున్నా హిందూత్వ భావజాలంగల వ్యక్తులను నియమించడం ప్రారంభిం చింది. తాను అధికారంలో లేని రాష్ట్రాలలో ఇందుకోసం గవర్నర్లను ఉపయోగిస్తున్నది. తమిళనాడు, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లతో పాటు కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కూడా ఈ విధంగా గవర్నర్లు తమ పరిధిలోని యూనివర్సిటీల నిర్వహణలో నియంత్రణలో జోక్యంచేసుకోవడాన్ని ప్రతిఘటిం చింది. రాజ్యాంగం విద్యను ఉమ్మడి జాబితాలో పెట్టగా ఈ ముసాయిదా నిబం ధనలు రాష్ట్రాల హక్కులను కాలరాసేవిగా వున్నాయి. గవర్నర్లు సాగిస్తున్న ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు చట్టబద్ధ మైన విలువ కల్పించేందుకే ఈ ముసాయిదా నిబంధనలు వచ్చాయి.పాక్షిక ప్రయోజనాల సాధన కోసం గవర్నర్ల స్థానాన్ని పచ్చిగా ఉపయోగించుకోవడం జరుగుతు న్నది. ప్రతిపక్షాలు పాలన చేస్తున్న చోట్ల ఆ ప్రభుత్వాల పాలన సజావుగా సాగకుండా వీరు ప్రతిబంధకాలవుతున్నారు. ఎందుకంటే వారు చాలావరకూ కేంద్రంలోని పాలక పార్టీ ఏజెంట్లే. ఇలాంటి పరిస్థితుల్లో గవర్నర్లకు యూనివర్సిటీ ఛాన్సలర్ల వంటి రాజ్యాంగ పదవులు అప్పగించినపుడు వారు ఆ పాలక పార్టీ ఎజెండాను అమలు చేయడానికే ఉపయోగిస్తారు.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

గత కమిషన్ల సిఫార్సులేంటి?

కేంద్ర,రాష్ట్ర సంబంధాల సమీక్ష కోసం నియమించబడిన రెండు కమిషన్లు ఛాన్సలర్లుగా గవర్నర్ల పాత్రపై వ్యాఖ్యానించడం గమనించదగింది. గవర్నర్ ముఖ్యమంత్రి లేదా సంబంధిత మంత్రులతో సంప్రదింపులు జరపాలని చెప్పడం స్పష్టంగానే ప్రయోజనకరమని 1988లో నివేదిక సమర్పించిన సర్కారియా కమిషన్ పేర్కొంది. ప్రత్యేకించి ఛాన్సలర్లుగా వారి పాత్రను ప్రస్తావిస్తూ 'అలాంటి ముఖ్యమైన విషయాల్లో గవర్నర్ ఆ మంత్రిని సంప్రదించాలని సూచించడం మంచిదని' చెప్పింది. ఈ రెండు సిఫార్సులను కూడా అనుసరించింది లేదు.

ఇలాంటిదే మరొకటైన పూంఛీ కమిషన్ సర్కారియా కమిషన్ నివేదిక తర్వాత ఇరవై ఏళ్లకు తన నివేదికనిచ్చింది. అది తన సిఫార్సు లలో సర్కారియా కన్నా మరో అడుగు ముందుకు వేసి ఇలా పేర్కొంది. "గవర్నర్లను యూనివర్సిటీ ఛాన్సలర్లుగా చేసి తద్వారా వారికి అధికారాలు కట్టబెట్టడం గతంలో కొంత ప్రాధాన్యత కలిగివుండింది గానీ మారిన కాలమాన పరిస్థితులను బట్టి అవి ఇప్పుడు వర్తించేవిగా లేవు. యూనివర్సిటీ విద్య నియంత్రణపై మంత్రి వర్గానికి సహజంగానే ఆసక్తి వుంటుంది. కనుక విధులు అధికారాలలో ఘర్షణకు దారితీసే ఈ విధానాన్ని కొనసాగించవలసిన అవసరమేమీ లేదు. ఏ చట్టం కిందనైనా గవర్నర్‌కు యథాలాపంగా విధులు అప్పగించకూడదని కమిషన్ భావిస్తున్నది. తన పాత్ర రాజ్యాంగ నిబంధనలకే పరిమితం కావాలి" అని పేర్కొంది.

సహజంగానే ఇలాంటి సిఫార్సులు బీజేపీ ప్రభుత్వానికి మింగుడుపడేవి కావు. బీజేపీ సైద్ధాంతికంగా కూడా సమాఖ్య భావనకు వ్యతిరేకంగా కేంద్రీకరణ కోరుకుంటుంది. అందువల్లనే అది కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కమిషన్లు చేసిన సిఫార్సుల అమలు కోసం గవర్నర్ల అధికారాలు తగ్గించడం పట్ల ఆసక్తి చూపించదు. ఈ ముసాయిదాలో అత్యంత కర్కోటకమైన భాగం ఏమంటే ఈ నిబంధనలు అమలు చేయని రాష్ట్రాలు లేదా మరే ఇతర వ్యవస్థలపై శిక్షా చర్యలు నిర్దేశించడం. అలాంటి సంస్థలను యూజీసీ పథకాల్లో పాలు పంచుకోకుండా బహిష్కరించాని ఈ ముసాయిదా చెబుతున్నది. యూజీసీ చట్టం కింద నిర్వహించే ఉన్నత విద్యా సంస్థల జాబితా నుంచి అలాంటి వాటిని తొలగించాలంటున్నది. క్లుప్తంగా చెప్పాలంటే తన ఆదేశాలకు లోబడి వుండాలని యూనివర్సిటీలను యూజీసీ నిర్దేశిస్తున్న నిర్బంధ చర్యే ఇది. ప్రధానంగా వివిధ యూనివర్సిటీలకు నిధులు పంపిణీ చేసేందుకు మాత్రమే యూజీసీ ఉద్దేశించింది తప్ప వాటిపై పెత్తనం చేసేందుకు కాదు.

ప్రయివేటు ఇష్టారాజ్యం

ఆ ముసాయిదాలో ఇంకా ముఖ్యమైన సిఫార్సులున్నాయి. అవి కూడా ఉన్నత విద్య ఆరోగ్యానికి హాని కలిగించేవే. ఈ నిబంధనల ద్వారా యూజీసీ నాన్ అకడమిక్ వ్యక్తులను కూడా వైస్ ఛాన్సలర్లుగా నియమించడాన్ని చట్టబద్ధం చేసుకోవాలనుకుంటున్నది. గతంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు వి.సి లుగా నియమితులైన సందర్భాలు మనకు తెలుసు. ఇప్పుడీ నిబంధనలు పరిశ్రమలకు సంబంధించిన వారిని కూడా వి.సి లుగా నియమించేందుకు అనుమతినిస్తున్నాయి. ఇది యూనివర్సిటీల అకడమిక్ స్వభావాన్ని దెబ్బతీసి వాటిని పరిశ్రమలకు, ప్రత్యేకించి ప్రయివేటు రంగానికి తోకలుగా మార్చేందుకు జరుపుతున్న దాడి ఇది. అంతేగాక దేశంలో స్థాపించబడిన ప్రయివేటు యూనివర్సిటీలకు అకడమిక్ వ్యక్తులనే వి.సి లుగా నియమించాలనే చింత లేకుండా స్వేచ్ఛ కల్పించే చర్య. ఇది ప్రయివేటు యూనివర్సిటీల విద్యా ప్రమాణాలను నాణ్యతపై మరింత రాజీకి దారితీస్తుంది.

వివిధ యూనివర్సిటీలలో అధ్యాపక సిబ్బంది కూడా ఇప్పటికే ఈ నిబంధనలపై వ్యతిరేకత ప్రకటించారు. ఎందుకంటే వాటి వల్ల నియామకాల్లో నాణ్యత దెబ్బతినిపోతుంది. విద్యా సంబంధమైన ప్రమాణాలు సడలిపోవడం, యూనివర్సిటీల నాణ్యత దెబ్బ తినడమేగాక పని భారం పెంపు, తాత్కాలిక నియామకాల ప్రభావం పట్ల కూడా వారు విమర్శ చేశారు. ప్రజల సూచనల కోసం యూజీసీ విడుదల చేసిన ఈ నిబంధనల ముసాయిదా 30 రోజుల పాటు అందుబాటులో వుంటుంది. మన విద్యా వ్యవస్థ పట్ల, దేశ భవిష్యత్తు పట్ల ఆసక్తిగల వారందరూ ఈ నిబంధనలకు తమ వ్యతిరేకతను నమోదు చేయాలి. ఈ నిబంధనల ఉపసంహారం కోసం విద్యార్థులు, అధ్యాపక వర్గాలు అన్ని ప్రజాస్వామిక శక్తులతో కలసి సమైక్యంగా పనిచేయాలి.

(జనవరి 8 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ
ఖమ్మం
మంగళవారం | జనవరి 14, 2025 | www.navatelangana.com



వైభవంగా గోదారంగనాథ కల్యాణ మహెూత్సవం

- కోలాట బృందం ఊరేగింపుతో అమ్మవారికి సారె
- రేజర్ల రామాలయంలో ముగిసిన ధనుర్మాసోత్సవాలు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం రేజర్లలోని శ్రీసీతారామచంద్రస్వామివారి దేవాలయంలో ప్రముఖ ప్రవచనకర్త, ఉపన్యాసరత్న శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్యస్వామి ఆధ్వర్యంలో నెలరోజుల పాటు జరిగిన ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా గోదారంగనాథస్వామి కల్యాణ మహెూత్సవాన్ని పురస్కరించుకొని కోలాట బృందం ఊరేగింపుతో అమ్మవారికి సారె తీసుకొచ్చారు. అనంతరం గోదారంగనాథస్వామి కల్యాణాన్ని కన్నుల పండువలా అత్యంత వైభవంగా జరిపారు. స్వామివారి కల్యాణ మహెూత్సవ అనంతరం రామకృష్ణమాచార్యస్వామి మాట్లాడుతూ ధనుర్మాస ప్రాశస్త్యం, గోదాదేవి మానవజాతికి చూపించిన సన్మార్గాన్ని భక్తులకు వివరించారు. గోదాదేవి చూపిన మార్గాన్ని ఆచరించిన వారంతా ఆయా కుటుంబాలతో ఆనందంగా సుఖశాంతులతో జీవనాన్ని గడిపారన్నారు. శరీరాన్ని వదిలాక భగవంతుడి దగ్గరకి చేరుకోవడానికి ఇంతకంటే ఉత్తమమైన మార్గం మరొకటి లేదని నిరూపించిన తల్లి గోదాదేవి అని రామకృష్ణమాచార్యస్వామి స్పష్టం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అలరించిన సంక్రాంతి ముగ్గులు

నవతెలంగాణ-కొణిజర్ల

పల్లిపాడు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ అధ్యక్షతన అంగరంగ వైభవంగా సంక్రాంతి ముగ్గుల పోటీ జరిగింది. భోగి పండుగ పురస్కరించుకొని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొని తీరక రంగులతో ముగ్గుల్ని వేయడం జరిగింది. ఈ ముగ్గుల పోటీలో విజేతలు అయినటువంటి వారికి 2021 మిస్సెస్ ఇండియా ఎంప ఫర్హా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. మిస్సెస్ ఇండియా మహమ్మద్ ఫర్హా మాట్లాడుతూ మహిళలు ఎందులో కూడా తక్కువ కాదని, దానికి లైవ్ ఎగ్జాంపుల్ తానేనని, దీనిని స్పూర్తిగా తీసుకొని మహిళలందరూ కూడా పెళ్లి అయినా కాకపోయినా ప్రతి దాంట్లో కూడా మీకున్నటువంటి టాలెంట్‌ని ప్రూవ్ చేసుకొని మీకు ఇష్టమైన రంగంలో ముందుకు వెళితే విజయం సాధించవచ్చునన్నారు. మహిళలకు నా సహాయ సహకారాలు కావాలంటే తన వంతుగా సహకరిస్తానని, అదే విధంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఎన్నో ప్రోగ్రామ్స్‌ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, వాటితో పాటు ప్రత్యేకంగా మహిళ కోసం గేమ్స్ కూడా కండక్ట్ చేయవలసిందిగా మహమ్మద్ ఫర్హా ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు సుధీర్‌ను కోరడం జరిగింది. ఈ సంక్రాంతి ముగ్గుల పోటీలో మహిళలు ప్రతి ఒక్కరు కూడా చాలా అందంగా ముగ్గులు వేశారని, ప్రతి ఒక్కరి ముగ్గులు కూడా చాలా స్పూర్తిదాయకంగా ఉన్నాయని అన్నారు. ఓడిపోయిన వారు బాధపడవద్దని, మళ్లీ ప్రయత్నం చేస్తే తప్పక విజయం సాధిస్తారన్నారు. గెలిచిన వాళ్లకి అభినందనలు తెలిపారు.ఈ ముగ్గుల పోటీలో శీలం వరలక్ష్మి మొదటి బహుమతి, మేడా శ్రీలత ద్వితీయ బహుమతి, బాణిశెట్టి లావణ్యకి తృతీయ బహుమతి రాగా కన్సోలేషన్ బహుమతులు వరుసగా అల్లిక స్పూర్తి, గుర్రం స్రవంతి, ఆకుల ఉమాంజలి, మాచర్ల లలిత, కొండ శిరీష, పిన్నం గీత, రాయల గాయత్రి, గండికోట వరలక్ష్మి, కమ్మగంటి శ్రీలత, దంతాల త్రివేణికి రావడం జరిగింది. కార్యక్రమంలో జడ్జెస్‌గా బొంతు సమత, నర్వనేని ఆదిలక్ష్మి, విజేత ఫ్రెండ్స్ యూత్ సభ్యులు మేడా మోహన్‌రావు, నరసింహరావు, గుత్తా కృష్ణయ్య, పాటి కార్తీక్, గుర్రం అప్పారావు, మోహన్ కృష్ణ, వెంకటేష్, నరేష్, యశ్వంత్, ఉపగ్న, దామా సంయోజిత పాల్గొన్నారు.



అంగరంగ వైభవంగా గోదాదేవి రంగనాథ స్వాముల కల్యాణ మహెూత్సవం

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు పట్టణంలో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం పూజా కార్యక్రమాలలో భాగంగా ఆలయ అర్చకులు సౌమిత్రి రామాచార్యులు, చక్రవర్తుల రామానుజాచార్యులు పలువురు బ్రాహ్మణోత్తముల ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాథ స్వామి దేవతామూర్తుల కల్యాణ మహెూత్సవాన్ని సంప్రదాయబద్ధంగా మేళ తాళాలతో అంగరంగ వైభవంగా నేత్రపర్వంగా జరిపించారు. కల్యాణం మహెూత్సవాన్ని తిలకించేందుకు వందలాది మంది మహిళ భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కల్యాణం అనంతరం దేవతామూర్తులను శేష వాహనంపై అలంకరించి ఆలయం చుట్టూ వైభవంగా ప్రదక్షిణ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి గీతాల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు ఆలయం మేనేజర్ సూర్య ప్రకాశరావు స్థానాచార్యులు సావిత్రి రఘునాథ చార్యులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, సిలివేరు కృష్ణా రావు, బొల్లం రామారావు, బొడ్డు కృష్ణయ్య, స్వర్ణ వెంకటనారాయణ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

నవతెలంగాణ-కొణిజర్ల

చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా మంచి పేరు ప్రతిష్టలు సాధించుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా ఉపేందర్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు షేక్ ఖాశీం, పఠాన్ ఖాసింఖాన్ పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని సాలె బంజర గ్రామంలో సోమవారం యువతీ, యువకులకు కబడ్డీ, కోకో పోటీలు నిర్వహించిన ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రీడలు యువతీ యువకుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందించటంతో పాటు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్య వ్యాపారం కావటంతో నేడు క్రీడలకు ప్రాధాన్యత తగ్గిందన్నారు. ప్రైవేటు పాఠశాలలు కళాశాలలు ధనార్జనే దేయంగా పని చేస్తూ బట్టీ చదువులకే ప్రాధాన్యతను ఇస్తున్నాయని క్రీడలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బంటు లచ్చన్న, రాజు, రమేష్, సైదా, ప్రవీణ్, ఈశ్వర్, శివ, బాలరాజు, డి.రాజేష్, బి.కుమార్ స్వామి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం



భోగి, సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని ఖమ్మం జిల్లా ప్రజలందరికీ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ పర్వదిన వేళ ప్రజలందరు వారి కుటుంబ సభ్యులతో నిండు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో అంగరంగ వైభవంగా జీవనం గడపాలని అకాంక్షించారు.

గ్రామగ్రామాన భోగిమంటలు

నవతెలంగాణ-కల్లూరు

సంక్రాంతి పండగ పర్వదినం సందర్భంగా సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేసి సంక్రాంతి పండగ వేడుకలు ప్రారంభించారు. ప్రతి గ్రామాల్లో తెల్లవారుజామున నాలుగు గంటల దగ్గర నుండి భోగి మంటలు వేసి ఆటపాటలతో కొత్త సంవత్సరంలో తొలి తెలుగు పండగ కావడంతో ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు. సంక్రాంతి పండగ అంటే తెలుగు ప్రజలకు అతి ముఖ్యమైన పండగ. పాడిపంట సమృద్ధిగా పండాలని మనసారా ప్రతి ఒక్కరూ కోరుకుంటూ ఘనంగా నిర్వహిస్తారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భోగి వేడుకలు

నవతెలంగాణ-కూసుమంచి



మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద భోగి వేడుకలను సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి మాధురి కలిసి జరుపు కున్నారు. ఈ వేడుకలకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు.... హరిదాసు కీర్తనలు... లబండా సంప్రదాయ నృత్యం... డప్పు చప్పులతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కులం చూడం...మతం చూడం..

పేదలందరికీ సంక్షేమ పథకాలు



- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే
- రాబోయే నాలుగేండ్లలో 20 లక్షల ఇళ్లు లక్ష్యం..
- ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ..
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచిలో నమూన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

నవతెలంగాణ- కూసుమంచి

కులం లేదు.... మతం లేదు... ఏ పార్టీ అని అడగం.... సంక్షేమం ఇస్తే వచ్చేసారి మా పార్టీకి ఓటు వేయాలనే నిబంధన పెట్టం...కేవలం పేదోడు అయితే చాలు ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకానికి అర్హుడేనని తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో నిర్మించిన నమూన ఇందిరమ్మ ఇళ్ల ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో ఈ ఆనందం ప్రతిరోజు ఇలానే ఉండే విధంగా ఆ దేవుడు వారిని దీవించాలన్నారు. 2004 నుంచి 2014 వరకు ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈనాటి తెలంగాణలో అత్యధిక ఇళ్లు పేదలకు కట్టించి ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు.... ఇందిరమ్మ ఇల్లు అంటేనే ఇందిరమ్మ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కావాలని తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకొని ఒక సంవత్సరం పూర్తయి రెండో సంవత్సరంలోకి వచ్చామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏందో ప్రతి తెలంగాణ బిడ్డకు తెలుసని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆనాడు పెద్దలు ఎలా కొల్లగొట్టారో తెలుసని, అయినా కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఇచ్చిన ప్రతీ హామీని తెలంగాణ బిడ్డకు ఇస్తూ ఎక్కడా తెలంగాణలో పేదవాడు ఇబ్బంది పడొద్దు అని పేదవాడు కుటుంబం ఆనందంగా ఉండాలని తహతహలాడుతూ ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లమీద ఈ ప్రభుత్వం ఎంత చిత్త శుద్ధితో ఉందో చెప్పడానికి మొదటి విడతగా మొదటి సంవత్సరంలోనే నాలుగున్నర లక్షల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించాలని ఒక ధృఢ సంకల్పంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తక్కువలో తక్కువ 3500 ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఉన్నంత వరకు సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. జనవరి 26 నుంచి పేదలు మెచ్చే మరో నాలుగు సంక్షేమ హామీలు అమలు కాబోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఒకటే చెప్పదలుచుకున్నానని తెలంగాణ రాష్ట్రంలో ఉండే పేద వాడి కల నెరవేర్చడం కోసం అర్హులైన ప్రతీ పేదవాళ్ళకి ఈ ఇందిరమ్మ రాజ్యం రాబోయే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇల్లు కట్టాలని చిత్తశుద్ధితో ఉన్నట్లు చెప్పారు. ఎన్ని ఒడిదుడుకులు, ఎన్ని ఇబ్బందులు, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా పేదవాడి ముఖములో ఆనందం చూడటం కోసం పేదవాడి కల నెరవేర్చడం కోసం పేదవాడు కూడా ఒక గూడుని ఏర్పాటు చేయడం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని హామీ ఇచ్చారు. రియల్ ఎస్టేట్‌కి మార్చిన భూములు తప్ప వ్యవసాయానికి యోగ్యమైన ఎన్ని ఎకరాలు ఉన్నా ఆనాటి ప్రభుత్వం సంవత్సరానికి 10వేలు ఇస్తే ఈనాడు ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా 12 వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అది పది లక్షలా, 15 లక్షలా ఎన్ని లక్షలు అనేది కాదు ఎన్ని కార్డులు అయినా ఇస్తామని తెలిపారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా భరోసా కార్యక్రమం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ప్రతి సంవత్సరం పన్నెండు వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమాన్ని రెండు విడుతలుగా శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. అనంతరం మండలంలోని దుబ్బ తండాలో ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్, ఖమ్మం ఆర్డీఓ, హౌసింగ్ ఈఈ, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల అభివృద్ధికి సమగ్ర చట్టాలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరావు

నవతెలంగాణ- ఖమ్మం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై మాత్రమే ఆధారపడ్డ వ్యవసాయ కూలీలకు వారి ఆర్థిక అభివృద్ధికి సమగ్రమైన చట్టాలు చేయాలని, ప్రభుత్వ పథకాలు అన్నింటిని వారి నుండే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉపాధి హామీ పథకంను సమగ్రవంతంగా అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్లో 2,50,000 కోట్ల రూపాయల కేటాయించాలని, సంవత్సరానికి రూ.200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 చొప్పున కూలీ వేతనం ఇవ్వాలని, వైద్యం, విద్య, ఇండ్ల నిర్మాణానికి వ్యవసాయ కూలీలను ఎంపిక చేసి గృహ వసూలు కల్పించాలని అన్నారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ కూలీలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని, సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు విధించకుండా ప్రతి ఒక్కరికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఒకేసారి మంజూరు చేయాలని, ఖాళీ స్థలాలు ఉన్న పేదలకు ముందుగా ఇల్లు నిర్మాణం చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షల చొప్పున ఇస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోవాలని, భూమి లేని నిరుపేదలందరికీ వ్యవసాయం ఆధారంగా ఉన్న భూములను ప్రభుత్వ భూములను బంజరు భూములను పంపిణీ చేయాలని అన్నారు. పోడు గిరిజనులకు పట్టాలు అందజేసి వారికి వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా విద్యుత్ లైన్లు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పొన్నగంటి సంగయ్య తాళ్లపల్లి కృష్ణ, వత్సవాయి జానకిరాములు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడబట్ల సుదర్శన్, గాలి అంజయ్య, జే వెంకన్న బాబు, సారంగి పాపారావు, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి శుభాకాంక్షలతో ఇంటింటికీ సీపీఐ(ఎం)

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలి
- పేదలందరికీ రూ.12వేలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మున్సిపాలిటీ పరిధిలో పేదలకు వర్తింప చేయాలని, పేదలందరికీ జాబ్ కార్డులు ఇచ్చి 12 వేల రూపాయలు ఇవ్వాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని రేచర్ల బజార్ నందు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ఇంటింటికీ సిపిఐ(ఎం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఐ(ఎం) పార్టీని ఆదరించాలని, భవిష్యత్ పోరాటాలు సహకరించాలని, సమిష్టిగా పోరాడితేనే ప్రజలు సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించకపోతే మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు వేల పేద కుటుంబాలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మున్సిపాలిటీలోని పేదలందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల మోహన్ రావు, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, గుమ్మ నరసింహారావు, మాడపాటి మల్లికార్జున్, మాడపాటి వెంకటీ, అమరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో సృజనాత్మకశక్తిని వెలికి తీయడానికి పోటీలు దోహదం

- సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్
- విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఐద్వా, డీవైఎఫ్ఐ వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ బహుమతులు ప్రదానం చేశారు. 23వ డివిజన్ చర్చి కాంపౌండ్ ఏరియాలో జరిగిన ముగ్గుల పోటీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వై విక్రమ్ మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా క్రీడలు నిర్వహించడంలో ఐద్వా, డీవైఎఫ్ఐ కమిటీలు చాలా ముందంజలో ఉన్నాయన్నారు. ఖమ్మం నియోజకవర్గం వ్యాప్తంగా పలు సెంటర్‌లలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడలు నిర్వహిస్తున్నామని, ముగ్గులు, క్రికెట్, వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయన్నారు. యువత, మహిళల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం క్రీడలకు నిధులు తగ్గిస్తూ వస్తుందని విమర్శించారు. భారత్ దేశం కంటే చిన్న చిన్న దేశాల్లో క్రీడలకు బడ్జెట్‌లో నిధులు ఎక్కువ కేటాయిస్తే, మోడీ ప్రభుత్వం మాత్రం తగ్గిస్తూ వస్తుందో అని ఆరోపించారు. రాబోయే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ జబ్బర్, ఎస్‌కె.మెహరున్ని సాబేగం, భాగం అజిత, ఎస్‌కె.మీరా సాహిబ్, అంబటిపూడి సుధాకర్, దినేష్, ఫరీదా, దాసరి నాగేశ్వరరావు, శ్రీను, నాగరాజు, వి.రాంబాబు, ఎస్‌కె.సత్తార్ తదితరులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా స్రవంతి, శ్రీదేవి, పద్మ, రమ వ్యవహరించారు.

భోగి మంటల్లో నూతన వ్యవసాయ మార్కెట్ విధానపత్రం దగ్ధం

- స్వామినాథన్ సిఫార్సులు ప్రకారం మద్దతు ధర నిర్ణయించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



రైతు నేత జగ్జత్ సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు సంక్రాంతి భోగి మంటల్లో నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం సోమవారం వైరా సుందరయ్య నగర్ బ్రాహ్మణపల్లిలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పట్టణ నాయకులు పైడిపల్లి సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మూలంగా వ్యవసాయం చేస్తున్న రైతులు సంక్షోభంలో ఉన్నారని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానం వ్యతిరేకిస్తూ, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 49 రోజులు నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ప్రైవేట్ వ్యవసాయ మార్కెట్లుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రంలో అనుమతి ఇవ్వడం ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థను నాశనం చేయుటకు దారి తీస్తుందని అన్నారు. రైతులు ఐక్యంగా నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం రద్దు కోసం పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు, మాజీ ఎంపిపి బొంతు సమత, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు యనమద్ది రామకృష్ణ, తోట నాగేశ్వరరావు, రుద్రాక్షల నరసింహాచారి, వడ్లమూడి మధు, తోట కృష్ణవేణి, మల్లెంపాటి ప్రసాదరావు, మాడపాటి రాజేష్, అమరనేని కృష్ణ, ఎస్‌కె పాషా, పైడిపల్లి నాగేశ్వరరావు, కొంగర సుధాకర్, దేవభక్తిని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





వికలాంగులు ఆర్థిక బలోపేతం కావాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు

నవతెలంగాణ-నేలకొండపల్లి

వికలాంగులు వ్యాపారాలలో రాణిస్తూ ఆర్థిక బలోపేతం కావాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. కొంతమంది దాతల సహాయంతో నలుగురు నిరుపేద దివ్యాంగుల కుటుంబ పోషణ నిమిత్తం ఎస్ఆర్డిఎస్ టిడి జేఏసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణం అండ్ ఫాన్సీ షాపులను ఆయన ప్రారంభించారు. మండలంలోని సుర్దేపల్లి గ్రామానికి చెందిన రాధా, సదాశివపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, పైనంపల్లికి చెందిన సావిత్రి, అప్పలనరసింహపురం గ్రామానికి చెందిన పిల్లి కావ్యలకు కిరాణా వ్యాపారం నిమిత్తం ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున అందించడం అభినందనీయమన్నారు. ఇటీవల మండల కేంద్రంలోని ఎన్టీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో 70 మంది దివ్యాంగులకు ఎనేబుల్ ఇండియా, ఎస్ఆర్డీఎస్ టిడి జేఏసీ ఆధ్వర్యంలో ఇచ్చిన వ్యాపార నైపుణ్య శిక్షణ వారు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడుతుందన్నారు. వికలాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే నిజమైన విజయం సాధించినట్లు అని తెలిపారు. వికలాంగులందరికీ రుణ సదుపాయం కొరకు జిల్లా మండల అధికారులతో బ్యాంకర్స్‌తో చర్చించి ప్రతి ఒక్క వికలాంగులకి రుణాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. టిటిడి జేఏసీ చైర్మన్ పి.వి చలమయ్య మాట్లాడుతూ దివ్యాంగులు అందరూ ఐకమత్యంతో ఉన్నప్పుడే ఏదైనా సాధించగలుగుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్డిఎస్ డైరెక్టర్ గడ్డం రాంబాబు, మాజీ సర్పంచ్ కడియాల శ్రీనివాసరావు, ప్రసాద్, దివ్యాంగుల గ్రామ శాఖబాధ్యులు గడిపూడి భాస్కరరావు, ఎడవల్లి సైదులు, వాసు, కుక్కల సామేలు, కొరివిరన్న, బ్రహ్మం, వెంకటేశ్వర్లు, పిల్లి నాగరాజు, గోపి రాజ్ రామారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మకర సంక్రాంతి శుభాకాంక్షలు

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగని, పంటల పండుగలైన భోగి, సంక్రాంతి, కనుమ అందరి జీవితాల్లో సుఖ సంతోషాలను, శ్రేయస్సును, ఆయురారోగ్యాలను, తీసుకురావాలని ఆకాంక్షించారు. భోగి, మకర సంక్రాంతి పర్వదినాలకు మన సంస్కతిలో గొప్ప ప్రాముఖ్యత ఉందన్నారు. భోగి మంటలు..రంగ వల్లులు..హరిదాసుల కీర్తనలు..గంగిరెద్దుల ఆటలు..గాలిపటాల సందళ్లు.. పైరుపచ్చల కళకళలు.. రైతు లోగిళ్లలో ధాన్యం రాసులు.. పిండి వంటల ఘుమఘుమలు..బంధుమిత్రుల సందళ్లతో కనువిందు చేసే మన అందరి పండుగ సంక్రాంతి అని అన్నారు. ఈ శుభ సందర్భంగా సమాజంలో ప్రేమ, ఆప్యాయత, సోదర భావం, సౌభ్రాతత్వం వెల్లివిరియాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఖమ్మం
మంగళవారం | జనవరి 14, 2025 | www.navatelangana.com



డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-పెనుబల్లి

భారత ప్రజాతంత్ర యువజన సమైక్య ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకొని కేడబ్ల్యూ చౌడవరంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. బహుమతులు అందించిన దాతలు విజయలక్ష్మి ఫ్యాన్సీ, పాలగాని ఈశ్వర్, కురువేటి రమేష్‌బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కలకోట అప్పారావు, కార్యదర్శిగా బుక్య ప్రసాద్, మహిళా సంఘ అధ్యక్షురాలు మిట్టపల్లి నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బెజవాడ సాయి, జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

'అఖిల భారత రైతుకూలీ సంఘం సదస్సును జయప్రదం చేయాలి'

నవతెలంగాణ-కామేపల్లి



ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏరియా కమిటీ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రంను సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కారేపల్లి కామేపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి భూక్య శివ నాయక్ సోమవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి తిండి పెడుతున్న, రైతులు పండించిన, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. రైతు ఈ దేశానికి వెన్నుముకని, రైతే ఈ దేశానికి రారాజు అని పాలక ప్రభుత్వాలు ఎంతో గొప్పలు చెప్పినప్పటికీ, రైతులను ఆదుకోవడంలో పాలక ప్రభుత్వాలు, ఎప్పటికప్పుడు రైతులని మోసం చేస్తూ వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వడంలో ప్రభుత్వం నిమ్మకు నేరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రైతు కూలి హక్కుల కోసం కొట్లాడుతున్న అఖిలభారత రైతుకూలీ సంఘం, ఏఐకెఎంఎస్ ఈనెల 17వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు జర్పల రామ్ సింగ్ నాయక్, గుర్రం సత్యం, అజ్మీర అశోక్, పిల్లల మర్రి ఓనియా, ఏ. సక్రం తదితరులు పాల్గొన్నారు.



సాగర్ కాల్వలో చెత్త తొలగింపు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని తెలగవరం మైనర్ కాలువలో చెత్తను సోమవారం కాంగ్రెస్ నాయకులు, రైతులు తొలగించారు. చెత్త పేరుకుపోయిన విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి నాయకులు రైతులు, తీసుకుని వెళ్లడంతో చెత్తను తొలగించేందుకు మంత్రి చొరవ చూపడంతో చెత్తను తొలగించారు. చెట్లు, గుర్రపుడెక్క తుటి కాడ పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో రైతులు పంటలకు నీళ్ల అందక, ఇబ్బందులకు గురయ్యారు. మంత్రి చొరవతో కాలువలో చెత్త తొలగించి నిరాటకంగా నీటి సరఫరా చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాప సుధాకర్, జక్కంపూడి కిషోర్, మారెళ్ళ మల్లికార్జునరావు, రైతులు పాల్గొన్నారు.



యాదవులు ఐక్యతతో పోరాడాలి

నవతెలంగాణ-ఖమ్మం

యాదవుల సమస్యల పరిష్కారం కోసం గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మళ్లీ ఐక్యతతో మన హక్కులను సాధించుకోవడానికి పార్టీల కతీతంగా, వర్గాలు రాజకీయాలకతీతంగా పోరాట కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని అఖిల భారత జిల్లా యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం జిల్లా అఖిలభారత యాదవ మహాసభ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి గొర్రెల పెంపకం దారుల సంఘాలను స్వయం సహాయక సంఘాలుగా మార్చాలని చేసిన ప్రయత్నాన్ని అడ్డుకొని, సమస్యల పరిష్కారం కోసం 2002 ఫిబ్రవరి 4న ఖమ్మం జిల్లా అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ ధర్నా కార్యక్రమం నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లిక అంజయ్య, చంద్రకాని గట్టయ్య, మేకల నాగేశ్వరరావు, పొదిలి భూపతి, పొదిలి తిరుపతిరావు, కాసు మల్లేష్, జాల నరసింహారావు, మంచుకొండ ఉపేందర్, పద్మ యాదవ్, బమ్మిడి శ్రీనివాస్, సత్తి వెంకన్న, బండారి ప్రభాకర్, దుబాకుల వెంకటేశ్వర్లు, చేతుల నాగేశ్వరరావు, మొరి మేకల కోటయ్య, తెల్లబోయిన వెంకటరమణ, బొల్లు సైదులు, పుల్లారావు, మేకల మల్లేష్, తొడేటి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఖమ్మం

1989వ బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సోమవారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వైరా మండలం, రెబ్బవరం జిల్లా పరిషత్ పాఠశాల 1989వ బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థుల పూర్వ ఆత్మీయ సమ్మేళనం పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 35 సంవత్సరాల కితం 10 తరగతి పూర్తి చేసుకొని, ఉద్యోగ, వ్యాపార, వివిధ రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన అలనాటి విద్యార్థులు ఒకే వేదిక పైకి వచ్చిన ఆ మధురమైన క్షణాలు, ఒకరి కొకరి ఆత్మీయ పలకరింపులు చూపరులను సైతం ఆనందం కలిగించాయి. 1989 రెబ్బవరం జిల్లా పరిషత్ పాఠశాలలో తమకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించిన గురువు బండారుపల్లి.వెంకయ్యను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తమ గురువు యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని, పాదాభి వందనం చేసి వారి దీవెనలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండారు జ్యోతి, దోసపాటి బుజ్జి, డి.రాణి, స్వరూపరాణి, పల్లపోతుల రవికుమార్, కేసా వెంకటగురునాదం, ఎస్‌కె ఇబ్రహీం, తూము అజయకుమార్, బాలబోయిన నరసింహారావు, పంగా కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కార్యాలయంలో భోగి వేడుకలు

నవతెలంగాణ-మధిర



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్యాంప్ కార్యాలయంలో సోమవారం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరంశెట్టి కిషోర్, తూమాటి నవీన్ రెడ్డి, కర్నాటి రామారావు, టీవీ రెడ్డి, అనిల్ నెహ్రూ, పులిబండ్ల చిట్టిబాబు, వాల్మీకి పవన్, రంగారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తీరబోతున్న కష్టాలు

- 2500 ఎకరాలకు సాగునీరు
- భూగర్భ జలాలు పెరిగే అవకాశం
- 26 చెరువులకు జలకళ
- మంచుకొండ ఎత్తిపోతలకు మంత్రుల శంకుస్థాపన



నవతెలంగాణ-రఘునాథపాలెం

మంచుకొండ ఎత్తిపోతలతో రైతుల కష్టాలు తీరబోతున్నాయి. మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో సోమవారం ఐదుగురు మంత్రుల చేత ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రఘునాథపాలెం మండలం గిరిజనులు నివసిస్తున్న ప్రాంతం ఈ ప్రాంతంలో రైతులకు సాగునీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఈ నేపథ్యంలో నా దృష్టికి రాగానే వెంటనే ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఈ ఇందిరమ్మ ప్రజా పాలనలో సాగునీరు వచ్చే ప్రాజెక్టులను పూర్తి ప్రాధాన్యం ఇస్తున్నామని, అలాగే గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 10 నియోజకవర్గ లో సాగునీరు ప్రతి రైతుకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. రాబోవు రోజులో సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు ఇవ్వడం మా లక్ష్యమని అన్నారు. నా కోరిక మేరకు భద్రాచలానికి రైలు మార్గం చేయాలని, అలాగే కొత్తగూడెంకు విమానాశ్రయం తెచ్చి తీరుతామని తెలియజేశారు. అభివృద్ధి ఒకపక్క సంక్షేమం ఒకపక్క అన్నిటికీ ప్రధాన్యం ఇస్తూ జిల్లాలో శభాష్ అనిపించేలా అందరూ మంత్రులు కలిసి పనిచేస్తామని చెప్పారు. నేను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రికి 70 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరగా, చేసేలా కృషి చేస్తామని, ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలియజేశారు. రఘునాథపాలెం మండల రైతులు, వెంటనే పామాయిల్ సాగు చేసేలా కృషి చేయాలని, పిచ్చి పిచ్చి పంటలు వేయకుండా అప్పుల పాలు కాకుండా, పామాయిల్ పంట సాగు చేసి, మీ పిల్లల భవిష్యత్తును చూడాలన్నారు. రఘునాథపాలెం మండలం ఎత్తైన ప్రదేశం కావున సాగర్ జలాలు దూరంగా ఉండటం వలన సాగర్ జలాలను, వెంకటాయపాలెం గ్రామ సమీపంలో పంప్ హౌస్ లిఫ్ట్ చేసి రఘునాథపాలెం మండల వ్యాప్తంగా రైతులకు సాగునీటి అందేలా కృషి చేస్తామన్నారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ... 10 ఏళ్ళు పరిపాలించిన గత ప్రభుత్వం చేయని పనులను మనం చేస్తున్నామని, ప్రజలకు, గృహజ్యోతి, ఉచిత బస్సు సౌకర్యం, 500లకే గ్యాస్ సిలిండర్, అందిస్తున్నామని, మిగతా ఇచ్చిన హామీలను, మార్చి 26న ముహూర్తం పెట్టామని, మంత్రి అన్నారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఈ ప్రాంతంలో వ్యవసాయంతో పాటు పరిశ్రమలు కూడా ఉంటే మరింత అభివృద్ధి చెందుతుందని, మంత్రి అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... రఘునాథ పాలెం మండల ప్రజలకు ఈ ఎత్తిపోతల పథకం సంక్రాంతి కానుక అని ఆయన అన్నారు. 54 వేల కోట్లతో నిర్మిస్తున్న ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి మంచినీటి, సౌకర్యం కలుగుతుందని, ఈ పథకం వలన వచ్చే ఉగాదికి నీరు అందుతుందని తెలియజేశారు. ఈ ప్రజా పాలనలో ఓకే సిద్ధాంతంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగు చేసే విధంగా కృష్ణ జలాలు సాగర్ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు ముగ్గురు మంత్రులు ముగ్గురికి ముఖ్యమైన శాఖలు కలిగి ఉన్నారని, ఖమ్మం జిల్లా ప్రజలు అదృష్టవంతులని అన్నారు. డిసెంబర్ 7 2023లో క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశామని గుర్తు చేశారు. అప్పటినుండి సంక్షేమం అభివృద్ధి పట్ల దృష్టి సారించామని తెలియజేశారు. గత ప్రభుత్వంలో 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి ఒక ఎకరానికి సాగు నీరు ఇవ్వలేదని, అటు పాలమూరు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు, ద్వారా రైతులకు సాగునీటి ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు.



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే విధంగా కృషి చేసే మార్గం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ వానాకాలం సీజన్ లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి సాగు 153 లక్షల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం పండించి తెలంగాణ రైతులు భారతదేశంలో రికార్డు సృష్టించారని ఆయన తెలియజేశారు. గోదావరి జలాల ద్వారా ఖమ్మం జిల్లాకు సస్యశ్యామలం చేస్తామని, సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటి కల నెరవేరుతుందని హామీ ఇచ్చారు.

ఈ ఇందిరమ్మ రాజ్యంలో మార్చి 26 నుంచి రైతు భరోసా, నిరుపేదలకు అందించే 12 వేల రూపాయలు, కొత్త రేషన్ కార్డులు, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తామని, ఎన్నో దశాబ్దాల కలలు నెరవేరుస్తామని, మన ఇందిరమ్మ రాజ్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, కాంగ్రెస్ పార్టీకి ఖమ్మం జిల్లా కంచు కోట అని గుర్తు చేశారు.

రోడ్డు భవనాలు శాఖ, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ... ఇందిరమ్మ ప్రభుత్వంలో, ప్రజా పాలనలో రైతులకు సాగునీరు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుందని మంత్రి అన్నారు. ఈ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందేలా కృషి చేస్తామన్నారు. మీ జిల్లాలకు ముగ్గురు మంత్రులు త్రిమూర్తులని, మీరు అడిగినదే చేస్తారని, తెలంగాణ రాష్ట్రాన్ని ఖమ్మం జిల్లా మంత్రులే పాలిస్తున్నారని, ఆయన గుర్తు చేశారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నాం, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మొదటి సంవత్సరంలో కొన్ని హామీలను నెరవేర్చాము. మార్చి 26న ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని, ఇచ్చిన మాటను కట్టుబడి ఉన్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు, రామ సహాయం రఘురామరెడ్డి, మహబూబాబాద్, జిల్లా పార్లమెంట్ సభ్యులు, బలరాం నాయక్, కొత్తగూడెం శాసనసభ్యులు, కూనంనేని సాంబశివరావు, వైరా శాసనసభ్యులు, మాలోతు రాందాస్ నాయక్, సత్తుపల్లి శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ ముజమిల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్, శ్రీజ, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మానుకొండ రాధా కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పువాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం నియోజకవర్గం అధ్యక్షులు, మహమ్మద్ జావిద్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, పూర్ణచంద్రరావు, మాదంశెట్టి హనుమంతరావు, వాంకడోత్ దీపక్ నాయక్, మంచుకొండ మాజీ సర్పంచ్, వాంకడోత్ విజయ, కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలో దేశం

- భారీగా పెరుగుతున్న నిరుద్యోగం
- మోడీ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి
- సీపీఐ(ఎం) త్రీ టౌన్ స్టడీ సర్కిల్‌లో వక్తలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

భారత ఆర్థిక విధానాలను నరేంద్ర మోడీ దివాలా తీయిస్తున్నాడని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, రాజకీయ విద్యా విభాగం జిల్లా కన్వీనర్ బండారు రమేష్ అన్నారు. స్థానిక గుమస్తాల సంఘ భవనంలో పత్తిపాక నాగ సులోచన అధ్యక్షతన రూపాయ పతనం, ఆర్థిక విధానాలు అనే అంశంపై త్రీ టౌన్ టౌన్ స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ స్టడీ సర్కిల్‌లో యర్రా శ్రీకాంత్, బండారు రమేష్ మాట్లాడుతూ భారతదేశం మొత్తం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని ఆరోపించారు. ఒకపక్క నిరుద్యోగం భారీగా పెరుగుతుందని, మరోపక్క నిత్యవసర ధరలు కూడా రోజు రోజుకి భారీగా పెరుగుతున్నాయని, వీటన్నిటికీ కారణం కేంద్రలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే కారణమన్నారు. ప్రజలకు న్యాయం చేయాల్సింది పోయి కార్పొరేట్ పెట్టు బడుదారులకి న్యాయం చేస్తూ రాయితీలు మాఫీ చేస్తూ పేద ప్రజలకు విచ్చలవిడిగా భారాలు మోపుతుందని వివరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆర్థిక వ్యవస్థని గాడిలో పెట్టి నిరుద్యోగులకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ధరలను నియంత్రణలోకి తీసుకురావాలని ప్రజలపై భారాలు లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మోడీ పైన ఉందని వారు ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేనిపక్షంలో ప్రజలు తీవ్రసంతృప్తిలో ఉద్యమాల్లోకి వస్తే సీపీఐ(ఎం) నాయకత్వం వహిస్తుందని వారి సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాస్ రావు,





సీపీఐ(ఎం) త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్‌రావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజ్జనేపల్లి శ్రీనివాస్‌రావు, డివిజన్ నాయకులు కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, నాయకులు యర్రా రంజిత్, ఎస్‌కే .ఇమామ్, బండారు వీరబాబు, శీలం వీరబాబు, ఎస్‌కే.బాబు, నాయని నరసింహారావు, యర్రా మల్లికార్జున్, ఎస్కే.మస్తాన్, కొట్టే అలివేలు, ఎర్ర నగేష్, ఎస్కే.కాసిం, సారంగి పాపారావు, కన్యకంటి శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రతి రైతు సభ్యత్వం కలిగి ఉండాలి

- రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాదినేని

నవతెలంగాణ-చింతకాని

రైతులు ప్రతి ఒక్కరు సభ్యత్వం కలిగి ఉండాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ తెలిపారు. సోమవారం మండల పరిధిలో కోదుమూరు గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ న్యాయం జరగాలంటే తమకి రైతు సంఘాలు అండగా ఉండాలన్నారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు కానీ ఎరువులు కానీ అందుబాటులో ఉండాలి అంటే రైతు సంఘాలు చేసే పోరాటాల వల్లన ఎరువులు అందే పరిస్థితి ఉంటుందన్నారు. కోదుమూరు నూతన రైతు సంఘం నూతన శాఖ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నూతన అధ్యక్షులుగా చిట్టిమోదు చిన్న లింగయ్య, కార్యదర్శిగా మాదినేని రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. కమిటీ సభ్యులుగా ఆరుగురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి నక్కనబోయిన శాంతారావు, బందెల కళ్యాణ్, నాగులు, నక్కనబోయిన కృష్ణ, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-మధిర

మల్లారం గ్రామంలో (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా ఐద్వా ఖమ్మం జిల్లా కార్యదర్శి బండి పద్మ, సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు హాజరై విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. నిత్యం మహిళా సమస్యలపై పోరాటాలు నిర్వహించే ఐద్వా మహిళా సంఘం మహిళలను ఉత్తేజపరుస్తూ ముందుకు నడిపించేందుకు అలాగే ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మహిళలు ఆటల్లో పాటల్లో తమ హక్కుల సాధనలో ధైర్యంగా ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మంద సైదులు, గ్రామ సర్పంచ్ మందడపు ఉపేంద్ర, మహిళా సంఘం మండల కార్యదర్శి గౌరరాజు ధనలక్ష్మి, సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి షేక్ ఉద్దండు, సాహెబ్ గుండ్లపల్లి రమణ, గ్రామ మహిళా సంఘం, సీపీఐ(ఎం) నాయకులు పాల్గొన్నారు.



నూతన రామాలయాన్ని సందర్శించిన కాంగ్రెస్ మండల కమిటీ

నవతెలంగాణ-చింతకాని

మండల పరిధిలో నేరడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయాని కాంగ్రెస్ మండల కమిటీ సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ రామాలయ నిర్మాణానికి ఎంత ఖర్చు వస్తుంది దాన్ని రా మెటీరియల్ డిజైన్స్ ఎక్కడి నుంచి తీసుకొచ్చారు. ఇంత తొందరగా దేవాలయం నిర్మాణం చేపట్టటం చాలా గొప్ప విషయం అన్నారు. దేవాలయ కమిటీ ఊరు మొత్తం సహకారాలు అందించడం అనేది విశేషం అన్నారు. దేవాలయం నిర్మాణం చేపట్టి అతి తక్కువ కాలంలో పూర్తి చేయడం దైవ సంకల్పం అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, మండలి యువజన కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున్, పందిళ్ళపల్లి ఎంపీటీసీ ఓర్స్ వీరభద్రం, మండల నాయకులు వంగూరు రమేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మనం చిన్నప్ప, ఎస్‌కె అఫ్జల్ సాహెబ్, గ్రామం ఉప సర్పంచ్ దూసరి గోపాలరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పెరిక నాగేశ్వరరావు, ఆలస్యం అంకయ్య, నున్న నాగయ్య, కందిమల్ల పానకాలు తదితరులు పాల్గొన్నారు.

జగ్గీత్ సింగ్ దల్లే వాల్ దీక్షకు మద్దతుగా ఆందోళన

నవతెలంగాణ-ముదిగొండ



రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పంజాబ్, హర్యానా సరిహద్దు ఖానేరులో ఆమరణ దీక్ష చేపట్టిన రైతు నేత జగ్గిత్ సింగ్ దల్లేవాల్ మద్దతుగా రైతు సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ముదిగొండ అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్ మాట్లాడుతూ సాగు చేసే పంటలన్నిటికీ మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 49 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నాయకులు జగ్గిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వము మొండి వైఖరికి పోకుండా రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కనీస మద్దతు ధర ప్రకటించి రైతు నాయకులు జగ్గీత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శి కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నాయకులు మందరపు శ్రీనివాసరావు, సామినేని నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మంకెన దామోదర్, మందరపు వెంకన్న, బుర్ర ధర్మయ్య, తోటకూరి వెంకట్, వేగనాటి అప్పారావు, పోనుకుల వీరశేఖర్, పుచ్చకాయల లక్ష్మయ్య, కందుల వెంకటేశ్వర్లు, మల్లెల ఉపేందర్, కాంచాని లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య, నెమిలి సైదులు, సిపిఐ నాయకులు రావులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | జనవరి 14, 2025 | www.navatelangana.com



మాట తప్పని, మడిమ తిప్పని నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి

- అంతర్జాతీయ గాంధీపథం అధ్యక్షులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి

నవతెలంగాణ-బూర్గంపాడు

మాట తప్పని, మడిమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని, అన్ని వాగ్దానాలు అమలు చేసి తీరుతాడని అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షులు డా.బూసి రెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగమైన రైతుల కోసం రైతు భరోసా కార్యక్రమాన్ని రైతులకు ఇష్టమైన సంక్రాంతి పండుగ తర్వాత జనవరి 26 నుంచి అమలు చేయనున్నారని ఆయన అన్నారు. రైతులకు ఇష్టమైన సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రైతు భరోసా ప్రకటించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి సోమవారం రెడ్డి పాలెం గ్రామంలో పూలాభిషేకం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధీపథం జిల్లా నాయకులు చింతలచెర్వు గెర్షోము, గంజి సంపత్, గొర్రెముచ్చు వెంకటరమణ, గుండే రామారావు, భద్రాచలం రివర్సైడ్ రోటరీ క్లబ్ నాయకులు డా.మడిపెద్ది రమేష్, రాఘవయ్యలు తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి అంటేనే అందమైన రంగవల్లులు

- ఐటీసీ పీఎస్ పీడీ బీఆర్‌టీయూ అధ్యక్షుడు శంకర్ రెడ్డి

నవతెలంగాణ-అశ్వాపురం

సంక్రాంతి పండుగ అంటేనే గ్రామాల్లో మహిళలు అందమైన రంగవల్లుల పోటీలలో పాల్గొని వీధులలో ముగ్గులు వేసి సంతోషంగా గడుపుతారని ఐటీసీ పీఎస్ పీడీ బీఆర్‌టీయూ అధ్యక్షుడు సానుకొమ్ము శంకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతిరాల క్రాస్ రోడ్డు గ్రామంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో ఆయన పాల్గొని మాట్లాడారు. దిశా ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దిశా కమిటీ సభ్యులతో స్నేహ సంబంధాలు ఉన్నాయని గతంలో అనేక మార్లు ఈ పోటీలలో పాల్గొని విజేతలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇప్పుడు కూడా తనను ఆహ్వానించి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విజేతలను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. దిశా ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలతో పాటు మహిళలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి షేక్ అజీమ్, కోమటిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గద్దల నాగేశ్వరరావు, గద్దల రామకృష్ణ, దిశా కమిటీ నాయకులు అన్నపూర్ణ, తోటమల్ల నిర్మల, కాలువ వనజాక్షి పాల్గొన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ఎంతో ఉత్సాహంగా చేసుకుంటున్నారు. పట్టణాలు నుండి పల్లెలకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగస్తులు భోగి సందర్భంగా సోమవారం తెల్లవారుజామున నుండి బోగి మంటలు వేడినారు. మహిళలు పిండి వటంలు గ్రామాల్లో బసవన్న ఆటలతో మొదటి రోజు సంక్రాంతిని ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు.



18న ఐఎఫ్‌టీయూ విలీన సభ

నవతెలంగాణ-ఇల్లందు

బలమైన విప్లవ కార్మికోద్యమ నిర్మాణం, విస్తరణ కోసం జనవరి 18న కొత్తగూడెంలో నిర్వహించే ఐఎఫ్‌టీయూల విలీనా సభను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు, తెలంగాణ మోటర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాసుద్దిన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ముద్రించిన ప్రచార వాల్ పోస్టర్లను సిహెచ్పి రైల్వే గేట్ దగ్గర కోల్ ట్రాన్స్పోర్ట్ కార్మికులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను కాల రాస్తుందని విమర్శించారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణకై ఉద్యమించాలని, ప్రైవేటీకరణ, కార్పొరేటికరణ విధానాలను ప్రతిఘటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. జనవరి 18న కొత్తగూడెం క్లబ్లో నిర్వహించే ఐఎఫ్టియుల విలీన సభ, ర్యాలీకి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోటర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు డి.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మోరే వెంకటేశ్వర్లు, పి.రమేష్, విజయ్, చిరంజీవి, చారి, ఆకాష్, బాలు తదితరులు పాల్గొంటున్నారు.

19న మున్సిపల్ రాష్ట్ర మహాసభ

నవతెలంగాణ-ఇల్లందు



టీయూసీఐ (అనుబంధ) సంఘం తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభ మహబూబాబాద్‌లో జరుగుతుందని, ఈ మహా సభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం మస్టర్ వద్ద జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం పిఆర్‌సి కమిటీ నివేదిక ప్రకారం మున్సిపల్ కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.15,600 ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. వెంటనే హామీలు అమలు చేయాలన్నారు. నీ మహాసభలో మున్సిపల్ కార్మికుల జీతాల మీద చర్చించి భవిష్యత్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు మున్సిపల్ కార్మికులు మహాసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు. నాయిని కృష్ణ, విక్రమ్ వెంకన్న కుమార్, శ్రీధర్, భారతి, భూలక్ష్మి, ఉమా, మంగమ్మా, భాగ్యమ్మ, కృష్ణవేణి, రాజేశ్వరి, అనిల్, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండగ సకల సంపదలతో విరజిల్లాలని...కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతి తీసుకురావడంతో పాటు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి పండగ ప్రజల జీవితంలో నిత్యం కాంతులు విరిసిల్లాలి అన్నారు. అలాగే గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

ఆకాశంలో రంగురంగుల పతంగులు

- ఉత్సాహంగా ఎగరేస్తున్న పిల్లలు, యువకులు
- పిల్లలూ...జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-ఇల్లందు



మకర సంక్రాంతి రోజుల్లో గాలి పటాలు ఎగరవేయడం ఆనవాయితీగా వస్తోంది. చలికాలం, వాతవరణం పొడిగా అహ్లాదభరితంగా, గాలి అనుకూలంగా ఉండటంతో పంతగీలు ఎగరవేయాలనికి అనుకూలంగా ఉంది. దీనికితోడు పాఠశాలలకు సెలవులు ఉంటడంతో పిల్లలు, యువకులు ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశంలోని చాల చోట్ల పంతుగులు ఎగురవేయడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాదులో కైట్ ఫెస్టివల్‌ను సైతం ప్రభుత్వం నిర్వహిస్తోంది. దేశవిదేశాల నుండి అవుత్సాహికులు కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నారు.

సంక్రాంతి పండుగ అంటే అందరికీ ఆనందమే

భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులపాటు పిల్లలు, పెద్దలు అంతా హడాహుడి. పతంగులు ఎగురవేడానికి చిన్నపెద్దా తేడా లేకుండా హుశారుగా ఆడుతుంటారు. నేలపై, డాబాలపై, ఇంటి కప్పులపై ఎక్కి పతంగులు ఆడుతుంటారు. అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పతంగులు ఎగురవేస్తుంటారు. పగలే ఆకాశంలో నక్షత్రాలు వచ్చాయా అనే విధంగా గాలిపటాలు కనిపిస్తాయి. ఎక్కడ చూసినా పతంగుల కేరింతలు సందడి కనపడుతుంటుంది. ఆట ఆడుతున్నప్పుడు ఏదో లోకంలో ఉన్నట్లుగానే ఉంటుంది. పతంగులు ఎగురవేస్తూ ఆకాశంలోకి చూస్తుంటారు. గట్టి మాంజ దారం ఉపయోగించి మరో పతంగి కోయడానికి ప్రయత్నిస్తుంటారు. రెండు పతంగుల దారాలు రాసుకుపోయి ఏదో ఒకటి పతంగి దారం తెగిపోతుంది. ఎంతో ఎత్తులో తెగిపోయినా పతంగి గింగిరులు కొడుతూ కిందకు పడుతుంది. పతంగి కోసం పిల్లలు ఉరకుకులు పరుగులు పెడుతుంటారు. ఇండ్లు, స్తంభాలు ఎక్కి పతంగికోసం ఎగబడుతుంటారు. ఆదో హుషారు. సంతోషం.

జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా పంతగులు ఎగురవేయాలి

1) గాలిపటాలు ఎగురవేసే సమయంలో తల్లి దద్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి. జాగ్రత్తలు పాటింపజేయాలి. లేకపోతే పెను ప్రమాదం జరిగే అవకావం ఉంది. భనవాల మీద పతంగులు ఎగురేసేవారు డాబా మధ్యలో ఉండాలి. అంచులకు వెళ్లకుండా గమనిస్తు ఉండాలి.

2) పతంగులు ఆకాశంలో పోటిపడుతున్నప్పుడు కీంచ్‌కాట్ (దారాన్ని లాగడం) తమ వెనుక ఎంత స్థలం ఉన్నది గమనించాలి. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వెనక్కు వెళ్ళడం చేయాలి.

3) భనసం రెయిలింగ్ అంటే పిట్టగోడ లేక చిన్న గోడలు తక్కువ ఎత్తులో ఉన్నట్లయితే మరింత జాగ్రత్తలు అవసరం.

4) డాబాలపై విద్యుత్తు తీగలు కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో ఉంటాయి. చాల చోట్ల భనసాలకు తీగలు ఆనుతున్నట్లుగానే ఉంటుంది. వాటికి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

5) గాలిపటాలు విద్యుత్ తీగలకు అతుక్కుపోతే తీయడానికి ప్రత్నించవద్దు. పచ్చిగా ఉన్న వెదురు కర్రలు, లేక తడిగా ఉన్న కర్రలు, ఇనుప చువ్వలు ఉపయోగించకూడదు. వాటిని ఉపయోగించి పతంగులు తీస్తే విద్యుత్ ప్రవహించి తీవ్ర ప్రమాదం జరుగుతుంది. రూ.20 పతంగికోసం ప్రయత్నిస్తే ప్రమాదం సంభవిస్తే రూ.వేలు, లక్షలు ఖర్చుతోపాటు, ఇంటిల్లిపాది దుఖ్ఖసారగంలో మునగాల్సి వస్తుంది.

6) తెగిపోయి గాలిలో ఎగురుతు ఉన్న పతంగి ఎక్కడ పడుతుందోనని పిల్లలు ఎగబడుతు కండ్లు పైకిపెట్టి పతంగినే చూస్తు పరుగెత్తుతుంటారు. రోడ్డు మీద ఉన్న ధ్యాస కూడ ఉండదు. దీంతో వాహనాలకు ఢీకొనడం, గుంటల్లో పడిపోవడం, గాయాలు, ప్రమాదాలకు గురవడం జరుగుతుంది. అన్ని గమనిస్తు ఉండాలి.

7) గాలి పటాలకు ఉన్న దారం తగిలి యేటా ఎన్నో పక్షలు మృత్యువాత పడుతున్నాయి. పక్షలు సంచరించని చోట గాలి పటాలు ఎగురవేయాలి.

8) జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా పతంగులు ఎగురవేయాలి.



ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్ర ప్రజలకు, అదేవిధంగా నియోజకవర్గ ప్రజలకు కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వరం నిండిన జీవితం దక్కాలని, పండుగను కుటుంబసభ్యులు, స్నేహితులు, సమానంతో కలిసి హర్షాతిరేకల జరుపుకుంటూ శాంతిశాన్ని పంచుకోవాలని, రైతు, కార్మిక సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధి వంటి అంశాల్లో నియోజకవర్గం ముందడుగు వేయడంలో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పండుగ వేల ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వ శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్పొరేషన్ వద్దు పల్లె ప్రాంతాలే ముద్దు

- గోడ పత్రికలు ఆవిష్కరణ

నవతెలంగాణ-సుజాతనగర్



మండల పరిధిలోని ఏడు గ్రామపంచాయతీలను కార్పొరేషన్‌లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ కార్పొరేషన్ వద్దు...పల్లె ప్రాంతాలే ముద్దు అనే నినాదంతో గోడపత్రికలను పోరాట కమిటీ కన్వీనర్ కున్సోత్ ధర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ వలన ఉపాధి హామీ పథకం రద్దవుతుందని దీనివలన వ్యవసాయ కూలీలకు కూలి దొరక ఇప్పటికే వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిద్దని ఈ కార్పొరేషన్ వల్ల వ్యవసాయ కూలీల పరిస్థితి దయనీయంగా మారుతుందని, అలాగే చిన్న సన్న కారు రైతులకు రావలసిన సబ్సిడీలు రద్దయితాయని, ఇప్పుడు పంచాయతీలు విధించే ఇంటి పన్నులే పది రెట్లు పెరుగుతున్నాయన్నారు. చెత్త నీటి పన్ను ఇలా అనేక విధాలుగా పన్నులు విధిస్తారని అన్నారు. కార్పొరేషన్ అయిన తర్వాత గంజాయి, డ్రగ్స్, మద్యం లాంటి పదార్థాలు పెరిగి యువత చెడిపోతుందన్నారు. దొంగతనాలు, దోపిడీలు నేరాలు పెరిగి విష సంస్కృతి పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడు గ్రామ పంచాయతీల నూతన పోరాట కమిటీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య సమక్షంలో ఏర్పాటు అయిందన్నారు.

పంచాయతీల కార్పొరేషన్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్‌గా కున్సోత్ ధర్మ, కో కన్వీనర్‌గా వీర్ల రమేష్, కమిటీ సభ్యులుగా తుంపర్ రాములు, నిమ్మలగూడెం, బానోత్ కోటేష్, కనుమల్ల రాఘవులు, బండి సంజీవరావు, మూడు శోభన్, నర్రా శివరామకృష్ణ, బచ్చలకూర శ్రీనివాసరావు, నల్లగొప్పు పుల్లయ్య, గండమాల భాస్కర్, సిరిగిరి మురళి, ఎల్లబోయిన బాబు, బాలు, వెంకటేశ్వర్లు, గుగులోత్ జగన్, మద్దెల శ్రీలక్ష్మి, శ్రీధర్, రాజు, మద్దెల ప్రసాద్, కిషన్, ఎస్.కే.బాబా, కాసు శ్రీనివాస్ రెడ్డి, ఎస్.కే.బోలే షావలి, ఆకునూరి పద్మ ఆది, ఉమారాణి, తుల్లూరి పుష్పావతి, సాదినేని రమాదేవి, బాలు, భద్రమ్మ, సట్టు శైలజ, కొప్పుల సత్యవతి, చెన్నబోయిన అరుణ, వీర్ల ముత్తయ్య, తదితరులతో కమిటీ ఏర్పాటు చేశారు.

ఆకాశాన్నంటిన భోగి సంబురాలు

- సరిహద్దు దాటిన కోడి పందెలు

నవతెలంగాణ-అశ్వారావుపేట



సామాజికంగా జనసామాన్యానికి విఘాతం కలిగించని ఏ సంప్రదాయం, సంస్కృతిని అయినా కచ్చితంగా పాటించాల్సిందే. అదే కోవలోకి వస్తాయి భారతీయ పర్వదినాలు, పండుగలు. పంటలు చేతికొచ్చే సమయంలో జరుపుకునే పండుగ సంక్రాంతిని అశ్వారావుపేటలో మూడురోజులు పాటు ముచ్చటగా జరుపుకుంటారు. సాంప్రదాయంగా ఆంధ్రా ప్రాంతం అధికంగా జరుపుకునే పర్వదినం అయినప్పటికీ అశ్వారావుపేట మండలం ఆంధ్రాకు సరిహద్దున ఉండటంతో ఈ ప్రాంతంలో ఆంధ్రా, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కలగాపులగంగా జరుపుకుంటారు. దీంతో కోడి పందెలు హడావుడీ ఒక పక్క ఉంటే కొత్త అల్లుళ్ళు, ఆడపడుచులు, పట్టణాల్లో స్థిరపడి బందువులు రాకతో గ్రామాలన్నీ కోలాహలంగా ఉంటుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం మన రాష్ట్రంలో కోడిపందాలు నిర్వహణపై పోలీస్ శాఖ డేగ కన్ను నిఘా పెట్టడంతో ఈ ప్రాంతం కోడిపందాలు రాయుళ్ళు, పేకాట ఆటగాళ్ళు సరిహద్దు దాటి మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రా భూభాగంలో హల్ చల్ చేసారు. మండలంలోని "గారపాటి మకాం"లో ఎక్కడెక్కడో పట్టణాల్లో స్థిరపడిన ఏడుగురు సోదరుల కుటుంబం సభ్యులు అందరూ అశ్వారావుపేట చేరుకుని వారి చిన్ననాటి గృహ పరిసరాల్లో భోగి మంటలను ఏర్పాటు చేసి భోగి మంటలను సంప్రదాయాల నడుమ నిర్వహించుకున్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతయంగా ఆ కుటుంబ సభ్యులు స్నేహితులను సైతం ఆహ్వానిస్తారు.



మకర సంక్రాంతి పండగ రైతులు, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు



కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని, మకర సంక్రాంతి పండగ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆనందంతో కుటుంబ సమేతంగా సంక్రాంతి పండగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతులు తీసుకు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఏరియా ఆసుపత్రికు వెళ్లే దారిలో అపోలో మెడికల్ షాప్ వద్ద విగతజీవిగా ఒక వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతుడు గత రెండు మూడు నెలలుగా ఏరియా ఆసుపత్రి వద్ద సమీప ప్రాంతాల్లో భిక్షాటన చేసి జీవనం గడిపిస్తున్నాడని, అతను టీబీ వ్యాధితో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే మందులు తీసుకుంటూ వాడుతుంటాడని వెల్లడయింది. దీంతో ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించగా మృతుడు పేరు టి.శంకర్ (55)గా గుర్తించడం జరిగిందన్నారు. అతని చిరునామా వివరాలు రికార్డుల్లో పొందుపరచడానికి మృతుడు నిరాకరించేవాడని తెలియజేశారు. కావునా కుటుంబ సభ్యులు మృతదేహం కోసం స్థానిక పోలీస్ స్టేషను సంప్రదించాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు.



17వ యూసుఫ్ ట్రోఫీలు ఆవిష్కరణ

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రంలో గత 17 సంవత్సరాలుగా మిత్రుని జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్న యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీలను ట్రోఫీ స్పాన్సర్ దేగల రాజు యాదవ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మిత్రుని జ్ఞాపకార్థంగా 17 సంవత్సరాలు ఇంత ఘనంగా క్రికెట్ టోర్నమెంట్‌ని ర్వహించడం అతిశయోక్తి కాదన్నారు. ఒక సామాన్య వ్యక్తి పేరు మీద 17 ఏండ్లు ఒక ప్రయివేటు టోర్నమెంట్ నిర్వహించడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఇది మొదటి టోర్నమెంట్‌గా చెప్పుకోవచ్చునని ఆయన అన్నారు. రాబోవు భవిష్యత్తులో కూడా ఈ టోర్నమెంట్ ఇంతే ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రతి సంవత్సరం ట్రోఫీలు తానే ఇస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సలహాదారులు ఎండీ.సోహెల్ పాషా, గోనెల సర్వేశ్వరరావు, బొల్లు రవి కుమార్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు భజన ప్రసాద్, అబ్దుల్ సలీం, సారథి, కిషోర్, సత్తిపండు యువత క్రికెట్ క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



పర్ణశాలలో వైభవంగా గోదాదేవి కల్యాణం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల దేవాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవం, భోగి పండుగను పురస్కరించుకొని బైరగులపాడు వెంకటేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీనగరం దాస్ అంజనేయ స్వామి వారి ఆలయాల్లో గోదా రంగనాథ స్వామి వారి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవేత ధారణ, గోదా రంగనాథ స్వామి వారి గోత్రనామాలు, మహా సంకల్పం, మంగళాష్టకాలు, మధుపర్కాలు, జీలకర బెల్లం అనంతరం మాంగల్య పూజ నిర్వహించి మాంగల్య ధారణ అనంతరం మహా ఆశీర్వచన నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు హారతులు ఇచ్చి భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్ణశాల ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, కళ్యాణ దంపతులు తాళ్లూరి సత్యనారాయణ, ఝాన్సీ రాణి, పిలక నరేందర్ రెడ్డి, శ్యామల దంపతులతో పాటు భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-అశ్వారావుపేట



మండలంలోని దిబ్బగూడెం పంచాయతీ, దురదపాడులో టీఆర్ఎస్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు సంక్రాంతి, భోగి పండుగను గ్రామస్తులతో కుటుంబ సమేతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు, వితంతు మహిళలకు వారి మనవడు బిర్రం జతిన్, మనమరాలు హేమ శ్రీ ద్వారా దుప్పట్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో బిర్రం వెంకటేశ్వరరావుతో పాటు ఎంపీటీసీ పండా రాజు, కుంజ అర్జున్, వైస్ ప్రెసిడెంట్ రాజులు, పండా ముత్యాలు, కాకా చంద్రం, మడకం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు

- వైభవంగా స్వామివారి రాపత్తు సేవ

నవతెలంగాణ భద్రాచలం రూరల్

ముక్కోటి అధ్యయనోత్సవాలు స్వామివారి తెప్పోత్సవం ఉత్తర ద్వార దర్శనం ముగిసినప్పటికీ వరుస సంక్రాంతి సెలవులు రావడంతో భద్రాద్రి రామయ్య దర్శనానికి భక్తులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలిరాగా స్వామివారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. స్వామివారి దర్శనంతో పాటు లడ్డు ప్రసాదం కౌంటర్ నిత్య అన్నదాన ప్రసాద క్యూలైన్ కూడా భక్తులతో నిండిపోగా రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులందరికీ స్వామి వారి తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదా అవకాశాన్ని కల్పించేందుకు అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేశారు. అధ్యనోచోలో భాగంగా సోమవారం తాత గుడి సెంటర్లోని గోవిందరాజు స్వామి ఆలయం వద్ద సీతారామ లక్ష్మణులకు ఆలయ అధికారులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను మాడవీధులలో ఊరేగించిన ఆలయ అర్చకులు మేల తాళాలు మహిళా కోలాటాల ముత్యాల మధ్య ఊరేగింపుగా గోవిందరాజు స్వామి ఆలయానికి తీసుకువచ్చి రాపత్తు సేవను నిర్వహించారు. ఇదిలా ఉండగా వైకుంఠ ఉత్తర ద్వార దర్శనానికి విక్రయించిన టిక్కెట్ల ద్వారా 34, 77,750 ఆదాయం సమకూరగా గత సంవత్సరం వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి కేవలం 28,79,750 రూపాయలు మాత్రమే వచ్చాయని గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం భారీగా ఆదాయం పెరిగిందని ఆల ఈవో రమాదేవి తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా అధ్యయనోత్సవాలను ప్రచారం చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించి చిత్రకోట మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆత్మీయ సత్కారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్.రమాదేవి మాట్లాడుతూ... అధ్యయనోత్సవాలను విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించి దేశ నలుమూలల తెలిసే విధంగా మీడియా సిబ్బంది కృషి చేశారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్



నవతెలంగాణ-ఇల్లందు

మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ హరి సింగ్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మకర సంక్రాంతి పర్వదిన సందర్భంగా ప్రతి కుటుంబ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆరుకాలం రైతులు కష్టించి శ్రమించిన ధాన్యం ఇంటికి చేరడంతో సంక్రాంతి పండుగ మొదలవుతుందని, భోగభాగ్యాలు తెచ్చే భోగితో ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని, సకల సుఖాలు ఆయురారోగ్యాలు ప్రసాదించే సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, ప్రజలందరి జీవితాల్లోకి నూతన కాంతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఐఏఎస్ @ కవి..!

- రాహుల్ నోట 'భద్రాద్రి ప్రశస్తి'
- కవిత రూపంలో జిల్లా ఖ్యాతి వర్ణన..!
- ఏరు ఉత్సవాల్లో ఆకట్టుకున్న పీఓ కవితా సంకలనం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అపర విజ్ఞానవంతులే ఐఏఎస్‌లు అవుతారన్నది అక్షర సత్యం. ఈ ఐఏఎస్ ఉన్నత ఆఫీసరే కాదు స్వయంగా కవిగా కూడా మారారు. తెలుగులో ఎంచక్కా కవితలు సంధిస్తూ వీక్షితులను ఆకట్టుకుంటున్నారు. ఆయనే భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ యువ ఐఏఎస్ ఆఫీసర్ పీఓ బి.రాహుల్. భద్రాచలం ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఓవైపు గిరిజన ప్రగతికి పెద్దపీట వేస్తూ మరోవైపు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ తనదైన శైలిలో ప్రత్యేక మార్క్ చూపిస్తున్నారు. ఈ ఐఏఎస్ ఆఫీసర్. గిరి బిడ్డల తెలుగు ప్రజ్ఞకు పదును పెడుతుండటంతో పాటు గిరిజన ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజన మ్యూజియమును అంద చందంగా తీర్చిదిద్దటంలో కీలక భూమిక పోషించారు. అంతేకాదు ఇటీవల భద్రాచలంలో జరిగిన ముక్కోటి ఏరు ఉత్సవాల సమయంలో 'భద్రాద్రి ప్రశస్తి' కవిత రూపంలో వివరించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. ఈ కవితలో జిల్లాకు సంబంధించిన అనేక ముఖ్యమైన వాటి గురించి గొప్పగా పేర్కొనడం జరిగింది. జిల్లాకు వాటితో ఉన్న పెనుబంధం గురించి అద్భుత వర్ణన చేశారు. తన తల్లిదండ్రులు స్వయంగా టీచర్లు కావటం తన సహచరి కూడా బోధనావృత్తిలో ఉండటం స్వయంగా పీఓ రాహుల్‌కు కూడా తెలుగుపై ప్రత్యేక పట్టు ఉండటం గమనార్హం. భద్రాచలం ఐటీడీఏ పీఓగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ అన్ని రంగాల్లో తనదైన శైలిలో ముద్ర వేస్తూ గిరి ప్రగతికి పాటుపడుతున్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

- భారీగా పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-చర్ల

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఐద్వా మండలం శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు విజయ కాలనీలో సోమవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఐద్వా మండల కన్వీనర్ పొడుపు కంటి సమ్మక్క నేతృత్వంలో జరిగిన ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి కూసుమంచి రమాదేవి, రెండవ బహుమతి పూణే అనిత, మూడవ బహుమతి విద్యా గెలుపొందారు. విజేతలను జ్ఞాపికలతో నిర్వాహకులు సత్కరించారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు బాలాజీ ముఖ్యఅతిథులకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు వరదల వరలక్ష్మి, వూడుగుల షారోని, గ్రామ పెద్దలు కూసుమంచి వెంకటేశ్వర్లు, ఆదెమ్మ, సోడి నాగమణి, సూరమ్మ, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పామారు సంగీత, శివరంజని వ్యవహరించారు.

ప్రజల జీవితాల్లో సంక్రాంతి శోభ

- మున్సిపల్ చైర్మెన్ డీవీ



నవతెలంగాణ-ఇల్లందు

మకర సంక్రాంతి ప్రజల జీవితాల్లో సంక్రాంతి శోభ తేవడం సంతోషకరమని మున్సిపల్ చైర్మెన్ డీవీ అన్నారు. మున్సిపాలిటీ ప్రజలందరికీ మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటేనే ప్రత్యేక కళ. ఇంటికి చేరిన కొత్త ధాన్య రాశులతో పల్లెలు కలకలాడుతుంటాయి. కుటుంబ సభ్యులంతా సంతోషంగా ఉండే సమయంలో ఈ పండుగ వస్తుందన్నారు. ఉమ్మడి కుటుంబాలు, స్నేహితులతో కలిసి ఎన్నో రకాల ప్రత్యేక రుచులతో విందార గిస్తూ సంతోషాలను పంచుకునే పండుగన్నారు.

యువత కేసులలో ఉంటే వారి భవిష్యత్తు అంధకారమే

- జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలి
- ఎస్ఐ రాజ్ కుమార్



నవతెలంగాణ-పినపాక

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఏడూళ్ళ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు. ముందుగా మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోడిపందాలను ఉద్దేశించి మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా కోడిపందాలు ఆడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, పందెపు రాయుళ్లను ప్రత్యేకమైన ఫోర్స్‌తో పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడీ పందేలు, పేకాట, గుండాట ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడి పందేలు, జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి డబ్బును నష్టపోతున్నారన్నారు. దీనివలన వారి కుటుంబాలలో పండగ పూట కుటుంబం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా మండలంలో కోడి పందెలు నిర్వహించినా, పందెలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఇతర దేశాలలో ఉద్యోగాల కోసం వెళ్లే వారికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో, పాస్ పోర్టు పొందే సమయాలలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం

నవతెలంగాణ-కల్లూరు



కల్లూరు పట్టణం శాంతినగర్ కాలనీలో పసుమర్తి చంద్రారావు ఆధ్వర్యంలో జరిగినటువంటి ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి ప్రథమ బహుమతి పసుమర్తి పద్మ జ్ఞాపకర్థం పసుమర్తి చంద్రరావు రూ.2,016లను మాతిపోగు కావేరికి అందజేశారు. ద్వితీయ బహుమతి శాంతి నగర్ ఎస్‌డీఎస్ సభ్యులు రూ.1,016 రావూరి వర్షిత యంగాల హరిక, మూడవ బహుమతి ధాత కనకపూడి సత్యవతి జయరాజు వేల్పుల అనిత రూ.600 అంజేశారు. ఈ కార్యక్రమంలో శాంతి నగర్ కాంగ్రెస్ సభ్యులు మాతిపోగు ముకేశ్, ఖమ్మంపాటి శ్రీనివాసురావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి వీరాస్వామి, కనకపూడి జయరాజు, కంచపోగు ఉపేంద్ర, ఖమ్మంపాటి ప్రశాంత్, మోదుగు సతీష్ గోళ్లమందల శివయ్య, కొత్తపల్లి వీరేంద్ర కుమార్ మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-దమ్మపేట

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో భోగి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు సోమవారం నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ప్రభావతికు రూ.5116లను మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు అందజేశారు. రెండవ బహుమతి విజేత ధన్విక రూ.3116లను దమ్మపేట మాజీ ఉపసర్పంచ్ ద్వారా యుగంధర్ అందజేశారు. మూడవ బహుమతి విజేత నవ్య రూ.2116 దమ్మపేట వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు అందజేశారు. కన్సలేషన్ షన్ బహుమతులు మాడ లక్ష్మీనారాయణ, జంగాల సర్వేశ్వరావు 15 మంది విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి రాంబద్రం దారా ప్రసాదు, వాసవి క్లబ్ అధ్యక్షులు మండవల్లి సురేష్, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం జీఓ కాపీలు దహనం



నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా ఎస్కేయం ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెం జిల్లా బస్టాండ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు, కెచ్చేల రంగారెడ్డి, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. ఎంఎస్‌పీనీ చట్టబద్ధత కల్పించాలని 2021వ సంవత్సరంలో యావత్ భారతదేశం రైతాంగ అంతా ఏకధాటిగా ఢిల్లీ నడిబొడ్డున 13 నెలల సుదీర్ఘ పోరాటం చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వం ఆ రైతంగ పోరాటానికి తలొగ్గి మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటన చేసిందన్నారు. తిరిగి మళ్ళీ మూడు వ్యవసాయ నల్ల చట్టాలను దొడ్డిదారిన వ్యవసాయ మార్కెట్ల జాతీయ విధానం పేరిట తీసుకొస్తున్నదన్నారు. బాహటంగానే సూచనలు అడుగుతుందన్నారు. అందుకనే ఈ విధానాన్ని నిరసిస్తూ ఎస్కేయం పిలుపులో భాగంగా దాని ప్రతులను దహనం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర నాయకులు ముద్దా భిక్షం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అమరలపూడి రాము, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా, అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరు కిషోర్, బుర్రా వెంకన్న, బానోత్ ధర్మా, టియూసీఐ జిల్లా నాయకులు గోపాల్ రావు, రమేష్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు జడ సీతారామయ్య, గౌని నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా గోదా రంగనాథస్వామి కల్యాణం



నవతెలంగాణ-చర్ల

భోగ భాగ్యాల భోగి పండుగ నిర్వహించుకుంటున్న తరుణంలో కనుల పండుగ గోదావరి రంగనథ స్వామి కల్యాణం స్థానిక వెంకటేశ్వర స్వామి, సీతారామ లక్ష్మణ ఆలయాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో ప్రారంభమయ్యే ధనుర్మాస వ్రతం గోదా దేవి రంగనాథస్వామి వారికి నెలరోజులపాటు రోజుకి ఒక పాశురంచప్పున పారాయనంచేసి ఇరవై ఏడవరోజున కూడారై రోజున స్వామి వారికి నూట ఎనిమిది కలిశాలలో ప్రసాదమును నివేదించిన తరువాత భోగి పండుగ రోజు గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణంతో ధనుర్మాసం ముగుస్తుంది. దానిలో భాగంగా సోమవారం చర్ల మండలంలోని పాత చర్లలో ఉన్న శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదట గోదాదేవి విగ్రహమును ఆయిల్ బంక్ ఏరియాలోని ఆర్ఎంపీ డాక్టర్ సుధారాణి వారి ఇంటి వద్ద నుండి మేళతాళాలతో భక్త బృందం ఊరేగింపుగా బయలుదేరారు. అంబెద్కర్ సెంటర్ బస్టాండ్ మీదుగా గాంధీ బొమ్మ సెంటర్లోని శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి దేవాలయంకి చేరుకున్నారు. తరువాత రఘు థియేటర్ సెంటర్లో ఉన్న వరలక్ష్మి వారి ఇంటి వద్ద నుండి రంగనాథ స్వామి వారిని భక్త బృందం మేళతాళాలతో శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి దేవాలయం వద్దకు తీసుకు వచ్చారు. వారిద్దరికీ పూజలు చేసిన అనంతరం వైష్ణవ సాంప్రదాయ ప్రకారం ప్రవర పూజల్లో భాగంగా చేస్తూ గోదా రంగనాథ స్వామి వారి కల్యాణం అత్యంత వైభవముగా నిర్వహించారు. ఈ గోదా రంగనాథ స్వామి కళ్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంలో ప్రత్యేకంగా చేసే ప్రసాదం "కదంబం" ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. గోదార రంగనాథ స్వామి వారి కళ్యాణంకి హాజరైన భక్తులందరూ కళ్యాణాన్ని కన్నులారా తిలకించి భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పిదప కళ్యాణం అనంతరం చేసే మాల మార్పిడి నృత్యంలో భాగంగా భక్తులు అందరూ ఉత్సహజంగా పాల్గొని నృత్యాలు చేసి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం కదంబ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కరుణాకటాక్షాలు పొందారు. ఈ కార్యక్రమం గాంధీ బొమ్మ సెంటర్లోని శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి వారి ఆలయ కమిటీ వారు ఆధ్వర్యంలో భక్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



చంద్రుగొండ చంద్రుగొండ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గోదాదేవి కళ్యాణాన్ని ఆలయ పూజారులు వెంకన్న శాస్త్రి, ఆంజనేయ శాస్త్రి, భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తకంగా వందల మంది భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం కుక్కడపు హరి బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనగండ్ల వెంకటరెడ్డి, ధారా బాబు, మరకాల రవీందర్ రెడ్డి, సంకా కృపాకర్, సంక శంకర్, కుక్కడపు ఉపేందర్, దారా రమేష్, చిలక, రామారావు, వేముల నాగేశ్వరరావు, కుక్కడపు సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ అన్నారు. మండలంలోని ముత్తగూడెం గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బండి పద్మ మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రభాగాన ఉన్నారని తెలిపారు. కళలు, సాహిత్యం, రాజకీయం, క్రీడలు ఇలా అనేక రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని కొనియాడారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ముత్తగూడెం సీపీఐ(ఎం) గ్రామ శాఖను అభినందించారు. అమరజీవి పసుపులేటి పుల్లయ్య 20 సంవత్సరాల క్రితమే ముత్తగూడెం గ్రామంలో ముగ్గుల పోటీలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. పుల్లయ్య, తాటి వెంకటేశ్వర్లు వారసత్వాన్ని కొనసాగిస్తూ ముత్తగూడెం గ్రామంలో సీపీఐ(ఎం)కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 250 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి, నంద్ర ప్రసాద్, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏటుకూరి పద్మ, పెండ్యాల సుమతి, నాయకులు ఏ.ప్రసాద్ రావు, ఉన్నం సంగయ్య, చామకూరి రవి, చిన్న రాములు, గుదే మల్లయ్య, వెంకన్న, యాదగిరి, నాగయ్య, వెంకటేశ్వర్లు, రవి, వెంకన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పులి పంజా కంటే పవర్ఫుల్...చలి పంజా

- చలికాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అవసరం
- సొంత వైద్యం ప్రమాదకరమే



నవతెలంగాణ-పినపాక

చలికాలం పగటి సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతాయి. చలి తీవ్రత పెరగడంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అనేక సవాళ్ళు ఎదురవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పడిపోతున్నాయి. ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య మంచు విపరీతంగా కురుస్తోంది. ఆ సమయంలో ఉదయం నడక సాగించేవారు, పాలు, పత్రికలు సరఫరా చేసేవారు, కూరగాయల రవాణా చేసేవార వీరంతా చలికాలంలో నిర్దేశించిన జాగ్రత్తలు తీసుకోకుంటే ఆ ప్రభావం ఆరోగ్యంపై పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మంచు కురిసే సమయంలో రోడ్లపై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా అప్రమత్తతతో ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

కండరాల నొప్పులకు కారణం చలేనా

చల్లని వాతావరణంలో గాలి నాణ్యత తక్కువగా ఉండటంతో వాయువులు కలుషితమవుతుంటాయి. దీంతో అలెర్జిక్ బ్రాంకైటీస్, దగ్గు, ఊపిరితిత్తులతో పాటు గుండె సమస్యలకు ఆస్కారం వచ్చే అవకాశం ఉంటుంది. కండరాల నొప్పులు, చెవి సమస్యలు కూడా కనిపిస్తూ ఉంటాయి. చర్మం పొడిబారుతూ వివిధ రుగ్మతలకు దారి తీసే అవకాశం ఉంటుంది. కావున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు.

ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో చాలా మంది గుండె, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, ఇతర వ్యాధిగ్రస్తులు చలిగాలికి దూరంగా ఉండటమే మంచిదని సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లే సమయంలో బాగా చలివేస్తుంది. అలాంటప్పుడు స్కార్ఫ్, జర్కిన్, తలకు హెల్మెట్, మంకీక్యాప్స్, కాళ్లకు షూస్, చేతులకు గౌజులు వేసుకోవాలి.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యమే

ఈ చలికాలంలో వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల శుభ్రత చాలా ముఖ్యం. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, విషజ్వరాలు బారిన ప్రమాదం ఉంది. తాగునీటి విషయంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి లేకపోతే కలుషిత నీరు తాగితే డయేరియా వ్యాపించే ప్రమాదకరంగా పరిగణించే అవకాశం ఉంది. గాలి ద్వారా స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయి.

రోగనిరోధక శక్తి పెంచే ఆహారం తీసుకోవాలి

పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ దుర్గాభవాని



ఈ సమయంలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఎక్కువగా జబ్బుల బారినపడే అవకాశం ఉంటుంది. కాబట్టి పౌష్టికాహారం, రోగనిరోధక శక్తి పెంచే ఫుడ్ తీసుకోవాలి. చలికాలంలో ప్రతి ఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా చిన్నారులు, వద్దులు, అస్తమా రోగులు, చల్లగాలిలో, మంచుపట్టిన సమయంలో బయట తిరగడం మంచిదికాదు. ముఖ్యంగా చలికాలంలో ఏసీలు, ప్యాన్లు, కూలర్లు వాడకం తగ్గించాలి. చర్మంపై అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో బయట తిరగడంతో జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాధులు సోకితే ఆరోగ్యం పాడవుతుంది. వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యులను సంప్రదించి పరీక్షలు చేసుకోవాలి. చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో ఉపశమనం కోసం సొంత వైద్యం మానుకోవాలి.

కోడి పందాలు స్థావరాలు పసిగట్టేందుకు డ్రోన్ కెమెరాలు

- కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- పోలీస్ శాఖ

నవతెలంగాణ-అశ్వారావుపేట



కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బీ.రోహిత్ రాజు హెచ్చరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందాలను నివారించే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దులో అశ్వారావుపేట సర్కిల్ పోలీసు బృందాలు రెండు డ్రోన్ కెమెరాలు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోడి పందేలను నియంత్రించేందుకు మండల, గ్రామస్థాయిలో టీమ్‌లను ఏర్పాటు చేసి నిలువరించేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల పరిధిలో కోడిపందేలు, జూదం జరుగుతున్నాయని సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని అన్నారు. అదేవిధంగా కోడిపందేలు,జూదం నిర్వహణకు వ్యవసాయ క్షేత్రాలు,మైదానం భూములు, గెస్ట్ హౌస్ లు ఇచ్చి ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించామని అన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా కోడి పందాలు, బెట్టింగ్, పేకాట శిబిరాలు పై దాడులు చేసి కేసులు నమోదు చేయాలన్నారు.గత సంవత్సరంలో కోడిపందేలు నిర్వహించిన వారిని, కత్తులు కట్టే వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కోడిపందాల నిర్వహణ నిషేధంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఓ యువకుడు అదృశ్యమయిన సంఘటనపై ఖమ్మంరూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదు అయింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలో పోలేపల్లి పంచాయతీ రాజీవ్‌గృహ కల్ప కాలనీలో నివాసం ఉంటున్న పందెపు హనుమంతరావు, మమత దంపతులకు జ్ఞానసాయి, సంజయ్ కుమార్ అనే ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు జ్ఞానసాయి ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు సంజయ్ కుమార్ బీటెక్ పూర్తి చేసి కోచింగ్ తీసుకుంటూ ఇద్దరూ అన్నదమ్ములు హైదరాబాద్‌లో ఉంటున్నారు. సంక్రాంతి పండుగ కోసం సంజయ్ కుమార్ ఆదివారం సాయంత్రం రాజీవ్ గృహకల్పలోని తమ ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి జ్ఞానసాయి కూడా హైదరాబాద్ నుంచి వస్తున్న తనను తీసుకెళ్లడానికి ఖమ్మం కొత్త బస్టాండ్ వద్దకు రావాలని తన సోదరుడు సంజయ్ కుమార్‌కు ఫోన్ చేసి చెప్పాడు. రాత్రి 1.30 గంటల (తెల్లవారితే సోమవారం) సమయంలో తన సోదరుడుని తీసుకొచ్చేందుకు సంజయ్ కుమార్ ద్విచక్రవాహనంపై ఖమ్మంలోని కొత్త బస్టాండ్‌కు బయలుదేరాడు. తాను ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన కొద్దిసేపటికే తన ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది అని సంజయ్ కుమార్ తన సోదరుడు జ్ఞానసాయికి ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పెట్టాడు. తరువాత మరలా కొద్ది సేపటికి సాగర్ కాల్వకట్ట వద్ద ఆటోలో ఓ అమ్మాయిని చంపేశారు. ఆ ఆటోలో నలుగురు వ్యక్తులు ఉన్నారు. తనను కూడా చంపేస్తున్నారని సోదరుడు జ్ఞానసాయికి సంజయ్ కుమార్ వాయిస్ మెసేజ్ చేశాడు. తరువాత సంజయ్ కుమార్ ఫోన్ స్విచాఫ్ అయింది. వెంటనే విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెళ్లి ఫోన్‌లో లొకేషన్ ఆధారంగా వెళ్లి సాగర్ కాల్వకట్టపై చూడగా అక్కడ ఓ ద్విచక్రవాహనం కన్పించింది. కానీ సమీపంలో ఎవరూ కన్పించలేదు. సంజయ్ కుమార్ సెల్ ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉంది. సంజయ్ కుమార్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సంజయ్ కుమార్ తండ్రి హనుమంతరావు ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముష్కరాజు తెలిపారు.

బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ - బోనకల్



మండలంలో బిజెపి అభివృద్ధికి ప్రతి కార్యకర్త సైనికునిలా పనిచేయాలని బిజెపి మండల అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక కోరారు. మండల కేంద్రంలో బిజెపి మండల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. రానున్న స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ ప్రతి గ్రామంలో సత్తా చాటాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు సురేష్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి జంపాల రవి, పార్టీ సీనియర్ నాయకులు మందపల్లి పాపారావు, గూడ పాండురంగయ్య శాస్త్రి, బీజేవైఎం మండల అధ్యక్షులు కాలసాని పరుశురాం, డివి రామారావు, బోయినపల్లి కృష్ణ, దారెల్లి కిషోర్, డి.సురేష్, తాల్లూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ రైల్వే స్టేషన్ సమీపంలోనే బిబిసి కాల్వ వద్ద 509/16 కిలోమీటర్ దిగువ లైనుపై గుర్తుతెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో సోమవారం మృతి చెందినట్లు ఖమ్మం జీఆర్పిఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు. మృతుని వయసు 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడటం వలన తలకు బలమైన గాయాలు కావటం వల్లే మరణించినట్లు ఆయన తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుర్తించేందుకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నందు భద్రపరిచినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భాస్కర్‌రావు తెలిపారు. మృతదేహం సమాచారం కోసం 8712658589 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.



ఐక్యతకు చిహ్నం సంక్రాంతి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోటీలు

నవతెలంగాణ-కారేపల్లి

సంక్రాంతి పండుగ సందర్భంగా పల్లెలు గ్రామీణ క్రీడలతో సందడిగా మారాయి. కారేపల్లి మండలం ఎర్రబోడులో సోమవారం కుర్సం రాములు స్మారకార్థం అతని కుమారుడు మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ-కృష్ణకుమారి నిర్వహించిన క్రీడలలో మహిళలకు, పురుషులకు, చిన్నారులకు తాడులాగుడు, ముగ్గులు, పాటలు, నృత్య పోటీలను నిర్వహించారు. తాడులాగుడు (ట్యాగ్ ఆఫ్ వార్)లో పోటీల్లో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన క్రీడలను తిలకించటానికి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చి కేరింతలతో సందడి చేశారు. పాటలు, నృత్య పోటీల్లో యువతీ యువకులు తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వజ్జా రామారావు, గ్రామ పెద్దలు బోజెడ్ల గోవిందరావు, పండగ కొండయ్య, దమ్మాలపాటి ప్రభాకర్, కడియాల రాజు, కాటేపల్లి నవీన్, కొండ జ్యోతిబాస్, బోజెడ్ల యాదగిరి, దమ్మాలపాటి కిషన్‌రావు, కనికరపు నాగేశ్వరరావు, నర్సింగ్ రాజేంద్రప్రసాద్, వాంకుడోత్ హట్య, తదితరులు ఉన్నారు.

సామ్యాతండాలో ముగ్గుల పోటీలు

సామ్యతండలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ చైర్మన్ ధరావత్ కళ్యాణ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పండుగ సంస్కృతి, ఆచార వ్యవహారాలను ముగ్గుల రూపంలో తీర్చిదిద్దారు. అనంతరం కారేపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో విజేతలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.



ఐక్యతకు విఘాతం కల్గించే శక్తులను తరిమికొట్టాలి

మాణిక్యారంలో ఐద్వా పోటీలు

నవతెలంగాణ-కారేపల్లి

ఐక్యతకు విఘాతం కల్గించే శక్తులను తరిమికొట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, మండల కార్యదర్శి కొండెబోయిన ఉమావతి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనాయణ, కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం కారేపల్లి మండలం మాణిక్యారంలో ఐద్వా ఆధ్వర్యంలో అమరజీవి రేపాకుల లాలయ్య స్మారకార్థం ముగ్గులు, పాటలు, నృత్య పోటీలను నిర్వహించారు. లాలయ్య చిత్రపటానికి నాయకులు నివాళ్లు అర్పించి, ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పల్లెలో ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుందన్నారు. కులమత తారతమ్య భేదాలు లేకుండా కలిసి కట్టుగా సంబురాలు జరుపుకోవటం అభినందించదగిన విషయమని కొనియాడారు. ఇదే ఐక్యతను గ్రామస్తులు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు మేకల వీరయ్య, రేపాకుల వీరభద్రం, పోతర్ల నాగేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో ఐద్వా 'సంక్రాంతి' ముగ్గుల పోటీ సంబురం

- విజేతలతో పాటు పాల్గొన్న వారికి బహుమతులు అందజేత
- ఇలాంటి కార్యక్రమాలు మహిళా ఐక్యతకు దోహదపడతాయి
- ఐద్వా రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి

నవతెలంగాణ-సత్తుపల్లి



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కాకర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీని నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో గ్రామానికి చెందిన 70మంది మహిళలు పాల్గొన్నారు. ఫస్ట్ ప్రైజ్ నగదు పారితోషికం రూ.3,116 పి.హారిక గెల్చుకోగా సెకండ్ ప్రైజ్ ఎస్.రేఖ రూ.2,116, థర్డ్ ప్రైజ్ రూ.1,116 జి.ధనలక్ష్మి దక్కించుకున్నారు. ప్రత్యేక బహుమతికి ఎంపికైన శిరీషకు రూ.600 విలువగల చీరెను నిర్వాహకులు బహుకరించారు. విజేతలతో పాటుగా ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించారు. ముగ్గుల పోటీకి న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయిని లక్ష్మి, గ్రామ ఉపసర్పంచ్ పువ్వాళ్ల మమత, నిర్మల వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మహిళల మధ్య పరిచయాలు ఏర్పడటమే గాక మహిళా ఐక్యతకు దోహదపడతాయన్నారు. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం సత్తుపల్లి కస్తూరిరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చావా సత్యప్రసాద్, డాక్టర్ కొప్పుల తులసి చేతుల మీదుగా నిర్వాహకులు జరిపించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, ఐద్వా మండల కమిటీ సభ్యులు వేపులపాటి పుష్పావతి, బండి సత్యవతి, అంగోతు చిట్టెమ్మ, లక్ష్మి, రేఖ, వెన్నెల, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా నాయకులు రావుల రాజబాబు, వేపులపాటి కుమారస్వామి, బండి వేలాద్రి పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఐద్వా ముగ్గుల పోటీ నిర్వహణ

దాతలు అందించిన సహకారంతో ఐద్వా ముగ్గుల పోటీని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు కస్తూరీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చావా సత్యప్రసాద్, డాక్టర్ కొప్పుల తులసి, వేదాన్స్ చెవి, ముక్కు, గొంతు, దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ ఎస్.ఉదయ్‌కిరణ్, డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, పువ్వాళ్ల సంపూర్ణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు ప్రసాద్, ఉమ కార్యక్రమ నిర్వహణకు ఐద్వాకు ఆర్థిక చేయూతను అందించారు.

దాతల సహాయం మరువలేనిది

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నందు 1993వ సంవత్సరం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి పూర్వ విద్యార్థి కొత్తపల్లి సుధీర్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న రామన్నపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ లాయర్ గోగిరెడ్డి కృష్ణారెడ్డి, టీవీ శివారెడ్డి, సిహెచ్ వీరయ్య, రామారావు 65 వేలు రూపాయలను సుధీర్ పిల్లలు ఉన్నత చదువుల కోసం నగదు అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్టీ ఆర్ జిల్లా తిరువూరు కోర్టులో పనిచేస్తున్న ప్రముఖ లాయర్ గోగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకొని చేయూతను అందించడం విశేషమని భార్య నాగలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.



సీపీఐ(ఎం) నేత, సొసైటీ మాజీ చైర్మన్ సామ్యానాయక్ మృతి

సిద్ధాంతానికి కట్టుబడిన సామ్యానాయక్

ఆయన పేరుతోనే సామ్యాతండా

నవతెలంగాణ-కారేపల్లి



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాణిక్యారం సొసైటీ మాజీ చైర్మన్ వాంకుడోత్ సామ్యానాయక్(90) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సామ్యానాయక్ పరిస్థితి విషమించి మృతి చెందారు. సామ్యానాయక్ మాణిక్యారం సొసైటీ చైర్మన్‌గా 1995, 2000వ సంవత్సరాలలో రెండుసార్లు, 2000 సంవత్సరంలో డీసీఎంఎస్ డైరక్టర్‌గా సీపీఐ(ఎం) తరుపున ఎన్నికై నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచారు. చదువు లేక పోయినా సొసైటీ పాలనపై పట్టు సాధించి రైతులకు సొసైటీ ద్వారా వివిధ రకాల రుణాలు అందేలా చేశారు. సామ్యానాయక్ నీతి నిజాయితీతో గ్రామాన్ని అంతా ఏకతాటికి తీసుకవచ్చే వారు. దీంతో ఆయన నివసిస్తున్న గ్రామాన్ని ఆయన పేరునే సామ్యాతండాగా మారింది. ప్రభుత్వ రికార్డులలోనే సామ్యాతండాగా అయి త్వరలో గ్రామపంచాయతీగా మారనుంది. అమరజీవి ఏలూరి లక్ష్మినారాయణ స్ఫూర్తితో భాగ్యనగర్‌తండా, ఉసిరికాయలపల్లి ప్రాంతంలో భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటాలు, పోడు పోరాటాలకు నాయకత్వం వహించి పోరాట పటిమను చాటారు. సామ్యానాయక్‌కు భార్య ఈరి, ఐదుగురు కుమారులు వాంకుడోత్ తులిశ్యా, వాంకుడోత్ సక్రు, వాంకుడోత్ పీక్లా, వాంకుడోత్ కృష్ణ, వాంకుడోత్ రాము, వాంకుడోత్ శంకర్, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. సామ్యానాయక్ తుది శ్వాస వరకు సీపీఐ(ఎం) సిద్ధాంతాన్ని కట్టుబడి కరుడుకట్టిన నేతగా మిగిలారు. సామ్యానాయక్ మృతికి సొసైటీ డైరక్టర్ కొత్తూరి రామారావు, బానోత్ హీరాలాల్, సీపీ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, వజ్జా రామారావు, దమ్మాలపాటి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ గాంధీ, గుగులోత్ హర్షనాయక్‌లు నివాళ్లు అర్పించారు. సామ్యానాయక్ వ్యక్తిత్వాన్ని నాయకులు కొనియాడారు.

నూతన 'నయారా' బంకును ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-బోనకల్





మండల పరిధిలోనే బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో గల నూతనంగా ఏర్పాటు చేసిన నయారా పెట్రోల్ బంకును తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం ప్రారంభించారు. మధిర మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పరుచూరి హరినాథ్ బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో నయారా నూతన పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. ఈ బంకును సంక్రాంతి పండుగ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం చేశారు. మొదటి పంపను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. రెండవ పంపును తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం ప్రారంభించారు. బంకు కార్యాలయాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బంకు యజమాని పరుచూరి హరినాథ్ పెట్రోల్ బంక్ ప్రాముఖ్యతను మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ బోనకల్లు మండలంలో ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా మధిర రూటులో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. మధిర రూటులో గల బోనకల్ మండల పరిధిలో గల గ్రామాల రైతులకు, ప్రజలకు మండల కేంద్రానికి వెళ్లకుండా వాళ్లకి దగ్గరలోనే పెట్రోల్ బంకు ఏర్పాటు చేయటం వలన ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చావా రామకృష్ణ, టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మధిర, బోనకల్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, కలకోట సొసైటీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, భుక్య బద్రు నాయక్, మారుపల్లి ప్రేమ్ కుమార్, ఎర్రంశెట్టి సుబ్బారావు, గూడ నరసయ్య శాస్త్రి, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పల్లెలన్నీ సుందరవనం

- నేరడ సీసీ రోడ్ల శంకుస్థాపనలో అంబటి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-చింతకాని



కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పల్లెలన్నీ సీసీ రోడ్లతో తీర్చిదిద్ది సుందరవదనంగా తయారవుతున్నాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలో నేరడ గ్రామంలో పార్టీ గ్రామ అధ్యక్షులు మంకిన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సిసి రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాలన్నీ సిసి రోడ్లతో కలకలాడుతున్నాయని అన్నారు. పల్లెల్లో ప్రజలు ఎక్కడ కూడా కాలుకు మట్టి అంటకుండా పల్లెటూరు వాతావరణం నుంచి పట్టణ వాతావరణం వరకు ఎదిగినట్టు పల్లెలు కనిపిస్తున్నాయని, అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, పందిళ్ళపల్లి ఎంపీటీసీ ఓర్సు వీరభద్రం, వంగూరి రమేష్, గ్రామ ఉప సర్పంచ్ దూసరి గోపాల్‌రావు, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, ఆలస్యం వెంకయ్య నున్న నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

'మరణించిన వారి కుటుంబానికి ఆపన్న హస్తం'

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

స్థానిక 46వ డివిజన్ నివాసి చిందం సైదులు కుమార్తె అవివాహితురాలు చిందం దివ్యశ్రీ ఆకస్మిక మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోమవారం పండుగ పూట ఆనందంగా ఉండవలసిన ఆ కుటుంబంలో అలుముకున్న విషాద ఛాయలతో 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రామారావు బాధాతత్వంతో దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి దహన సంస్కరణ నిమిత్తం 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా ఉంటానని తెలియజేసి వారి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 46 డివిజన్ నాయకులు కాటం కొమరయ్య, దేవర వెంకన్న, మోటే కుమార్, చిన్న మల్లేశం, మాలిగా గిరిశంకర్, దయ్యాల రామా మల్లేశం, గోరిగ నాగులు, జేట్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

2023 కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలను అమలు చేయాలి : రేషన్ డీలర్లు

నవతెలంగాణ-బోనకల్

2023లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినత పత్రం అందజేశారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో నయారా పెట్రోల్ బంకును ఏర్పాటు చేయటానికి వచ్చిన మల్లు భట్టి విక్రమార్కను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎంకు వారు వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రెటరీ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా ప్రెసిడెంట్ సుంకర రామారావు, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు బంధం అచ్చయ్య, రావినూతల డీలర్ కోల కొండల రావు, బోనకల్ రేషన్ డీలర్ మోర్ల అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్రాంతి సందడి మొదలాయే

నవతెలంగాణ-తల్లాడ



తెలుగు ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ, మూడు రోజులపాటు జరిగే సంబరాలతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం వెల్లి విరిస్తోంది. 13న భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుమ పండుగలను జరుపుకునేందుకు మండల ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే బంధువులు, దూరప్రాంతాల కుటుంబ సభ్యుల రాకతో ఇళ్లల్లో సందడి నెలకొంది. ప్రభుత్వ ప్రైవేటు విద్యాలయాలు ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు సెలవులు ఇవ్వడంతో దూర ప్రాంతాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న యువత ఇళ్లకు చేరుకుంటున్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడుపుతున్నారు. పండుగ ప్రత్యేక పిండి వంటలు తయారీ ఒకటి రెండు రోజులు ముందుగానే పూర్తి చేసుకున్నారు. గంగిరెద్దులు, హరిదాసుల సందడి గ్రామాలలో కనిపిస్తుంది. గత రెండు రోజులుగా బస్టాండ్‌లన్నీ రద్దీగా మారాయి, సీజన్‌లో వరి పంట దిగుబడి ఊహించిన దాని కంటే ఎక్కువగా వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన బోనస్‌తో రైతులు ఆనందోత్సవాలతో పండుగను నిర్వహిస్తున్నారు.



ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హనుమంతరావు



చైర్మన్ హనుమంతరావు



వైస్‌చైర్మన్ తల్లాడ రమేష్

- వైస్ చైర్మన్‌గా తల్లాడ రమేష్
- 18 మందితో కమిటీ ఎంపిక
- రెండేళ్ల కాలపరిమితితో నియామకం

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఖమ్మం మార్కెట్ కమిటీని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు మార్కెట్ కమిటీలను దాదాపు నాలుగు నెలల క్రితం ప్రకటించినా ఖమ్మం మార్కెట్ పాలకవర్గాన్ని ఎంపిక చేయడంలో ఆలస్యమైంది. ఎట్టకేలకు మార్కెట్ కమిటీని ప్రకటిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

చైర్మన్‌గా హనుమంతరావు..18 మందితో పాలకవర్గం

మొత్తం 18 మందితో కూడిన కమిటీని ఎంపిక చేశారు. బీసీ జనరల్‌కు రిజర్వ్ అయిన మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాన్ని రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంకి చెందిన యరగర్ల హనుమంతరావు దక్కించుకున్నారు. వైస్ చైర్మన్ గా తల్లాడ రమేష్ ను నియమించారు. సభ్యులుగా బానోతు రమేష్, రెంటాల ప్రసాద్, వడ్లమూడి సాయిలాజ్, వెనిగళ్ల బాబురావు, షేక్ లతీఫ్, తమ్మిని నాగేశ్వరరావు, అనగండ్ల నరసింహారావు, చెరుకూరి సీతారాములు, అంగోతు చిట్టిబాబు, బానోతు భీమానాయక్, మొర్రిమేకల నాగేశ్వరరావు, బోజేడ్ల సత్యనారాయణ, వీ వెంకటాయపాలెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి సైదుబాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్ అలీం, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ ఎంపికయ్యారు. రెండేళ్ల పాటు ఈ కమిటీ కొనసాగనుంది. ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్గ గా ఎన్నికైన వారు రాజకీయంగా ప్రాబల్యం కోల్పోతున్న దృష్ట్యా పలువురు ఈ పదవిపై అనాసక్తి ప్రదర్శించినట్లు చర్చ సాగుతోంది.



మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఖమ్మం

మహబూబాబాద్‌లో జరిగే మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమవారం ఖమ్మంలోని వివిధ ప్యాకేజీల వద్ద మున్సిపల్ మహాసభ జయప్రదం కోసం పోస్టర్, కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.రామయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేషన్‌లో వివిధ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల అమలు చేయాలన్నారు. చలికి, ఎండకు, వానకు పట్టణాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు లేక కాంట్రాక్టర్ల దయాదక్షిణాలపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు సకాలంలో జీతాలు కూడా రావటం లేదని, గత పాలకులు మేడే కానుకను ప్రకటిస్తే తెలంగాణలో ఇప్పటికి కొన్ని మున్సిపాలిటీలలో మేడే కానుక ఇవ్వకుండా ఏరియర్స్ కూడా ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని, తదితర విషయాలు చర్చించడం కోసం ఈ నెల 19న మహబూబాబాద్‌లో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్(టియుసిఐ అనుబంధం) రాష్ట్ర రెండవ మహాసభలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని, అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ ఉద్యోగాలతో పాటు జీతాలు ఇస్తామని వారు కూడా సమన హక్కులు కల్పిస్తామని చెప్పిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్మికులకు ఖమ్మం నగరంలో ఈఎస్ఐ హాస్పటల్ ఏర్పాటు కోసం ఎంపీ, మంత్రులు చర్యలు తీసుకోవాలని ప్రజల ఆరోగ్యాలు కాపాడే మున్సిపల్ కార్మికులకు వారి ఆరోగ్యాలను కాపాడుకునేందుకు ఈఎస్ఐ హాస్పటల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలో కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులు ఈ రెండో మహాసభకు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, కే.శ్రీనివాస్, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్ యూనియన్ అధ్యక్షులు దున్న గురవయ్య, యుగంధర్, ధర్మయ్య, బాబురావు, వీరబాబు, శ్రీను, సరస్వతి, రమ, సుభద్ర, శంకర్, జానీ, లాబిన్, వెంకన్న కాంతయ్య సుధాకర్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బంజర గ్రామంలో జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా కిండ్లీ రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యువతకు వక్తృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు అలంకరించి యువతకు మిఠాయిలు పంపిణీ చేశారు. స్వామి వివేకానందని జన్మదినోత్సవాన్ని జాతీయ యువజన దినోత్సవంగా పేర్కొనవటం గొప్ప విశేషమని సొసైటీ అధ్యక్షురాలు వి.అనుష పేర్కొన్నారు. యువతి, యువకులు సరైన మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. నేటి యువత చిన్న కారణాలకే పెద్ద నిర్ణయాలు తీసుకొని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువత చెడు అలవాట్లకులోను కాకుండా ఉన్నత శిఖరాల వైపు వెళ్లేందుకు జ్ఞానాన్ని సంపాధించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సత్యనారాయణ కన కవెల్లి, పుల్లారెడ్డి, బెజ్జం రమేష్, నాగరాజు, కృష్ణారెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలో బోగి సందడి

నవతెలంగాణ-కారేపల్లి

పల్లెలో సంక్రాంతి భోగి పండుగను సోమవారం సందడిగా జరుపుకున్నారు. వీధుల్లో బోగి మంటలను వేసి వాటి చుట్టు తిరుగుతూ ఆట, పాటలతో చిన్నపెద్ద తేడా లేకుండా కేరింతలు కొట్టారు. తెల్లవారుజామునే నిద్రలేచి ఇంటి వాకిళ్లలో కలాపి చల్లి రంగవల్లికలతో తీర్చిద్దిదారు. ముగ్గుల మధ్యలో తీరొక్క పూవ్వులు, కాయలు, ఆకులు, రేగు పండ్లులతో కలిపి గొబ్బెమ్మలను ఉంచారు. ఇంటిల్లాది రేగుపండ్లతో తలస్నానాలు ఆచరించారు. ధనిక పేద తారతమ్యం లేకుండా పల్లెలోన్ని ప్రతి ఇంటిలో అరెసెలు, సకినాలు, జంతికలు వంటి తినుబండారులు సమిష్టిగా చేసుకోవటం అనవాయితీ. దూరపు ప్రాంతాల్లో ఉన్న పల్లె వాసులు ఒకదగ్గరుకు చేరటంతో పల్లెల్లో పండుగ సందడి నెలకొంది.

ఇన్నర్ రింగ్ రోడ్డును నిరసిస్తూ.. పొలాల్లో సంక్రాంతి పండుగ

- ఆరేపల్లిలో వినూత్న నిరసన



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణాన్ని, కొత్త మాస్టర్ ప్లాన్‌ను వ్యతిరేకిస్తూ హన్మకొండ జిల్లా హన్మకొండ మండలం ఆరేపల్లి గ్రామ రైతులు సోమవారం పొలాల్లోనే సంక్రాంతి పండుగ జరుపుకొని వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరేపల్లి గ్రామ శివారులో ఎస్ఎస్ఆర్ ఆసుపత్రి వద్ద నుండి ఇన్నర్ రింగ్ రోడ్డుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) మార్కింగ్ చేసింది. గతంలో అధికార పార్టీతోపాటు ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన కీలక నేత, ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీలో వున్న నేతకు ఈ ప్రాంతంలో భూములున్నాయి. ఈ నేతకు చెందిన వ్యాపార, విద్యాసంస్థలు, నిర్మాణంలో వున్న విల్లాలున్నాయి. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన మాస్టర్‌ప్లాన్‌లో వారు భూములు కోల్పోతున్నందున ఏకంగా మాస్టర్ ప్లాన్‌ను మార్చేశారు. అశాస్త్రీయంగా రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌తో ఎక్కువ నష్టం వాటిల్లనుందని నిపుణులు హెచ్చరిస్తున్నా అధికారులు, నేతల ఒత్తిళ్లతో కొత్త మాస్టర్ ప్లాన్ వైపే మొగ్గు చూపుతున్నారు. ముందున్న మాస్టర్ ప్లాన్ కాకుండా కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తే మేం భూములు కోల్పోతున్నామంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా అధికారులకు మొర పెట్టుకుంటున్న వినడం లేదని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసి అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ తీరుతో నిరసన వ్యక్తం చేయడంలో భాగంగానే ఆరేపల్లి రైతులు పంట పొలాల్లో పండుగను జరుపుకుంటున్నారు. జీవనాధారంగా వున్న మా పంటపొలాలను లాక్కుంటే మేం రోడ్డున పడుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షలు చేస్తాం

- బిల్ట్ పునరుద్ధరణ పనులను అడ్డుకుంటాం : బిల్ట్ కార్మికులు



నవతెలంగాణ-మంగపేట

దశాబ్దాల కాలంపాటు బిల్ట్ ఫ్యాక్టరీలో పని చేసిన తమ సమస్యలను పరిష్కరించకుంటే బిల్ట్ ప్రధాన గేటు ముందు నిరాహార దీక్షలు చేస్తామని బిల్ట్ కార్మికులు హెచ్చరించారు. సోమవారం ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెలలో బిల్ట్ పరిశ్రమ స్థానంలో నూతన పరిశ్రమను నిర్మించాలని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ముందుగా కార్మికులకు రావాల్సిన జీతాలు, గ్రాడ్యువిటిని బిల్ట్ యాజమాన్యం నుంచి ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించకుండా మరో పరిశ్రమను నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తే ప్రాణాలను పోగొట్టుకోవడానికైనా సిద్ధపడి పరిశ్రమ నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ రాజకీయంగా తమను వాడుకుని.. ఇప్పుడు ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనేకార్మికులకు జరిగిన అన్యాయంపై బిల్ట్ యాజమాన్యాన్ని, జేఏసీ నాయకులను పిలిచి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో బత్తుల వెంకటనారాయణ, గుల్లగట్టు విజయరావు, గూడ యాదగిరి, పంజాల సత్యనారాయణ, ముత్తినేని వెంకటేశ్వర్లు, గాజర్ల శ్రీను, తాటికొండ వెంకటేశ్వరరావు, కూస రాంచందర్, అన్నపూర్ణ, పార్వతి, తాడెల దశరదం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథంకు కన్నీటి వీడ్కోలు

- మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల నివాళి



నవతెలంగాణ-చంపాపేట్

నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఊపిరితిత్తుల సమస్యతో నిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం కన్నుమూశారు. సోమవారం హైదరాబాద్‌లోని సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ ధోబీఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు మందా జగన్నాథం భౌతికకాయాన్ని అంతియయాత్ర ద్వారా చంపాపేట్ నుంచి బంధువులు, స్నేహితులు, కళాకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల అశ్రు నయనాల మధ్య శ్మశాన వాటికకు తరలించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీలు మధుయాష్కీ, రాజయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నేత చిత్తరంజన్‌దాస్, తెలంగాణ రాష్ట్ర భారత్ గోర్ బంజారా సేవ సమితి చైర్మెన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ విస్లావత్ జగన్ నాయక్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మీర్‌పేట్ మాజీ ఎంపీటీసీ జోజీ, సీనియర్ నాయకులు పి. డేవిడ్, మాడుగుల అంజయ్య, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ నరేష్ కుమార్, సంతోష్ నగర్ ట్రాఫిక్ సీఐ నరసింహ నాయక్, నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో జగన్నాథం సేవలను గుర్తు చేసుకున్నారు.

మరో చిన్నారికి హెచ్‌ఎంపీవీ పాజిటివ్..

- పుదుచ్చేరి ఆరోగ్య డైరెక్టర్ వెల్లడి

పాండిచ్చేరి : పుదుచ్చేరిలో మరో చిన్నారికి హెచ్‌ఎంపీవీ పాజిటివ్‌గా నిర్ధారణైనట్టు ఉన్నతాధికారి ఒకరు సోమవారం ప్రకటించారు. ప్రస్తుతం ఆ చిన్నారి పుదుచ్చేరిలోని కేంద్ర ప్రభుత్వానికి చెందిన జిప్మర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. దగ్గు, జ్వరం, జలుబుతో బాలిక కొద్ది రోజుల క్రితం జిప్మర్‌లో చేరిందని పుదుచ్చేరి ఆరోగ్య డైరెక్టర్ వి. రవిచంద్రన్ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారి కోలుకుంటుందని, అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు.

గతవారం పుదుచ్చేరిలో మొదటి హెచ్‌ఎంపీవీ కేసు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడేండ్ల చిన్నారికి హెచ్‌ఎంపీవీ వైరస్‌గా నిర్ధారణైంది. శనివారం బాలిక డిశ్చార్జ్ అయిందని పుదుచ్చేరి యంత్రాంగం డైరెక్టర్ వెల్లడించారు. పూర్తి అప్రమత్తతో అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.

'స్థానికం'పై హస్తం ఫోకస్

గ్రామాల్లో పట్టుకు యత్నం

- సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి సీఎం, మంత్రులు, నేతలు
- పథకాల అమలుపై విస్తృత ప్రచారం
- గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్థానిక ఎన్నికలను హస్తం పార్టీ టాస్క్‌గా పెట్టుకుంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను ఎదుర్కొన్న కాంగ్రెస్ స్థానిక సమరానికి సన్నద్ధమవుతున్నది. గ్రామాల్లో బలహీనంగా ఉన్న ఆ పార్టీ ఈసారి పై చేయి సాధించేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రదర్శన పేలవంగా ఉన్నది. ఆ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంతో స్థానికంగా పాగా వేసేందుకు ప్లాన్ చేసింది. సంక్రాంతి పండుగ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల పండుగ ఫిబ్రవరిలో నిర్వహించాలని భావిస్తున్నది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు...సంక్రాంతి తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై క్యాడర్‌కు అవగాహన కల్పించనున్నారు. ఆ తర్వాత కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లనున్నారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తూనే...గ్రామీణాభివృద్ధిపై ఫోకస్ చేయనుంది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీరు, పార్కుల సుందరీకరణ, పాఠశాల అభివృద్ధి, గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం తదితర అంశాలపై దృష్టి సారించనుంది. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని భావిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ పంచాయతీలను గెలుచుకోవాలని చూస్తున్నది. ఇప్పటివరకు జనానికి ఏం చేసిందో చెప్పాలనుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వచ్చిన ఎన్నికల్లో కొంత పట్టు సాధించినా...పూర్తిస్థాయిలో అది లేదు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు ఒక ఎత్తు అయితే ఇప్పుడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పెద్ద సవాల్. అందుకే అత్యధిక పంచాయతీలను గెలుచుకుని అభివృద్ధిపై ఫోకస్ చేయాలని భావిస్తున్నది. రాష్ట్రంలో 12,769 గ్రామాలు, 88వేల వార్డులు, 5857 ఎంపీటీసీలు, 539 జడ్పీటీసీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు 140 ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల కోసం వేచి చూస్తున్నారు. గత పదేండ్ల కాలంలో కాంగ్రెస్ నాయకులు అక్కడక్కడ గెలిచినా...పార్టీ అధికారంలో లేకపోవడం వల్ల బీఆర్ఎస్ అధిపత్యం సాధించింది. ఇప్పుడు పార్టీ అధికారంలోకి రావడంతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది హస్తం గూటికి చేరుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ రాకపోయినా ఇప్పటి నుంచే గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం నెలకొంది.

పట్టణాల్లో బలహీనంగా కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధిక సీట్లను గెలుచుకుంది. హైదరాబాద్ మహానగరంలో మాత్రం ఒక సీటూ గెలువలేదు. అందుకే ప్రభుత్వం మెజార్టీ రైతులను దగ్గరకు చేసుకునేందుకు రైతు భరోసా, రైతు రుణమాఫీ లాంటి పథకాలు తీసుకొచ్చింది. మరోవైపు రైతులు పండించిన పంటలకు బోనస్ ఇచ్చింది. దానితో రైతుల కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన అన్ని పథకాలను జనాల్లోకి తీసుకపోయి ఎక్కువ సీట్లు గెలుచుకునేందుకు అన్ని రకాలుగా ప్లాన్ చేస్తున్నది. గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఉచిత బస్‌పాస్, మహిళ సంఘాలకు రుణాలు...ఇలా గ్రామీణ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న పథకాలను మొదట విడతలో అమలు చేయడం ద్వారా వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. పదేండ్లలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయలేదు. వాటిని ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను పరిశీలిస్తున్నది. రైతు భరోసా పథకం, భూమి లేని రైతు కుటుంబాలకు ప్రభుత్వ సాయం ఇలాంటి పథకాలను కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఇవన్నీ ఒక ఎత్తైతే పార్టీ పెద్దలు కూడా స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో మరోసారి అసెంబ్లీ ఎన్నికల తరహాలో సిద్ధమవుతున్నారు. దానితో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన గ్యారంటీలు, రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ...ఇలా ప్రభుత్వం చేసిన ప్రతి పనిని గ్రామ గ్రామాన తిరుగుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిదులు ప్రచారం చేయాలని సీఎం సూచించారు. ఇప్పటికే అమలు చేసిన పథకాలతోపాటుగా ఈ నెల 26న నుంచి అమలు కానున్న పథకాలనూ ప్రచారం చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తున్నది.

వెక్కిరిస్తున్న కూరగాయల మార్కెట్





నిరుపయోగంగా రైతు బజార్

శిథిలమైపోతున్న సామాగ్రి

మద్యం ప్రియులకు అడ్డాగా..

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్‌లో రైల్వేస్టేషన్ సమీపంలో 2023 జూన్ 30న అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవం చేసిన రైతుబజార్ అందుబాటులోకి రాక నిరుపయోగంగా దర్శనమిస్తోంది. గత ప్రభుత్వం ప్రారంభించినా అందుబాటులోకి తీసుకురాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు. సుమారు 5 నుంచి 10 ఎకరాల్లో నిర్మించిన ఈ మార్కెట్‌కు రూ.6కోట్లకు పైగా ఖర్చు చేశారు. సౌకర్యాలు లేవనే సాకుతో మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావట్లేదని అధికారులు చెబుతున్నారు. మూడుబ్లాకులుగా నిర్మించిన ఈ కూరగాయల మార్కెట్ ప్రస్తుతం మద్యం ప్రియులకు అడ్డాగా, వాహనాల పార్కింగ్‌గా మారిపోయింది.

14వ ఆర్థిక సంఘం మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5కోట్ల 61లక్షల43వేలతో కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. ఐరన్ గ్రిల్ ఏర్పాటుకు అదనంగా మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేశారు. ఒక బ్లాక్‌లో పూర్తిగా మాంసం విక్రయాలు, మరో బ్లాక్‌లో పూర్తిగా కూరగాయల విక్రయాలు, మూడోబ్లాక్‌లో పువ్వులను విక్రమించేందుకు ఏర్పాట్లు చేశారు. మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురాకుండా శిథిలావస్థలోకి చేరేలా చేస్తున్నారని అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. భవనంలో సౌకర్యాలు లేవంటూ వ్యాపారులు రావడం లేదు. ప్రస్తుతం బస్టాండ్ ఏరియాల్లో రోడ్ల పక్కన పూలు, పండ్లు అమ్ముకునే వారు డబ్బాలు పెట్టుకొని బండ్లపై అమ్ముకుంటున్నారు. నూతన కూరగాయల భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళినాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు పలుమార్లు సందర్శించి వినియోగంలోకి తేవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినా అతీగతీ లేదు. కూరగాయల మార్కెట్ వ్యాపారులకు తాత్కాలికంగా గాంధీ పార్క్ స్థలాన్ని కేటాయించారు. వ్యాపారులు ఆ స్థలాన్ని వీడేందుకు అంగీకరించడం లేదని తెలిసింది. దానిని ఖాళీ చేస్తే గాంధీ పార్కును సభలు, సమావేశాలతో పాటు ప్రజా అవసరాలకు ఉపయోగపడుతుందని పలువురు సూచిస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



నూతన కూరగాయల మార్కెట్ భవనాన్ని తక్షణం వినియోగంలోకి తీసుకురావాలి. ప్రజలు, రైతుల ఇబ్బందులను తొలగించాలి. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, స్పందించి అవసరమైన ఏర్పాట్లు చేసి గాంధీపార్క్‌ను ఖాళీ చేయించి నూతన కూరగాయల భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి.

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

జాతీయ పసుపుబోర్డు చైర్మెన్‌గా పల్లె గంగారెడ్డి



హైదరాబాద్: జాతీయ పసుపు బోర్డు చైర్మెన్‌గా పల్లె గంగారెడ్డి నియమితులయ్యారు. మూడేండ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

పసుపు బోర్డు ఏర్పాట్లు పట్ల కోదండరెడ్డి హర్షం

కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డు ఏర్పాటు చేయడం పట్ల వ్యవసాయ, రైతు సంక్షేమం కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పసుపుబోర్డు కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూమి కేటాయించిందని గుర్తు చేశారు. రైతుల పోరాటం ఫలితంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. పసుపు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.

మరిన్ని పెట్టుబడులు తెద్దాం

(మొదటిపేజీ తరువాయి)

నిలబెట్టాయని వ్యాఖ్యానించారు. ఆరు రోజుల పర్యటనలో సింగపూర్‌లో స్కిల్ యానివర్సిటీతో ఒప్పందంతో పాటు ఇతర పెట్టుబడులకు సంబంధించి సంప్రదింపులు చేస్తారు. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

- ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై భోగి మంటలను వెలిగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భోగి అంటేనే ప్రతికూలతను వదిలిపెట్టి నూతన ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి భారీగా మహిళలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా కవిత రాష్ట్ర ప్రజలకు భోగీ, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి శుభాకాంక్షలు : టీయూడబ్ల్యూజేఎఫ్

రాష్ట్ర ప్రజలకు, జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు లోగిళ్ల భోగీ, సంక్రాంతి పండుగను జరుపుకోవడం ఆనవాయితి అని గుర్తు చేశారు.

26న ట్రాక్టర్ల ప్రదర్శన

- ఎస్‌కేఎం పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను రక్షించాలని ఎస్‌కేఎం కోరింది. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని కోరుతూ జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ఈనెల 26న ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ ర్యాలీలను నిర్వహించాలని ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి. సాగర్, పశ్యపద్మ, వి.ప్రభాకర్, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి, నాగిరెడ్డి, పద్దారపు రమేష్, కొండల్, ప్రసాదన్న తదితరులు పిలుపునిచ్చారు. రైతు సమస్యలపై పోరాడుతున్న జగ్జీత్‌సింగ్ ప్రాణాలను కాపాడేందుకు కేంద్రం ముందుకు రాకపోవడాన్ని వారు ఖండించారు.న్యాయబద్ధమైన రైతాంగ డిమాండ్లను పరిష్కరించడంలో ప్రధాని చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

'మోడీకి, కేజ్రీవాల్ కు మధ్య ఎలాంటి తేడా లేదు'

- ఢిల్లీ ఎన్నికల తొలి ర్యాలీలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శంఖారావం మోగించింది. సోమవారం రాహుల్ గాంధీ సీలంపూర్ చేరుకున్నారు. ఇది ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న స్థానం. రాహుల్ తన తొలి ప్రసంగంలో ద్వేషాన్ని ప్రేమతో ఓడిస్తానని అన్నారు. ఏం జరిగినా, ఈ రాజ్యాంగాన్ని మనం కాపాడుకుంటామని రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు ఈ రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దేశాన్ని కేవలం 150 మంది ధనవంతులు నడుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీకి, అరవింద్ కేజ్రీవాల్ కు మధ్య ఎలాంటి తేడా లేదని ఆయన అన్నారు.

ప్రతిరోజూ అంబేద్కర్ రాజ్యాంగంపై మోడీ , బీజేపీ నేతలంతా దాడి చేస్తున్నారని తెలిపారు.నా రాజకీయాల్లో స్పష్టత ఉంది.నేను బతికి ఉన్నంత వరకు, ఏ భారతీయుడిపైనైనా దాడి జరిగితే, అతను ఏ మతం లేదా కులానికి చెందినవాడైనా, నేను అతన్ని రక్షిస్తాను.అని భరోసా ఇచ్చారు.

కేజ్రీవాల్ టార్గెట్‌గా..

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై విరుచుకుపడ్డారు. ఆయన ఎప్పుడైనా అదానీకి వ్యతిరేకంగా మాట్లాడారా, కానీ నేను స్పష్టంగా మాట్లాడుతున్నాను. ఒక వ్యాపారవేత్త దయపై దేశాన్ని నడుచుకోనివ్వం. కుల గణన గురించి నేను మాట్లాడేటప్పుడు, మోడీ , కేజ్రీవాల్ ఇద్దరి నుంచి ఒక్క మాట కూడా నాకు వినిపించడం లేదన్నారు. కుల గణనకు అనుకూలంగా ఉన్నారా అని కేజ్రీవాల్‌ను అడగాలంటూ కోరారు.

దేశంలో సిద్ధాంతాల యుద్ధం జరుగుతోందని, బీజేపీ ప్రజలను ఒకరిపై ఒకరు పోరాడేలా చేయాలని ప్రయత్నిస్తోందని అన్నారు. మనందరికీ అందరూ సమానమే, ప్రేమ ద్వేషాన్ని ఓడిస్తుంది.



సీలంపూర్ సీటు కాంగ్రెస్ కు బలమైన కోట

సీలంపూర్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ పార్టీకి బలమైన కోటగా ఉంది. అయితే, గత కొన్ని ఎన్నికలలో ఓటర్ల ప్రాధాన్యతలో మార్పు వచ్చినట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ ప్రధాన పోటీదారులుగా నిలిచాయి. రాహుల్ గాంధీ తన మొదటి ర్యాలీకి సీలంపూర్ ప్రాంతాన్ని ఎంచుకోవడం, కోల్పోయిన ప్రాబల్యాన్ని తిరిగి పొందడంలో పార్టీ విధానాలలో భాగమేనని హస్తం పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు.

పోలీసుల పనితీరుపై అభిప్రాయ సేకరణ



అందుబాటులోకి ప్రత్యేక క్యూఆర్ కోడ్

నాణ్యమైన సేవలు అందించడమే పోలీసుల లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు అసాంఘిక కార్యకపాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకం. ఏ కష్టం వచ్చినా తామున్నామంటూ ప్రజలకు పోలీసులు భరోసా కలిగిస్తుంటారు. అయితే ఫిర్యాదుదారులతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సక్రమంగా ఉండటం లేదనే వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం పోలీసుల సేవలపై అభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేసింది. కొంతమంది అధికారులు ప్రజా సమస్యలపై పట్టింపు లేనితనంగా వ్యవహరించకుండా ఉండేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేక క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకువచ్చింది. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుడు.. అక్కడ వస్తున్న ఇబ్బందులు, అందించిన సేవలు, పోలీసులు తీరుపై నేరుగా క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదుతో పాటు సలహాలు సూచనలు అందించాలి. పోలీసు సత్వర సేవలు అందించిన వారికి అభినందించడంతో పాటు, ఆలస్యం చేసే వారిని శిక్షించే విధంగా కూడా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశాన్ని కల్పించింది. ఫీడ్ బ్యాక్‌లను ఫిర్యాదులు, పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈచలాన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్ పోర్ట్ ధ్రువీకరణతో పాటు ఇతర అంశాలపైనా అభిప్రాయాలను తెలియజేయవచ్చు.



పోలీస్ స్టేషన్లకు నిబంధనలు

క్యూఆర్ కోడ్ పోస్టర్‌పై రాష్ట్ర పోలీస్ శాఖ అన్ని పోలీస్ స్టేషన్లకు ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రతి స్టేషన్ పరిధిలో ఐదు పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఫిర్యాదుదారులు స్టేషన్‌లోకి రాగానే కనిపించేలా ఉండాలి. ఎక్కువగా రద్దీ ఉండే ప్రాంతాల్లో ప్రజలకు కనిపించేలా ఉంచటంతో పాటు ఎక్కువ ప్రాంతాల్లో పోస్టర్లు అతికించాలి.

ప్రజలకు నాణ్యమైన సేవే లక్ష్యం



రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన క్యూఆర్ కోడ్ విధానాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. పోలీసుల పనితీరు పెరగడానికి ఇది పనిచేస్తుంది. ప్రజలు క్యూఆర్ కోడ్ వినియోగించుకుని నాణ్యమైన సేవలు పొందాలి.

- డివి శ్రీనివాసరావు, ఎస్పీ ఆసిఫాబాద్

అభిశంసనకు గురైనా.. ఆ అధ్యక్షుడి జీతం పెరిగింది

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అభిశంసనకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన అరెస్టుకు ప్రయత్నాలు జరుగుతున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. 2025 ఏడాదికి గాను ఆయన వార్షిక వేతనం మూడుశాతం పెరగనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. దక్షిణ కొరియా సిబ్బంది నిర్వహణ శాఖ ప్రకారం..ప్రభుత్వ అధికారుల ప్రామాణిక నియమాల కింద అధ్యక్షుడి జీతం పెరగనున్నట్టు సమాచారం. అభిశంసన విచారణ ప్రక్రియ కొనసాగే ఆరు నెలలపాటు దాదాపు 130 మిలియన్ వోన్‌లు తీసుకోనున్నారు. ప్రస్తుతం 1.70లక్షల డాలర్లుగా ఉండగా.. తాజా పెంపుతో 1.79లక్షల డాలర్లకు పెరగనుంది. అధ్యక్ష బాధ్యతల్లో కొనసాగనప్పటికీ ఆయనకు ఈ జీతం అందుతుంది.

అదేవిధంగా..అభిశంసనకు గురైన ప్రధానమంత్రి హన్ డక్-సూ కూడా మూడుశాతం జీతం పెరిగింది. 'నో వర్క్, నో పే' నిబంధన ప్రకారం వీరిద్దరికి పూర్తి జీతం ఇవ్వడం నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని తెలుస్తోంది. అయితే, అభిశంసనకు గురైన ప్రభుత్వ అధికారులకు జీతాలు చెల్లించే విషయంపై ఎటువంటి నిబంధన లేకపోవడంతో దీనిపై స్పష్టత లేదు.ఇదిలాఉంటే, దేశంలో మార్షల్ లా విధిస్తున్నట్టు అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఉత్తర్వులు జారీ చేయడంతో దక్షిణ కొరియాలో రాజకీయ సంక్షోభం తలెత్తింది. దీనికి వ్యతిరేకంగా విపక్షాలు పార్లమెంట్(జాతీయ అసెంబ్లీ)లో ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానంలో ఓడిపోవడంతో యూన్ అధ్యక్ష అధికారాలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో యూన్‌ను తప్పించాలా, కొనసాగించాలా అన్న అంశాన్ని రాజ్యాంగ న్యాయస్థానం 180 రోజుల్లోగా తేల్చనుంది. ఒకవేళ అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంటే 60 రోజుల్లోగా అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

సంక్రాంతి తెలుగింటి పెద్ద పండుగ. దీనిలో అణువణువూ స్త్రీతత్వం దాగి ఉంది. కొత్త అల్లుడు అత్తారింటికి రావాలన్నా... చీకటి వెళ్లగొట్టి కల్లాపి చల్లాలన్నా... తలంటూ స్నానాలతో ఇల్లూవాకిలి తెలవారాలన్నా...నింగిలోని చుక్కలను దించి నేలమీద పెట్టాలన్నా... ముగ్గుల్లో రంగులు అద్దాలన్నా... గడప గడపకు గొబ్బెమ్మలు ఉంచాలన్నా... గంగిరెద్దులు, హరిదాసులకు బియ్యం దానం చేయాలన్నా... కొత్త బట్టలతో ఇళ్లన్నీ కళకళలాడాలన్నా... పిల్లాపాపల సందడి ఉండాలన్నా... ధాన్యంతో ఊళ్లు నిండాలన్నా... పిండివంటలు ఘుమఘుమలాడాలన్నా... బొమ్మలు కొలువు దీరాలన్నా... 'భోగి' పండ్లు పోసి దీవించాలన్నా... పట్టుపరికిని కట్టి ప్రకృతినే పులకింప జేయాలన్నా అమ్మాయే కదా..! తెలుగింటి శోభ. 'స్త్రీ'కాంతి లేని సంక్రాంతిని ఊహించగలమా...! అందుకే ఈ సంక్రాంతి పూట మహిళా ముచ్చట.



'స్త్రీ'కాంతి సంక్రాంతి



సంక్రాంతి అంటే నూతన క్రాంతి (కాంతి) అని అర్థం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించటాన్ని మకర సంక్రమణం అంటారు. ప్రతియేటా సూర్యుడు 12 రాశుల్లోకి ప్రవేశిస్తాడు. ఈ ప్రతి రాశిలోనూ స్త్రీ విశిష్టత దాగి ఉంటుంది. తెలుగు, తమిళ రాష్ట్రాల్లో ఈ పండుగను జరుపుకుంటారు. సంక్రాంతి అంటే సంప్రదాయం, చక్కని పంచకట్టు, మహిళలు పట్టువస్త్రాలు ధరించి ఈ పండుగ చేసుకుంటున్నారు. అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చాక అందరూ ఒకచోట చేరి సంక్రాంతి వేడుకలు చేసుకుంటున్నారు. దీనిలోనూ మహిళలే ప్రధాన భూమికి పోషిస్తున్నారు.

కలివిడిగా పిండివంటలు..

సంక్రాంతి శీతాకాలంలో వచ్చే అతిపెద్ద పండుగ. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ఇంటికి తెస్తారు. శీతాకాలంలో తీసుకునే ఆహారమే మనిషికి ఏడాది పాటు శక్తిని ఇస్తుంది. అందుకే కొత్తబియ్యంతో చేసిన రకరకాల పిండివంటలు ఈ పండుగలో కనిపిస్తాయి. ఈ వంటకాలన్నీ శరీరానికి శక్తినివ్వడంతో పాటు శరీరంలో ఉష్ణోగ్రతను పెంచుతాయి. వీటిలో అరిసెలు, సకినాలు, కొబ్బరి బూరెలు, నువ్వుల ఉండలు, కజ్జికాయలు, గారెలు, జంతికలు, సున్నుండలు ప్రత్యేకమైనవి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో మహిళలు ఇప్పటికీ అనేక పల్లెల్లో మూకుమ్మడి పిండివంటలు చేస్తుంటారు. ఐదారుగురు కలిసి వంటకు కావాల్సిన సామగ్రిని



కొనితెచ్చుకుంటున్నారు. అందుకయ్యే ఖర్చు సమానంగా వేసుకుంటున్నారు. పిండివంటలను కూడా సరిసమానంగా పంచుకుంటున్నారు.

పొంగులేటి మాధురి పర్యవేక్షణలో

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి ఉదయం, మధ్యాహ్నం వేళల్లో తన క్యాంప్ కార్యాలయానికి వచ్చిన వారికి టిఫిన్‌లు, భోజనాలు పెట్టడం ఆనవాయితీ. ఆయన పదవిలో ఉన్నా.. లేకున్నా ఈ సంప్రదాయాన్ని మాత్రం కొనసాగిస్తున్నారు. దీనిలో ఆయన సతీమణి మాధురి పాత్ర అత్యంత కీలకం. ఈ వంటల ఏర్పాట్లన్నీ ఆమె ఆధ్వర్యంలోనే జరుగుతాయి. ప్రతీ పండుగకు కార్యాలయ సిబ్బందికి ఆమె తనవంతు సాయం చేస్తుంటారు. అలవెన్స్‌లు, దుస్తులు అందిస్తారు. వీటితో పాటు సంక్రాంతికి ఆమె పర్యవేక్షణలో



తయారు చేసిన పిండివంటలను సిబ్బందికి పంపిణీ చేస్తారు. ఇందుకోసం ఆమె పండుగకు వారం రోజుల ముందే ఖమ్మం లేదా కల్లూరు మండలం నారాయణపురంలో ఉంటూ వంటలు తయారు చేయిస్తారు. ఈసారి సిబ్బంది కోసం అరిసెలు, బూందీ, మడత కాజాలు, లడ్డూలు ప్రత్యేకంగా తయారు చేయించారు. వీటిని ఖమ్మంతో పాటు హైదరాబాద్‌లోని మంత్రి పేషీ, రాఘవ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేసే సుమారు 250 మంది సిబ్బందికి ఇప్పటికే అందజేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతుల వియ్యంకుడు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి సైతం ఆమె తన పిండివంటలను అందించారు. కుమారుడు హర్ష, కుమార్తె సప్నీరెడ్డి, సోదరుడు ప్రసాదరెడ్డి, శ్రీలక్ష్మిల కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహాల సందర్భంగానూ పొంగులేటి దంపతులు లక్షలాది మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు...

సంక్రాంతి అంటే ముగ్గులు, రంగవల్లులు. నెల రోజుల ముందు నుండే ముగ్గులు లేని లోగిళ్లను చూడలేం. ముగ్గులతో మహిళలకున్న అనుబంధాన్ని విడదీయలేం. సంక్రాంతి సందర్భంగా అనేక సంస్థలు, ప్రజాప్రతినిధులు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో రాష్ట్రంలో చాలా చోట్ల ఇప్పటికే ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ ఈ పరంపర కొనసాగుతోంది. ఈ ఏడాది పొంగులేటి మాధురి పాలేరు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆమే స్వయంగా బహుమతులు అందజేశారు. సంక్రాంతి, రథసప్తమికి ప్రత్యేక ముగ్గులు ఉంటాయి. భోగి, సంక్రాంతి రోజు వేసే ముగ్గులో పొంగలి, చెరకు గడలు ఉంటే కనుమ రోజు అందరూ తప్పనిసరిగా రథం ముగ్గు వేస్తారు. ముగ్గులు వేసిన తర్వాత నాలుగు వైపులా బార్డర్స్ గీయటం, పోటీలు నిర్వహించే సంస్థను దృష్టిలో పెట్టుకొని ముగ్గులు వేసి ఆకట్టుకుంటున్నారు. బహుమతులూ గెలుచుకుంటున్నారు.



బొమ్మల కొలువు...భోగి పండ్లు

సంక్రాంతి పండుగలో బొమ్మల కొలువుది కూడా ఓ ప్రత్యేకం. కాలక్రమేణా తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో ఈ బొమ్మల కొలువు ప్రాధాన్యం కోల్పోయినా ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. కొన్ని సంస్థలు ఈ బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తున్నాయి. ఎక్కువగా దేవుని విగ్రహాలు, హాస్య ప్రతిమలతో బొమ్మలు కొలువుతీరుతాయి. మహిళా జీవితాతు ప్రతిబింబించే బొమ్మలతో అభ్యుదయ సంస్థలు కొన్నిచోట్ల బొమ్మల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నాయి. ఇక ఇరుగుపొరుగు మహిళలను పిలిచి భోగి రోజున పిల్లలపై భోగి పండ్లు పోయటం ఆనవాయితీ. ఇప్పటికీ చాలా చోట్ల ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఇలా మొత్తంగా మహిళా బతుకు చిత్రాన్ని ఆవిష్కరించే పండుగగా సంక్రాంతి నిలుస్తోంది. సంక్రాంతి 'స్త్రీ'కాంతుల పండుగగా నిలవాలని.. సాధికారత దిశగా వారి పయనం సాగాలని ఆశిద్దాం.

- కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి

సాధికారత దిశగా...



ఇంట్లో ఉన్న వ్యర్థాలతో పాటు మనలోని చెడునూ భోగి మంటల్లో తగులబెట్టాలి. మనుషుల మనసులను కూడా శుద్ధి చేసుకోవాలి. నాకు పెద్దగా ముగ్గులు రానప్పటికీ తోటి మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహించాం. మా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది మా సొంత మనుషులతో సమానం. అందుకే ప్రతి పండుగకు వారికి ఏదో ఒక కానుక ఇస్తాను. ఇందిరమ్మ ప్రభుత్వం మహిళా పక్షపాతి. అందుకే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు, మహిళల పేరుతో ఇందిరమ్మ ఇండ్లు, రూ.500కు గ్యాస్ సరఫరా చేస్తోంది. సంప్రదాయాలను పాటిస్తూనే మహిళలు సాధికారత దిశగా సాగాలనేది నా ఆకాంక్ష. - పొంగులేటి మాధురి

జపాన్‌లో భూకంపం..

టోక్యో: జపాన్‌లో భూకంపం సంభవించింది. స్థానిక మీడియా సమాచారం మేరకు దేశ నైరుతి ప్రాంతంలో 6.9 తీవ్రతతో ప్రకంపనలు నమోదైనట్టు ఆ దేశ వాతావరణ ఏజెన్సీ తెలిపింది. క్యుషు ద్వీపంలోని మియాజాకి ప్రాంతంలో 37 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు వెల్లడించింది. ఈ క్రమంలోనే మియాజాకితోపాటు కొచీ ప్రాంతాలకు సునామీహెచ్చరికలు జారీ చేసింది. అయితే నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. గతేడాది ఆగస్టులోనూ జపాన్‌లో రెండు భారీ భూకంపాలు సంభవించాయి. 6.9, 7.1 తీవ్రతతో ఏర్పడిన రెండు శక్తిమంతమైన భూకంపాలు నైరుతి దీవులైన క్యుషు, షికోకులను కుదిపేశాయి. అనేక ప్రాంతాలకు అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అయితే.. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. గతేడాది జనవరి 1న సుజు, వాజిమా పరిసర ప్రాంతాల్లో 7.6 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపంలో 300 మందికి పైగా మృతి చెందిన విషయం తెలిసిందే.

ట్రంప్‌తో విభేదించిన వాన్స్

క్యాపిటల్ హిల్ ఘటనలో నిందితులకు క్షమాభిక్షపై భిన్నాభిప్రాయాలు

న్యూయార్క్: డోనాల్డ్ ట్రంప్-జేడీ వాన్స్ ఇంకా ప్రమాణస్వీకారం కూడా చేయలేదు. అప్పుడే ఇద్దరికీ కొన్ని అంశాల్లో స్వల్ప అభిప్రాయ భేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. 'క్యాపిటల్ హిల్' ఘటనలో నిందితులకు క్షమాభిక్ష అంశంపై వారు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఇప్పటికే వారికి తన అధికారాలను ఉపయోగించి కేసుల నుంచి విముక్తి కల్పిస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. మరోవైపు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాన్స్ మాత్రం సహజంగానే వారికి ఎటువంటి క్షమాభిక్ష ఇవ్వకూడదని చెబుతున్నారు.

తాజాగా ఫాక్స్ న్యూస్‌లో జరిగిన కార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ "ఇది చాలా సింపుల్. నాడు మీరు శాంతియుతంగా ఆందోళన చేసినట్లైతే.. మిమ్మల్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఓ గ్యాంగ్ సభ్యుల్లా ట్రీట్ చేసేది. మీకు క్షమాభిక్ష కూడా లభించేది. కానీ, ఒకవేళ మీరు ఆ రోజు హింసకు పాల్పడితే.. మీకు క్షమాభిక్ష రాదు. దీనిపై కొంత అస్పష్టత ఉంది. జనవరి 6వ తేదీ నాటి అల్లర్లకు సంబంధించి చాలామంది అమాయకులు విచారణను ఎదుర్కోవడం సరికాదు. దానిని మనం సరిచేయాలి" అని వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలపై క్యాపిటల్ హిల్స్ ఘటనకు మద్దతు తెలిపేవారు వాన్స్‌ను తీవ్రంగా విమర్శించడం మొదలుపెట్టారు. దీనికి మళ్లీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన వివరణ పోస్టు చేశారు.

" మొదటగా నేను చెప్పేది ఏమిటంటే.. జే6 (జనవరి 6) ఖైదీల నిధికి నేను కూడా విరాళం ఇచ్చాను. నేను సెనెట్ బరిలో నిలిచిన వేళ ఈ విషయాన్ని చాలామంది విమర్శించారు. నేను చాలా ఏండ్లుగా వీరిని రక్షిస్తున్నాను. రెండోది.. నాడు జనసమూహంలో ఫెడరల్ ఇన్ఫార్మర్లు ఉన్నారు. వారికి క్షమాభిక్ష లభిస్తుందా..? అలాగని నేను అనుకోను. అధ్యక్షుడు ప్రతి కేసును తాను పరిశీలిస్తానని చెప్పారు. (నేను కూడా అదే చెబుతున్నాను) అలా అంటే కొంత వెనక్కి తగ్గినట్టు కాదు. అన్యాయంగా జైళ్లకు వెళ్లినవారిని రక్షిస్తాం. ఎవరి ప్రభావానికో లోనై రెచ్చిపోయిన వారు, చెత్త విచారణలు ఎదుర్కొంటున్నా వారు కూడా వీరిలో ఉన్నారు" అని రాసుకొచ్చారు.తాను అధికారం చేపట్టిన తొలిరోజే క్యాపిటల్ హిల్స్ ఘటనలో నిందితులకు క్షమాభిక్షను ప్రకటిస్తానని ట్రంప్ చెప్పారు. ఇటీవల ఎన్‌బీసీ మీట్‌ద ప్రెస్‌లో కూడా మాట్లాడుతూ వీలైనంత త్వరగా దీనిని పూర్తి చేస్తానని పునరుద్ఘాటించారు.

అసలు ఏం జరిగింది..?

2020 జనవరి 6వ తేదీన జోబైడెన్ విజయం తర్వాత ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ హిల్ భవనం వద్దకు చేరి ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత వారు అడ్డంకులు తొలగించుకొని ఆ భవనంలోకి చొరబడి అరాచకం సృష్టించారు. 100 మంది పోలీసులు గాయపడ్డారు. సుమారు 1,500 మందిపై దీనికి సంబంధించి కేసులు నమోదు చేశారు. నిందితులకు క్షమాభిక్ష పెడితే..చట్టాలకు విలువ ఉంటుందా..? ట్రంప్‌కు మద్దతిచ్చే అరాచకశక్తులు మరింత రెచ్చిపోయే ప్రమాదం లేకపోలేదన్న భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

హిందూత్వ వాదుల నయా ఎత్తుగడ

(మొదటిపేజీ తరువాయి)

తనకు ఈ-మెయిల్ వచ్చిందని, తనను, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను, అదనపు డీజీపీ అమితాబ్ యష్‌ను చంపుతానని అందులో బెదిరించాడని తెలిపాడు. 'మీరు ముస్లింల బతుకుల్ని నరకప్రాయం చేస్తున్నారు. మా వారు యూపీకి వచ్చి తివారీ, యోగి, అమితాబ్ యష్‌లను చంపుతారు' అని జుబర్ ఖాన్ హెచ్చరించాడని చెప్పాడు. దీనికి మరింత మసాలా జోడిస్తూ 'నేను అల్లా మీద ప్రమాణం చేస్తున్నా. వారిని వేధించి చంపేస్తాం. ఇందుకు ఐఎస్ఐ పూర్తి బాధ్యత తీసుకోవాలి' అంటూ జుబర్‌గా చెప్పుకుంటున్న వ్యక్తి తన ఈ-మెయిల్ సందేశాన్ని ముగించాడు.

2023లో తివారీ మరో ప్రకటన చేశాడు. ఆలమ్ అన్సారీ ఖాన్ అనే వ్యక్తి నుండి ఇదే రకమైన బెదిరింపు ఈ-మెయిల్ అందిందని చెప్పాడు. కొద్ది రోజుల తర్వాత ఈ కేసులో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) కీలకమైన ముందడుగు వేసింది. ఈ-మెయిల్స్ పంపిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసింది. అయితే వీరిలో ఏ ఒక్కరూ ముస్లిం కారు. నిందితులను తహర్ సింగ్, ఓం ప్రకాష్‌గా గుర్తించారు. ఇక్కడ గొప్ప ట్విస్ట్ ఏమిటంటే వీరిద్దరినీ నకిలీ గుర్తింపులతో ఈ-మెయిల్స్ పంపాల్సిందిగా కోరింది తివారీయే. మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టి, సమాజంలో ముస్లింలను ఏకాకులను చేయడమే తివారీ లక్ష్యమని స్పష్టమవుతోంది. నిజానికి తివారీకి ఇలాంటివి కొత్తేమీ కావు. 2021 డిసెంబర్, 2022 ఫిబ్రవరి, మార్చి, నవంబర్‌లో కూడా ఇలాంటి కట్టుకథలే అల్లాడు.

భారతీయ కిసాన్ మంచ్, భారతీయ గోసేవా పరిషత్ పేరిట తివారీ స్వచ్ఛంద సంస్థను నడిపాడు. లక్నోలోని పలు పోలీస్ స్టేషన్లలపై అతనిపై అనేక కేసులు నమోదు చేశారు. తివారీ నడుపుతున్న కాలేజీలోనే ఓం ప్రకాష్, తహర్ పనిచేస్తున్నారు. కాగా ముస్లింల పేరుతో సోషల్ మీడియాలో కన్పిస్తున్న అనేక పోస్టులు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉంటున్నాయి. అయితే వాస్తవానికి వీటికి, ముస్లింలకు ఎలాంటి సంబంధం లేదు.

వీరు కూడా నకిలీలే

ఇక్కడ మరో ఉదంతాన్ని పరిశీలిద్దాం. మత ఉద్రిక్తతలను వ్యాపింపజేస్తున్నందుకు ఆగ్రాలో నివసిస్తున్న ధీరేంద్ర రాఘవ్‌ను గత సంవత్సరం జూన్‌లో అరెస్ట్ చేశారు. అతను ఓ ముస్లిం పేరుతో హిందూ సమాజంపై విష ప్రచారం సాగించాడు. జైలు నుండి విడుదలైన తర్వాత కూడా ఆయన బుద్ధి మారలేదు. సనాతన, హిందూ అనుకూల పోస్టులు పెట్టాడు. ఓ ముస్లిం మాదిరిగా దుస్తులు ధరించి సోషల్ మీడియాలో కన్పించేవాడు. ఇప్పుడు మరో దొంగ వేషగాడిని చూద్దాం. బీకాం చదువుతున్న రాజీవ్ కాంత్ అనే విద్యార్థి ముస్లిం పేరుతో దోపిడీ రాకెట్ నడిపాడు. నకిలీ ఈ-మెయిల్ ఐడీతో వందల కోట్ల రూపాయలు డిమాండ్ చేశాడు. చివరికి కటకటాలపాలయ్యాడు. ఈ విధంగా అనేక మంది హిందూత్వ వాదులు ముస్లిం పేర్లతో సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం సాగిస్తూ విద్వేషాలను రెచ్చగొడుతున్నారు.

నలుగురు పిల్లల్ని కంటే.. రూ.లక్ష నజరానా



భోపాల్: మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పరశు రామ్ కల్యాణ్ బోర్డు ఓ ప్రకటన చేసింది. తమ కమ్యూనిటీని పెంచుకునేందుకు ఎక్కువ మంది సంతానాన్ని కనాలని పిలుపునిచ్చింది. నలుగురు పిల్లలను కనే బ్రాహ్మణ దంపతులకు రూ.లక్ష నజరానా ఇస్తామని ప్రకటించింది.

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పరశురామ్ కల్యాణ్ బోర్డుఅధ్యక్షుడు పండిత్ విష్ణు రాజోరియా ఈ ప్రకటన చేశారు. "మనం మన కుటుంబాలపై దృష్టి పెట్టడం మానేశాం. ఈ మధ్య యువత ఒక బిడ్డను కని ఆగిపోతున్నారు. ఇది చాలా సమస్యాత్మకంగా మారుతోంది. భవిష్యత్ తరాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే. అందుకే కనీసం నలుగురు సంతానం ఉండాలని కోరుతున్నా" అని రాజోరియా తెలిపారు."నలుగురు పిల్లల్ని కనే మహిళలకు బోర్డు తరపున రూ.లక్ష నజరానా అందిస్తాం. నేను బోర్డు అధ్యక్షుడిగా దిగిపోయిన తర్వాత కూడా ఈ అవార్డు కొనసాగుతుంది" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్‌గా మారింది.

మనలో ఆ శక్తి ఉన్నదా..?

వాస్తవానికి ఇంతమంది పిల్లల్ని కనటానికి..శక్తి అనేది కీలకమైంది. శారీరక, ఆర్థిక సామర్థ్యంతో పాటు మహిళల ఆరోగ్యం గురించి శ్రద్ధ చూపాల్సిన బాధ్యత ప్రతి కులంపైనా ఉన్నది. నేటి సమాజంలో పెరిగిపోతున్న ఖర్చులు, ఆర్థిక భారాలతో ఒక బిడ్డ చాలు అనుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఇంతమందిని కంటే..నజరానా ఇస్తామంటూ ప్రకటనలు చేసే ఆ నేతల కుటుంబాల్లో ఎంతమంది కంటున్నారు..?వారి చదువు,సంధ్య ఎలా ఉన్నదో పరిశీలించాలని మహిళాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కేవలం ఓటు రాజకీయాల కోసమే నోటికి వచ్చినట్టు ప్రకటనలు గుమ్మరిస్తున్నారు. ఇలాంటి మత జాడ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

డమ్మీ హామీల్లాగా..డమ్మీ రుణమాఫీ చెక్కులిస్తున్నారా?

నవతెలంగాణ-సంగారెడ్డి

'ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్టు.. ముఖ్యమంత్రి రుణమాఫీకి సంబంధించి కూడా డమ్మీ చెక్కులు ఇస్తున్నారా రేవంత్‌రెడ్డి' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ముందుగా భోగ భాగ్యాలను అందించే భోగి పండుగ, కొత్త కాంతులను తెచ్చే సంక్రాంతి పండుగ, కనుమ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని.. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్.. అడుగడుగునా రైతులను దగా చేస్తున్నదని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు విజయోత్సవాల్లో రూ.2750 కోట్లు రుణమాఫీ కోసం ముఖ్యమంత్రి విడుదల చేశారని.. రెండు నెలల కిందట రైతు రుణమాఫీ కోసం చెక్కు ఇచ్చినా.. ఇప్పటివరకు సంగారెడ్డి రైతులకు చేరలేదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన చెక్కుకే దిక్కు లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. నవంబర్ 30న ముఖ్యమంత్రి చెక్కిస్తే ఇప్పటివరకు రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్టు.. ముఖ్యమంత్రి అయినంక కూడా డమ్మీ చెక్కులు ఇస్తున్నారా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. రెండు లక్షల పైన రుణాలున్న రైతులు.. ముఖ్యమంత్రి చెప్పిన మాట ప్రకారం ఆ పైన ఉన్న అప్పును చెల్లించారన్నారు. వారికి ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని మోసం చేశారన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ఉపాధి హామీ కూలీలను కూడా దగా చేస్తున్నారన్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. కోటి మంది వ్యవసాయ కూలీలు ఉంటే పది లక్షల మందికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామంటున్నారని.. 90 శాతం ఎగ్గొడుతున్నారన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గోబెల్స్‌ను మించిపోతున్నారన్నారు. అప్పుల విషయంలో అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ప్రాజెక్టు నిర్మాణం కాలేదని, ఒక ఎకరాకు కూడా నీళ ఇవ్వలేదు అని అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో 4000 కోట్లు ఖర్చుపెట్టి ఆరు లక్షల 50 వేల ఎకరాలకు నీళ్ల అందించామన్నారు. ఇందుకు 'మేము బహిరంగ చర్చకు సిద్ధమని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పండి. మధిరకు రమ్మంటారా, సెక్రటేరియట్‌కి రమ్మంటారా? మీ ప్రగతి భవన్ కి రమ్మంటారా? అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ శివకుమార్, విజయేందర్ రెడ్డి, మఠం బిక్షపతి, అజీమ్, జీవీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను పరిమితిని రూ.8 లక్షలకు పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిదో తరగతి వరకే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిధులతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నది.

జమ్మూలో జడ్-మోడ్ టన్నెల్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

తన ప్రసంగంలో రాష్ట్ర హోదా డిమాండ్ గురించి ప్రస్తావించారు. దీనికి మోడీ సమాధానం ఇస్తూ 'మోడీ వాగ్దానం చేస్తే దాన్ని నెరవేరుస్తాడు. ప్రతి సమయానికి సరైన సమయం ఉంటుంది. సరైన సమయంలో సరైన పనులు జరుగుతాయి' అని తెలిపారు. అలాగే ఈ టన్నెల్ గురించి మోడీ మాట్లాడుతూ 2015లో దీని శంఖుస్థాపన కార్యక్రమం జరిగిందని, ఇప్పుడు దీనిని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ టన్నల్‌తో సొనామార్గ్‌లో పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. కాశ్మీర్‌ను లడఖ్‌తో కలిపే శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై సొనామార్గ్‌కు సమీపంలో గగంగిర్ గ్రామం వద్ద నిర్మించారు. 6.5 కిలోమీటర్లు పొడవైన ఈ టన్నల్‌ను రూ 2,700 కోట్లతో నిర్మించారు. వాస్తవానికి దీనిని 2023 ఆగస్టులోనే ప్రారంభించాల్సి ఉంది. కానీ అనేక సమస్యలతో నిర్మాణం ఆలస్యమయింది. ఈ ప్రారంభం సందర్భంగా మోడీ మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ అనేది భారత దేశానికి కిరీటమని, కాబట్టి ఇది అందంగా, బలంగా ఉండాలని చెప్పారు. ఇక్కడ చీనాబ్ వంతెన నిర్మాణం ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆశ్చర్యపరిచిందని, ఈ వంతెనపై ఇటీవలే ప్యాసింజర్ రైలు ట్రయల్స్ పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లాతో పాటు, జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ప్రసంగించారు.

నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్లు

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు కట్టాలని చిత్తశుద్ధితో ఉన్నట్టు చెప్పారు. అనంతరం కూసుమంచి మండలంలోని దుబ్బ తండాలో ఇండ్ల గహప్రవేశంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీ రామహాయం రఘురాం రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, హౌసింగ్ ఈ ఈ, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

26 నుంచి కొత్త రేషన్‌కార్డులు


(మొదటిపేజీ తరువాయి)

పౌరసరఫరాల శాఖ అధికారి (డీసీఎస్‌వో) పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని వివరించారు. ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డు సభలో ప్రదర్శించి వాటిపై చర్చించిన తర్వాత ఆమోదిస్తామని తెలిపారు. గ్రామసభ లేదా వార్డు సభల ద్వారా ఆమోదించిన లబ్దిదారుల అర్హత జాబితాను మండల/మున్సిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేసి జిల్లా కలెక్టర్/జీహెచ్ఎంసీ కమిషనర్‌కు లాగిన్ పంపించాలని సూచించారు. ఆ పంపిన జాబితాను జిల్లా కలెక్టర్/జీహెచ్ఎంసీ కమిషనర్ పరిశీలించి సంతృప్తి చెందితే పౌరసరఫరాల శాఖ కమిషనర్ (సీసీఎస్)కు పంపాలని పేర్కొన్నారు. తుది జాబితా ప్రకారం సీసీఎస్ కొత్త రేషన్‌కార్డులను జారీ చేస్తారని వివరించారు. అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక్క ఆహార భద్రత (రేషన్) కార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ కార్డుల్లో సభ్యుల చేర్పులు, తొలగింపులు చేయాలని తెలిపారు. ఈ నిబంధనలను పాటించాలని కోరారు.

పండుగలు సాంస్కృతిక పునర్జీవనానికి వారధులు

(మొదటిపేజీ తరువాయి)

భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ సంస్థ ప్రతినిధి లిబి బెంజిమన్, జాతీయ, అంతర్జాతీయ కైట్ ప్లేయర్లు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు



విరాట్ కర్ణ

'నాగబంధం' రహస్యం ఏమిటి?

పాన్-ఇండియా మూవీ 'నాగబంధం' నుంచి రుద్రగా హీరో విరాట్ కర్ణ ప్రీ-లుక్ ఇటీవల విడుదలై మంచి బజ్ క్రియేట్ చేసింది. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో రానా దగ్గుబాటి లాంచ్ చేశారు. ఈ యాక్షన్-ప్యాక్డ్ పోస్టర్‌లో విరాట్ కర్ణ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నట్టు తెలుస్తోంది. 'ది సీక్రెట్ ట్రెజర్' అనేది ట్యాగ్‌లైన్.

పద్మనాభ స్వామి, పూరీ జగన్నాథ్ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుండి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో ఈ సినిమా ఉంటుంది. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టి సారించి, భారతదేశంలోని విష్ణు దేవాలయాల చుట్టూ ఉన్న రహస్యాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి ఎన్ఐకె స్టూడియోస్ ఆధ్వర్యంలో కిషోర్ అన్నపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్.అవినాష్ కీలక పాత్రధారులు.

మహా కుంభమేళాలో..



బాలకృష్ణ

బాలకృష్ణ, బోయపాటి కాంబోలో రూపొందుతోన్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఇది వారి మునుపటి బ్లాక్‌బస్టర్ 'అఖండ'కు సీక్వెల్. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రానికి సంబంధించిన కొత్త షెడ్యూల్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకకు వేదికైన మహా కుంభమేళాలో సోమవారం ప్రారంభమైంది. చాలా కీలకమైన సన్నివేశాలను ఈ మహా కుంభమేళాలో చిత్ర బృందం చిత్రీకరిస్తోంది. ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అంచనాలకు తగ్గట్టుగానే డైరెక్టర్ బోయపాటి శ్రీను ఈ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. దసరా కానుకగా సెప్టెంబర్ 25న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, సమర్పణ: ఎం తేజస్విని నందమూరి, సంగీతం: థమన్ ఎస్, డీవోపీ: సి. రాంప్రసాద్, సంతోష్, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, ఫైట్స్: రామ్-లక్ష్మణ్.



హైదరాబాద్‌లో ఐపీఎల్ ప్లే ఆఫ్స్!

క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్‌కు ఆతిథ్యం

హైదరాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ ప్లే ఆఫ్స్‌లో తొలి రెండు మ్యాచులకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఐపీఎల్‌లో ఆది నుంచి పాటిస్తున్న సంప్రదాయం ప్రకారం గత సీజన్ రన్నరప్ సొంత మైదానంలో క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచులు నిర్వహిస్తారు. గత సీజన్ చాంపియన్ సొంత మైదానంలో ఆరంభ, ఫైనల్ మ్యాచులు సహా క్వాలిఫయర్ 2 ఉంటుంది. 2024 ఐపీఎల్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్ విజేతగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ రన్నరప్‌గా నిలిచాయి. మార్చి 21న కోల్‌కత ఈడెన్ గార్డెన్స్‌లో ఆరంభ వేడుకలు సహా తొలి మ్యాచ్ ఉండనుంది. మే 25న ఈడెన్‌గార్డెన్స్‌లోనే ఫైనల్ సహా ముగింపు వేడుకలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఐపీఎల్ గవర్నింగ్ సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది. 2025 ఐపీఎల్‌లో 74 మ్యాచులు షెడ్యూల్ చేయగా.. త్వరలోనే పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఫిబ్రవరి 7న ఆరంభం కానుండగా.. ముంబయి, బెంగళూర్‌తో పాటు బరోడ, లక్నోలో మ్యాచులు నిర్వహించనున్నారు.

శ్రేయస్‌కు సారథ్య పగ్గాలు

పంజాబ్ కింగ్స్ యాజమాన్యం వెల్లడి



ముంబయి : ఇటీవల పొట్టి ఫార్మాట్‌లో సూపర్ సక్సెస్‌తో దూసుకెళ్తోన్న శ్రేయస్ అయ్యర్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ముచ్చటగా మూడో ఫ్రాంచైజీకి సారథ్యం వహించనున్నాడు. 2025 ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని ఆ ఫ్రాంచైజీ యాజమాన్యం వెల్లడించింది. హిందీ బిగ్‌బాష్ రియాలిటీ షోకు సహచర పంజాబ్ కింగ్స్ క్రికెటర్లు యుజ్వేంద్ర చాహల్, శశాంక్ సింగ్‌లతో కలిసి హాజరైన శ్రేయస్ అయ్యర్.. పంజాబ్ కింగ్స్ మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపాడు. 2024 ఐపీఎల్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్‌కు కెప్టెన్సీ వహించిన శ్రేయస్.. ఆ జట్టుకు టైటిల్ అందించాడు. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఆ జట్టును ఫైనల్లోకి తీసుకెళ్లాడు. ఐపీఎల్‌లో తొలి టైటిల్ కోసం ఎదురు చూస్తున్న పంజాబ్ కింగ్స్ శ్రేయస్ అయ్యర్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. ' పంజాబ్ కింగ్స్ యాజమాన్యం నాపై నమ్మకం ఉంచటాన్ని గౌరవంగా భావిస్తున్నాను. కోచ్ రికీ పాంటింగ్‌తో పని చేసేందుకు ఎదురు చూస్తున్నాను. ప్రతిభావంతులు, సత్తా చాటిన ఆటగాళ్ల మేళవింపుతో జట్టు చాలా బాగుంది. తొలి ఐపీఎల్ టైటిల్‌తో పంజాబ్ కింగ్స్ నమ్మకాన్ని నిలుపుకుంటానని ఆశిస్తున్నాను' అని శ్రేయస్ అయ్యర్ తెలిపాడు.

ఫైనల్‌కు చేరేదెవరో?

రేపు విజయ్ హజారే సెమీఫైనల్స్



వడోదర (గుజరాత్) : ప్రతిష్టాత్మక విజయ్ హజారే ట్రోఫీ ఆఖరు ఘట్టానికి చేరుకుంది. గ్రూప్ దశలో నిలకడగా రాణించి, నాకౌట్‌లో మెరుపు విజయాలు సాధించిన నాలుగు జట్లు ఇప్పుడు ఫైనల్లో బెర్త్ కోసం పోటీపడుతున్నాయి. హర్యానా, కర్ణాటక సహా విదర్భ, మహారాష్ట్రలు బుధవారం జరిగే సెమీఫైనల్లో తాడోపేడో తేల్చుకోనున్నాయి. వడోదరలో మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. విదర్భ, మహారాష్ట్ర సెమీస్ సమవుజ్జీల సమరం. కరుణ్ నాయర్, శుభమ్ దూబె, యశ్ రాథోడ్, జితేశ్ శర్మ సహా ధ్రువ్ శోరెలతో విదర్భ బ్యాటింగ్ బలంగా ఉంది. బౌలింగ్‌లో సైతం విదర్భ మెరుగ్గానే కనిపిస్తోంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, నిఖిల్ నాయక్, రాహుల్ త్రిపాఠి, అంకిత్ బవ్నెలు మహారాష్ట్రకు కీలకం. సూపర్ ఫామ్‌లో ఈ జట్లలో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి. ఇక హర్యానాతో సెమీస్‌లో కర్ణాటక ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. మయాంక్ అగర్వాల్, శ్రేయాస్ గోపాల్, అభినవ్ మనోహర్, విజయ్‌కుమార్ వైశాక్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. హర్యానా సమిష్టి ప్రదర్శనపై ఆధారపడింది. అకింత్, దినేశ్, కపిల్ సహా అమిత్ రానా, హర్షల్ పటేల్‌లు హర్యానాకు కీలకం కానున్నారు. విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్ శనివారం జరుగుతుంది.



ఓ ఇంటి 'పెద్ద' కథ..

వైభవ్, సునీల్ లీడ్ రోల్స్‌లో ఓ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్ రూపొందుతోంది. ఇళంగో రామ్ దర్శకుడు. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్, బవేజ స్టూడియోస్ సమర్పణలో ఎస్ కార్తికేయన్, హర్మాన్ బవేజ, పి. హిరణ్య నిర్మిస్తు న్నారు. శశి నాగ్ సహ నిర్మాత. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ని డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ లాంచ్ చేశారు. ఈ చిత్రానికి 'పెద్ద' అనే ఆసక్తికర టైటిల్ పెట్టారు.

'ఫన్ ఫ్యామిలీ ఫ్యూనరల్' అనే ట్యాగ్‌తో ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మరణించిన కుటుంబ పెద్ద చుట్టూ గుమిగూడిన కుటుంబం, వారి డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రంలో రెడిన్ కింగ్స్లీ, దీపా శంకర్, బాల శరవన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి దర్శకత్వం:ఇళంగో రామ్, మ్యూజిక్: అరుణ్ రాజ్, డీవోపీ: సత్య తిలకం, ఎడిటర్: సూర్య కుమారగురు.

మహా కుంభమేళా ప్రారంభం

- 60 లక్షల మందికి పైగా స్నానాలు



ప్రయాగ్‌రాజ్ : ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక భావించే మహా కుంభమేళా ఆదివారం ఆరంభమైంది. ఉత్తర్ ప్రదేశ్‌లోని గంగా, యమునా, సరస్వతీ నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ వద్దకు యాత్రీకులు స్నానం కోసం పోటెత్తారు. పుష్య పౌర్ణమి అయిన సోమవారం తెల్లవారుజామునుంచే లక్షలాదిమంది త్రివేణి సంగమానికి చేరుకొని స్నానాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం 7.30 గంటల వరకే దాదాపు 35 లక్షల మంది ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరించారని ప్రయాగ్‌రాజ్ అధికారులు వెల్లడించారు. సాయంత్రం వరకూ సుమారు 60 లక్షల మంది స్నానాలు ఆచరించినట్లు సమాచారం. ఫిబ్రవరి 26 వరకూ అంటే 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి పర్యటకులు రానున్నారు. మొత్తం 35 కోట్ల మంది వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. మెరుగైన సౌకర్యాలతో పాటు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. నదిలో నిరంతరం పహారా కాసేందుకు ప్రత్యేకంగా తేలియాడే పోలీసుస్టేషన్‌ను ఏర్పాటుచేశారు. అదేవిధంగా చిన్నచిన్న పడవలపై భద్రతా సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు.

ఆధ్యాత్మిక వారసత్వం కుంభమేళా: మోడీ

మహాకుంభమేళా ప్రారంభంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. "భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. విశ్వాసం, భక్తి, సంప్రదాయాల సంగమంతో ఎంతోమందిని ఒకచోట చేర్చింది. మన దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుంది. పవిత్ర స్నానాలు ఆచరించి, భగవంతుడి ఆశీస్సులు తీసుకునేందుకు లెక్కలేనంతమంది రావడం ఎంతో సంతోషంగా ఉంది' అని మోడీ రాసుకొచ్చారు.

కాగా, 10,000 ఎకరాల్లో కుంభమేళాకు ఏర్పాట్లు జరిగాయని, ఏ సమయంలోనైనా 50 లక్షల మంది నుంచి కోటి మంది ఉండగలిగేలా సౌకర్యాలను కల్పించామని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఇప్పటికే వెల్లడించారు. భద్రత కోసం 55 పోలీస్‌స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. 45,000 మంది పోలీసులను మోహరించింది.

15 లక్షలమంది విదేశీ పర్యాటకులు, 10 ఎకరాల్లో కళాగ్రామ్

అలాగే, ఈ మహా కుంభమేళాకు 15 లక్షల మందికి పైగా విదేశీ పర్యాటకులు హాజరవుతారని, వారి కోసం పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రత్యేక టెంట్ సిటీని సిద్ధం చేసిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మీడియాకు తెలిపారు. ఈ టెంట్ సిటీలో ఆయుర్వేదం, యోగా, పంచకర్మ వంటి వైద్య సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు.

ప్రయాగ్‌రాజ్‌లోని నాగవాసుకి ప్రాంతంలోని సెక్టార్ 7లో 10 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భారతీయ సాంస్కృతిక వారసత్వ కేంద్రం 'కళాగ్రామ్'ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వివరాలను తెలిపారు. మహా కుంభసమ్మేళనం ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవమని, ఇది వైవిధ్యభరిత భారతదేశ ఐక్యతను ప్రపంచానికి తెలియజేస్తుందన్నారు. మహాకుంభమేళాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించేలా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. కళాగ్రామ్‌లో 14,630కు పైగా కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారని, మహా కుంభమేళాకు వచ్చే యాత్రీకులు అయోధ్య, కాశీ, మధుర తదితర ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా విమాన ప్రయాణ ఏర్పాట్లు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

ఉక్కిరిబిక్కిరి !

హెచ్-1బి వీసా రగడతో భారతీయ ఉద్యోగుల్లో ఆందోళన

- అందరి దృష్టీ ట్రంప్ నిర్ణయం పైనే
- ఆచితూచి స్పందిస్తున్న కంపెనీలు
- అడకత్తెరలో పోకచెక్కలా నిపుణులు



న్యూఢిల్లీ : అమెరికాలో హెచ్-1బీ వీసా సంస్కరణలపై వాడిగా, వేడిగా చర్చ కొనసాగుతున్న వేళ దేశంలోని వృత్తి నిపుణులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అమెరికాలో అధికారంలోకి రాబోతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టబోతోందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆఫర్ లెటర్లు పొందిన ఐటీ నిపుణులకు ఆశాభంగం ఎదురవుతోంది. ఆ లెటర్లను కంపెనీలు ఉపసంహరించుకుంటున్నాయి. వీసాలు ఆలస్యమవుతున్నాయి. లేఔట్ల హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

రెంటికీ చెడ్డ రేవడిలా...

తమకు ఇచ్చిన జాబ్ ఆఫర్ లెటర్లను వీసా సంబంధిత సమస్యల కారణంగా కంపెనీలు రద్దు చేస్తున్నాయని కొందరు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అమెరికాలోని టెక్ సంస్థ డిసెంబరులో ఉద్యోగంలోకి తీసుకుంది. విధుల్లో చేరడానికి శాన్‌ఫ్రాన్సిస్కో బయలుదేరేందుకు సిద్ధపడుతుండగా అశనిపాతం వంటి వార్త వచ్చింది. ఆమెకు ఇచ్చిన ఆఫర్‌ను కంపెనీ వెనక్కి తీసుకుంది. కొత్త ఉద్యోగంలో చేరబోతున్నానన్న ఆనందంలో ఆమె ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇప్పుడు ఆ ఇంజినీర్ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. '2024 డిసెంబర్‌లో నాకు జాబ్ ఆఫర్ వచ్చింది. నాకు లిఖితపూర్వకంగా సమాచారం అందడంతో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేశాను. ఇప్పుడు ఏం చేయాలి?' అంటూ ఆవేదనతో ప్రశ్నించారు.

వీసా నిబంధనల్లో వచ్చిన మార్పుల కారణంగా ఆఫర్ లెటర్‌ను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ చెబుతోంది. దీనిపై ఆ మహిళా ఇంజినీర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నన్ను మోసం చేశారు. వీసా స్పాన్సర్ చేయగలమా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోకుండానే నాకు ఉద్యోగం ఎలా ఇచ్చారు? పరిస్థితి చక్కబడిన తర్వాత మళ్లీ ఆఫర్ లెటర్ ఇస్తామని వారు చెబుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిర్దిష్టంగా నిర్ణయం తీసుకుంటామని అంటున్నారు. కానీ నేను ఎంతకాలం ఎదురు చూడాలి?' అని ఆవేదన వ్యక్తం చేశారు.

కారాలు మిరియాలు నూరుతున్న 'మాగా'

అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అందజేసిన సమాచారం ప్రకారం 2023లో జారీ చేసిన 3,80,000 హెచ్-1బీ వీసాల్లో 72 శాతం భారతీయులకే అందాయి. వీరిలో చాలా మంది డాటా సైన్స్, ఏఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో పనిచేస్తున్నారు. వీరికి ఏటా రూ.1.01 కోట్ల వార్షిక వేతనం అందుతోంది. అయితే అమెరికా ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా హెచ్-1బీ కార్యక్రమాన్ని సంస్కరించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తున్నందున ముున్ముందు సవాళ్లు తప్పవని అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు హెచ్-1బీ వీసా అంటేనే మండిపడుతున్న 'మాగా' ఉద్యమకారులు మనపై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఈ కార్యక్రమం అమెరికా ఉద్యోగాలు, వేతనాలను దెబ్బతీస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా వీసా రెన్యువల్స్ కోసం ఎదురు చూస్తున్న వారిని నిరుద్యోగ భయం వెంటాడుతోంది. హెచ్-1బీ వీసా స్పాన్సర్‌షిప్ ఆలస్యమవుతుండడంపై లాస్ ఏంజెల్స్‌లోని సైబర్ సెక్యూరిటీ కన్సల్టెంట్ మాట్లాడుతూ 'ఈ ప్రక్రియను వేగవంతం చేస్తామని మొదట్లో కంపెనీ హామీ ఇచ్చింది. ఇప్పుడేమో వీసా సంస్కరణలపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్నామని చెబుతోంది. ఈ ఎదురు చూపులు ఆవేదన కలిగిస్తున్నాయి' అని చెప్పారు.

వీసా చుట్టూ వివాదం

మాస్టర్ డిగ్రీ కోసం నాగపూర్ నుండి అమెరికా వెళ్లిన మరో యువతి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. 'ఈ ఏడాది మార్చిలో వీసా లాటరీ కోసం నా పేరు రిజిస్టర్ చేస్తామని చెప్పారు. అయితే వారు ఇప్పటికీ ఆ ప్రక్రియ ప్రారంభ దశలను మొదలు పెట్టలేదు. మా హెచ్-1బీని తర్వాత ఫైల్ చేస్తారా? లేక చివరికి మొండిచేయి చూపుతారా?' అని ఆమె మథనపడుతున్నారు. తెలంగాణకు చెందిన ఓ మహిళ వ్యథ మరోలా ఉంది. ఉద్యోగం కోసం ఎదురు చూపుల అనంతరం ఆమె ఇటీవలే డాటా అనలిస్ట్‌గా ఎంపికైంది. అయితే వీసా స్పాన్సర్‌షిప్ గురించి ఇప్పుడు ఏమీ చెప్పడం లేదు. మరోసారి నన్ను నిరుద్యోగం వెంటాడుతుందా? ఏమో...' అని దిగాలుగా అన్నారు. కాలిఫోర్నియాలో పనిచేస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఏమంటున్నారంటే 'నాకు వీసా ఉంది. అయితే మా కంపెనీ ఇటీవలే ఉద్యోగుల తొలగింపును ప్రకటించింది. అదే ఆందోళన కలిగిస్తోంది. ఈ తొలగింపులకు, వీసా సమస్యకు ఏదైనా సంబంధం ఉన్నదా అనే విషయంపై మా కంపెనీ స్పష్టత ఇవ్వడం లేదు. ఒకవేళ ఉద్యోగం పోతే 60 రోజుల్లో మరోటి వెతుక్కోవాల్సి ఉంటుంది. అప్పుడే ఇక్కడ ఉండగలం' అని చెప్పారు. నిరుద్యోగం రికార్డు స్థాయిలో ఉన్నదని, భారతీయ ఇమ్మిగ్రెంట్లలో అస్థిరత పెరుగుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ సమయంలో హెచ్-1బీ స్పాన్సర్‌షిప్‌తో కొత్త ఉద్యోగం దొరకడం కష్టమేనని ఆయన పెదవి విరిచారు.

నిబంధనలు కఠినతరంగా ఉండడంతో యాజమాన్యాలు విదేశాలకు చెందిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి వెనకాడుతున్నారని, స్పాన్సర్‌షిప్‌ల కోసం పెట్టుబడులు పెట్టి తీరా అవి తిరస్కరణకు గురైతే పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారని జార్జియాకు చెందిన ఇమ్మిగ్రేషన్ న్యాయవాది తెలిపారు. దురదృష్టవశాత్తూ ఈ అస్థిరతను ఉద్యోగులే భరించాల్సి వస్తోందని ఆయన అన్నారు.

సంక్రాంతి..సాంప్రదాయాల గొప్ప వేడుక

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ

- కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు
- ప్రధానితోపాటు స్పీకర్ ఓం బిర్లా, చిరంజీవి, క్రీడా, రాజకీయ ప్రముఖుల హాజరు

నవతెలంగాణ -న్యూఢిల్లీ

భారతదేశ సంస్కృతిలో వ్యవసాయం, సాంప్రదాయాలతో లోతుగా పెనవేసుకున్న గొప్ప పండుగ సంక్రాంతి అనీ, పండుగలు సమృద్ధి, కృతజ్ఞత, పునరుద్ధరణ వేడుకలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చెప్పారు. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసంలో సంక్రాంతి సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం కిషన్ రెడ్డి అధికారిక నివాసంలో భోగి వేడులను నిర్వహించారు.



ఈ వేడుకలకు ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరు కాగా... లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, భూపతి రాజు శ్రీనివాస్ రాజు, బండి సంజయ్, తెలంగాణ ఎంపీలు డీకే.అరుణ, అరవింద్, ఈటల రాజేందర్, క్రీడాకారిణి పీవీ.సింధు, ఏఐజీ ఆస్పత్రి చైర్మెన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ముఖ్యనేతలు, తదితరులు పాల్గొన్నారు. తన నివాసానికి వచ్చిన ప్రధాని మోడీని చిరంజీవితో కలిసి కిషన్ రెడ్డి దంపతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మోడి మంత్రోచ్చరణ మధ్య భోగి మంటలను వెలిగించారు.

తరువాత స్పీకర్ ఓంబిర్లా, చిరంజీవితో కలిసి సంక్రాంతి సంబురాలను మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రాష్ట్రాల సంగీత నృత్యాలను ప్రధాని వీక్షించారు. సింగర్ సునీత తన పాటలతో అందర్నీ అలరించారు. వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రధాని మోడీకి కిషన్ రెడ్డి అందజేశారు. కార్యక్రమం అనంతరం ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. తన సహచర మంత్రి జి. కిషన్ రెడ్డి నివాసంలో జరిగిన సంక్రాంతి వేడుకలకు హాజరయినట్లు తెలిపారు. అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించినట్టు పేర్కొన్నారు. తెలుగు, దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగలకు అందరికీ సంతోషం, మంచి ఆరోగ్యం, సంపన్నమైన పంటలు అందించాలని భగవంతుడిని కాంక్షిస్తున్నట్లు ట్వీట్ చేశారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886